సండే మ్యాగజైన్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
20-2-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 20 పేజీలు: 8+16 వెల: 6.50

అమెరికా చరిత్రలో వరస్ట్ అధ్యక్షుడు ట్రంప్!
విషవాయువులు పీల్చి 37 మంది మృతి
5

## కృత్రిమ మేధలో గ్లోబల్ హబ్‌గా 'భారత్'
### ప్రపంచ దిగ్గజ కంపెనీల టెక్ సిఇఒల కితాబు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** భారత్‌లో వారం రోజుల పాటు జరుగుతున్న కృత్రిమమేధ ప్రభావ సదస్సుకు వివిధ దేశాలనుంచి 50 మందికిపైగా సిఇఒలు, 500 మందికి పైగా ప్రతినిధులు >>2



న్యూఢిల్లీలో గురువారం ఎఐ ఇంపాక్ట్ 2026 సదస్సులో వివిధ దేశాధినేతలతో ప్రధాని మోడీ

# ఎఐ సక్సెస్‌కు 'మానవ్' మంత్రం
## కృత్రిమ మేధలోనే ప్రపంచ భవిష్యత్తు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** ఎఐ అనేది కేవలం టెక్నాలజీ మాత్రమే కాదని, అది ఒక పరివర్తన, మానవ చరిత్ర గమనాన్ని మార్చే ఒక చారిత్రాత్మక మలుపు అని ప్రధాన మంత్రి మోడీ పేర్కొన్నారు. ఎఐ అభివృద్ధికి >>2



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ

### వికసిత్ భారత్‌లో ఎఐదే కీలక పాత్ర
### ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ప్రధాన మంత్రి మోడీ
### 'సర్వజనహితాయ' థీమ్‌తో నిర్వహిస్తున్న సదస్సు
### గ్లోబల్ సౌత్ ఈ సదస్సులను చూసి గర్విస్తోంది: ప్రధాని
### 100కు పైగా దేశాల నుంచి హాజరైన అధినేతలు, టెక్ నిపుణులు

## మంత్రుల అవినీతి చిట్టా
# బయటపెడతా
### ఐఎఎస్ అధికారులే మధ్యవర్తులుగా మంత్రులకు కమీషన్లు
### జిహెచ్ఎంసి మూడుముక్కలు దుర్మార్గం: కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి19:** రాష్ట్రంలో కొందరు మంత్రులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొందరు ఐఎఎస్ అధికారులే మధ్యవర్తులుగా ఉంటూ ఆయా మంత్రులకు కమీషన్లు ముట్టజెబుతున్నారని మండిపడ్డారు. మంత్రుల అవినీతితోపాటు ఆయా ఐఎఎస్‌ల భాగోతంపై ఆధారాలను సేకరిస్తున్నామని చెప్పారు. త్వరలోనే వారి బండారాన్ని బయటపెడతామని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా, అఖిల పక్ష సమావేశం లేకుండా, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఒవైసీ కళ్లల్లో ఆనందం చూసేందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీహెచ్ఎంసీని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్ గిరి కార్పొరేషన్లుగా ముక్కలు చేసిందన్నారు. అందులో హైదరాబాద్ జనాభా 7 లక్షలైతే అందులో 30 లక్షలకుపైగా జనాభా ముస్లింలే ఉన్నారని చెప్పారు. భాగ్యనగర్ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నయాపైసా ఇవ్వలేదని, కనీసం తట్టెడు మొరం కూడా పోయలేదని అన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్,బిఆర్ఎస్,మజ్లీస్ పార్టీల చెంపచెల్లుమనిపించారని, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మూసీలో పడేయడం ఖాయమని అన్నారు. అఖిలపక్షం మీటింగ్ లేకుండా, ప్రజాప్రతినిధుల అభిప్రాయం లేకుండా ఏకపక్షంగా జీహెచ్ఎంసీని విభజించడం సిగ్గు చేటు. రేవంత్ రెడ్డి... జీహెచ్ఎంసీని మూడు ముక్కలు ఎందుకు చేశారో సమాధానం చెప్పాలి అని డిమాండ్ >>2



గురువారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్‌తో భేటీ అయిన సిఎం రేవంత్, డిసిఎం భట్టి, మంత్రులు, పిసిసి చీఫ్

### మున్సిపల్ ఫలితాలపై రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే హ్యాపీ
### ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం: మంత్రులు,
### నేతలతో భేటీపై ఎక్స్ వేదికగా కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే స్పందన
### నైనీ బొగ్గు గని టెండర్లు-నేతల మధ్య విభేదాలపై చర్చ
### మళ్లీ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి: పిసిసి చీఫ్ మహేష్

## ప్రజల తెలంగాణే
# లక్ష్యం
### ఈ దిశగా పార్టీ అధిష్ఠానంతో చర్చలు జరిపిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి19:** ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ అధినాయకత్వంతో సమావేశమయ్యారు. గురువారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో జరిగిన సమావేశంలో రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షినటరాజన్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై భేటీలో చర్చించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఫలితాలను ముఖ్యమంత్రి బృందం ఖర్గేకు వివరించారు. తెలంగాణ కాంగ్రెస్ నేతల భేటీపై ఎక్స్ వేదికగా ఖర్గే స్పందించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించిందని, సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారతకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని, తెలంగాణ ప్రజల ఆంక్షలు నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అలాగే ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన నేపథ్యంలో రేవంత్ రెడ్డి సర్కార్ పని తీరుపై ఈ భేటీలో లోతైన సమీక్ష చేశారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపైనా ప్రధానంగా చర్చించినట్టు సమాచారం. సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల తెలంగాన లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణను రూపొందించినట్లు పేర్కొన్నారు. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత,ప్రతి పౌరుడికి న్యాయం అందించడం తమ ప్రధాన సంకల్పమని ఆయన వెల్లడించారు. రాజ్యసభ స్థానాలకు అభ్యర్థుల భర్తీ, నైనీ బొగ్గు గనిపై వచ్చిన ఆరోపణలు, నాయకుల మధ్య తలెత్తిన విభేదాలు కూడా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. మేడారం జాతరను ఘనంగా నిర్వహించడంపై సీతక్కను కాంగ్రెస్ అగ్రనేతలు అభినందించారు. ఆదివాసీ అతిపెద్ద జాతర మేడారంపై పది నిమిషాల పాటు చర్చ జరిగింది. మేడారం జాతర చరిత్ర, ప్రాశస్తంపై మంత్రి సీతక్కను వివరాలు అడిగి ఖర్గే, రాహుల్ గాంధీ తెలుసుకున్నారు. సమ్మక్క సారలమ్మల పోరాట గాథను వారు ఆసక్తిగా విన్నారు. సమ్మక్క సారలమ్మల చరిత్రను దేశవ్యాప్తంగా చాటేలా సినిమా తీయాలని రాహుల్ గాంధీ సూచించారు. మేడారం జాతరకు >>2



## 26 నుంచి బడ్జెట్ అసెంబ్లీ?
### 23న కేబినెట్ భేటీలో నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి19:** ఈ నెల 26 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాల విశ్వసనీయ సమాచారం. దానిపై ఈనెల 23న జరగబోయే >>2

# 'పార్టీలైన్' దాటితే ఎలా?



### అనైతిక పొత్తులపై నివేదిక కోరిన బిజెపి అధిష్ఠానం
### పలుచోట్ల కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు పరోక్ష మద్దతివ్వడంపై ఆగ్రహం
### జిల్లాల వారీగా జాబితా సిద్ధం చేసిన బిజెపి రాష్ట్ర నాయకత్వం

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** తెలంగాణలో బీజేపీలో మున్సిపల్ ఎన్నికలు కాకరేపుతున్నాయి. హంగ్ వచ్చిన చోట పార్టీ ప్రజాప్రతినిధులు పార్టీ లైన్‌ను అతిక్రమించడంపై బీజేపీ అధిష్టానం తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు సమాచారం. రాష్ట్రంలో బీజేపీ పుంజుకుంటున్న తరుణంలో ప్రత్యర్థి పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్‌లతో బీజేపీ నేతలు కుమ్మక్కు అయ్యారన్న అంశం అధిష్టానాన్ని ఆగ్రహానికి గురిచేస్తోంది. అదేసమయంలో హంగ్‌వచ్చిన మున్సిపాలిటీల్లో కమలం పార్టీ వైఖరిపై రాష్ట్ర రాజకీయాలతో పాటు బీజేపీ నేతల్లో అంతర్గతంగా తీవ్ర చర్చ జరుగుతోంది. కాషాయ దళం ఒక్కో మున్సిపాలిటీలో ఒక్కోలా వ్యవహరించడంతో అసలు కమలనాథులు ఎటున్నారన్న అంశం రాజకీయ గందరగోళానికి దారి తీసింది. బీజేపీ రాష్ట్ర నాయకత్వం ముందు నుంచీ అనైతిక పొత్తులు పెట్టుకోబోం, ఎవరితో కలవబోమని ప్రకటించింది. ఆ మేరకు కొన్ని మున్సిపాలిటీల్లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఉన్నా మేయర్, ఛైర్మన్ అవకాశాన్ని వదిలేసుకుంది. అయితే మరికొన్ని చోట్ల మాత్రం సిద్ధాంతాలు, పార్టీ క్రమశిక్షణా నియామవళి, పార్టీలైన్ వీటన్నింటినీ పక్కన పెట్టేసి అధికారంకోసం ప్రత్యర్థులతో జతకట్టిన బీజేపీ రాజకీయ విశ్లేషకులు, ప్రజలు చివరకు బీజేపీ శ్రేణులను ముక్కున వేలేసుకునేలా చేసింది. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే మున్సిపాలిటీల్లో ఎక్స్‌అఫిషియో సభ్యులుగా నమోదు చేసుకున్నారు.ముందే అంచనాలు వేసుకుని పార్టీకి అవసరం అనుకున్న చోట నమోదు చేసుకున్నారు. అయితే.. బీజేపీలో సీనియర్ నేతలు, ఎంపీలుగా ఉన్న రఘునందన్‌రావు, ఈటలరాజేందర్ అందుకు భిన్నంగా వ్యవహరించారు. అసలు ఎవరూ ఊహించని చోట ఆ ఎంపీలు ఎక్స్‌అఫిషియో ఓటర్స్‌గా నమోదు చేసుకున్నారు. దీంతో ఎంపీలు ఈటల రాజేందం, రఘునందన్‌రావు వ్యవహారశైలిపై ప్రధాని మోడీతో సహా బీజేపీ కేంద్ర నాయకత్వం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల అనంతరం జరిగి ఛైర్మన్ ఎంపిక సందర్భంగా ఇస్నాపూర్‌లో బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఏకంగా బీఆర్ఎస్‌కు ఓటు వేయడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అటు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎల్లంపేటలో కూడా బీజేపీ, బీఆర్ఎస్‌కు మద్దతు పలికింది.అయితే ఈటల అక్కడ ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా పేరు నమోదు చేసుకున్నప్పటికీ ఓటు >>2



గురువారం ఆదిలాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న హరీష్‌రావు

# బాల్క సుమన్ అరెస్టు అక్రమం
### ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న రేవంత్
### క్యాతనపల్లిలో దళిత, గిరిజన మహిళా కౌన్సిలర్లపై దౌర్జన్యం
### ఆదిలాబాద్ జైల్లో బాల్క సుమన్‌ను పరామర్శించిన హరీష్ రావు

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం అరెస్టు అయి ఆదిలాబాద్ సెంట్రల్ జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నాయకులను గురువారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న విద్యార్థి నాయకుడు బాల్క సుమన్ తో పాటు రాజిరెడ్డి, అనిల్, లక్ష్మీకాంత్ లను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని హరీష్ రావు విమర్శించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి, ఆసిఫాబాద్ లలో జైళ్లు ఉన్నప్పటికీ కక్షపూరితంగా 200 కిలోమీటర్ల దూరంలోని ఆదిలాబాద్ జైలుకు తరలించడం దుర్మార్గమన్నారు. క్యాతనపల్లిలో 22 స్థానాలకు గాను 14 స్థానాలు బిఆర్ఎస్ కూటమి గెలుచుకుందని, ప్రజలు ఇచ్చిన తీర్పును మంత్రి వివేక్‌వెంకటస్వామి శిరసావహించాల్సిందిపోయి దొడ్డిదారిన అధికారంలాక్కోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కోరంఉన్నప్పటికీ ఛైర్మన్ ఎన్నిక రోజునకావాలని పోలీసు బందోబస్తు లేకుండా చేసి ఎన్నికను వాయిదా వేయించారని పేర్కొన్నారు. అధికారులు, పోలీసుల సమక్షంలోనే దళిత, గిరిజన మహిళ కౌన్సిలర్ల పై కాంగ్రెస్ నేతలు అసభ్యంగా ప్రవర్తించారని మహిళలపై చేయి చేసుకున్నారని ఆయన ఆక్షేపించారు. మహిళల ఫిర్యాదును రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్లో స్వీకరించలేదని అన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు మద్యం సేవించి సమావేశానికి వచ్చిన కేసులు నమోదు చేయలేదని, రాజిరెడ్డి వాహనం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోలేదని, కానీ బిఆర్ఎస్ కౌన్సిలర్లపై మాత్రం అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపించారు. అయితే ఇతర నాయకులను లోపలికి అనుమతించకపోవడంతో పోలీసులకు బిఆర్ఎస్ శ్రేణులకు మధ్య తోపులాట చోటుచేసుకుని స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. హరీష్ రావు వెంట బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ షమీపూర్ రాజు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, భోథ్ ఎమ్మెల్యే అనిల్ యాదవ్, మాజీఎమ్మెల్యేలు జోగు రామన్న, దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



### జిహెచ్ఎంసి విభజనపై హైకోర్టులో
# పిటిషన్
### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 19:** జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించడంపై తెలంగాణ కోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. జీవో నంబర్ 55ను సవాల్ చేస్తూ కోర్టులో గురువారెడ్డి అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. ఈ రిట్‌పిటిషన్‌పై హైకోర్టు >>2




### రూ.13 వేల కోట్ల
# జిఎస్‌టి మోసం!
### హైదరాబాద్‌లో బట్టబయలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి19:** హైదరాబాద్‌లో రూ. 13 వేల కోట్ల జిఎస్‌టి మోసం బట్టబయలైంది. >>2

# అన్నీ ఉచితంగా ఇచ్చేస్తారా?




### ఇదేం సంస్కృతి.. నిధులు ఎలా?
### 'ఉచితా'లపై సుప్రీంకోర్టు ఆందోళన
### తమిళనాడు ఉచిత విద్యుత్‌పై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఉచితాల తాయిలాలు ప్రకటనలు, హామీలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఉచిత ఆహారం, ఉచిత విద్యుత్తును అందించడం కొనసాగిస్తే రాష్ట్రాలు వాస్తవ అభివృద్ధికి ఎలా నిధులు సమకూర్చుకుంటాయో చెప్పాలని కోర్టు డిమాండ్ చేసింది. దేశ ఆర్థికాభివృద్ధిని దెబ్బతీసే విధంగా ఉచితాల పంపిణీ చేయడం సమంజసం కాదని వ్యాఖ్యనించింది. రాష్ట్రాలు ఉచితాలకంటే ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి పెట్టాలని సూచించింది. రాష్ట్రాలు >>2

## హామీల మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలి
### సిఎంకు రాసిన బహిరంగ లేఖలో కెటిఆర్
7

## 26 నుంచి బడ్జెట్ అసెంబ్లీ?

>> కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 28న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశాలు దాదాపు 10 నుంచి 15 రోజులు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈసారి బడ్జెట్ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయం మరింత ఆసక్తిగా ఉండనుంది. ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని చూస్తున్నాయి. 6 గ్యారెంటీల అమలు 13 అంశాల హామీలపై తదితర రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి ప్రాజెక్టులు, యూరియా కొరత, ఉద్యోగ నియామకాలు, హిల్ట్ పాలసీ వంటి సమస్యలపై అసెంబ్లీ వేదికగా గళమెత్తనున్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్షాల దాడిని సమర్థవంతంగా ఎదుర్కోవాలనే అంశాలపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈసారి బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్షనేత, మాజీ సీఎం కేసీఆర్ వస్తారా? లేదా అనే ప్రశ్నలు కూడా వస్తున్నాయి. ఒకవేళ కేసీఆర్ బడ్జెట్ సమావేశాలకు హాజరైతే మరింత ఇంట్రెస్టింగ్‌గా ఉండే అవకాశం ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3,04,965 కోట్ల అంచనా వ్యయంతో కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఆ బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ 6 గ్యారంటీలకు సుమారు రూ.56,084 కోట్లను కేటాయించారు. క్రితం సారి రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా వెల్లడించారు. రాష్ట్రం రుణాలు రూ.5,04,814 కోట్లుగా ఉన్నాయని తెలిపారు. ఈసారి బడ్జెట్ సమావేశాల్లో ఆరు గ్యారెంటీల ప్రస్తావన కూడా ప్రతిపక్ష ఎమ్మెల్యేల నుంచి రానున్నట్లు సమాచారం.

## రూ.13 వేల కోట్ల జిఎస్‌టి మోసం!

>> కేసులో గేమింగ్ సంస్థ యాడ్సన్ అడ్వైజరీ సర్వీస్ సంస్థ డైరెక్టర్ పంకజ్ కుమార్‌ను జిఎస్‌టి నిఘా విభాగం అరెస్టు చేసింది. మోసాన్ని హైదరాబాద్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్ బహిర్గతం చేసింది. షెల్ కంపెనీలకు నకిలీ కెవైసి వెరిఫికేషన్లు ఇచ్చినట్లు గేమింగ్ సంస్థపై ఆరోపణలున్నాయి. పేమెంట్ గేట్‌వేలు, బ్యాంకింగ్ యాజ్ పేమెంట్ అగ్రిగేటర్ వ్యవస్థలతో ఈ సంస్థకు లింకులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. టెక్నాలజీ సర్వీస్ ప్రొవైడర్లతో కూడిన పిన్‌టెక్ కంపెనీల సహాయంతో అక్రమ ఆన్‌లైన్ గేమింగ్ వెబ్ సైట్లను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ సిండికేట్‌లో పంకజ్ కుమార్‌ను కీలక సూత్రధారుల్లో ఒకరిగా గుర్తించారు. ఆన్‌లైన్ గేమింగ్ నుంచి వచ్చే నగదు ప్రవాహానికి అవసరమైన యూపిఐ ఇంటిగ్రేషన్ కోసం షెల్ కంపెనీలను చేర్చుకోవడంలో అతడు సహాయపడినట్లు జిఎస్‌టి నిఘా విభాగం గుర్తించింది. ఆన్‌లైన్ గేమింగ్ సిండికేట్ ద్వారా లభించిన అక్రమ ఆదాయాన్ని పొందిన లబ్దిదారుల్లో ఈయన కూడా ఒక రు. ఈ క్రమంలోనే హైద రాబాద్ ఆన్‌లైన్ గేమింగ్ సిండికేట్లపై డిజిజిఐ అణిచివేత చర్యలను షురూ చేసింది. సంస్థకు చెందిన రూ.100 కోట్ల నగ దు ఉన్న బ్యాంకు ఖాతాల ను అధికారులు ఫ్రీజ్ చేశారు.

## కోర్టులో హాజరు నుంచి మినహాయింపు

### సిఎం రేవంత్ క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి19:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారన చేపట్టింది. భూపాలపల్లి,మొగులపల్లి పోలీస్ స్టేషన్‌లో 2023లో రేవంత్‌రెడ్డిపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి భూపాపల్లి కోర్టులో హాజరు నుంచి హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. బహిరంగ సభల్లో తనపై తీవ్ర ఆరోపణలు చేశారంటూ బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు రేవంత్‌పై 2 కేసులు నమోదయ్యాయి. ఈ రెండు కేసులను కొట్టివేయాలని రేవంత్‌రెడ్డి క్వాష్ పిటీషన్ దాఖలు చేశారు. గురువారం దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది. కోర్టులో రేవంత్‌రెడ్డి హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. కౌంటర్ దాఖలుకు గండ్ర తరఫున న్యాయవాది సమయం కోరడంతో తదుపరి విచారణను న్యాయస్థానం 3 వారాలకు వాయిదా వేసింది.

## 'పార్టీలైన్' దాటితే ఎలా?

>> వేయకపోవడంపై అధిష్టానం గుర్రుగా ఉంది. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా, బద్ధ శత్రువులైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో ఈ రహస్య పొత్తులేంటని ఢిల్లీ పెద్దలు మండిపడుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ వెంటనే రంగంలోకి దిగారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు ఫోన్ చేసి పూర్తి వివరాలు కోరినట్టు సమాచారం. అలాగే బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ కూడా రాంచందర్‌రావును కలిసి ఈ వ్యవహారంపై సుదీర్ఘంగా చర్చించినట్టు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ లైన్ దాటి ఎవరెవరు ఎక్కడెక్కడ పొత్తులు పెట్టుకున్నారో, ప్రత్యర్థులకు ఎలా సహకరించారో నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లుగా సమాచారం. అధిష్టానం ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ లైన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించిన పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు అపవిత్ర పొత్తులపై లిస్ట్ సిద్ధం బీజేపీ రాష్ట్ర నాయకత్వం కూడా ఇప్పటికే జిల్లాల వారీగా జాబితా సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈ నివేదిక ఆధారంగా క్రమశిక్షణ ఉల్లంఘించిన లీడర్లపై కేంద్ర బీజేపీ కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. సొంత పార్టీ అభ్యర్థులను కాదని, ప్రత్యర్థులతో చేతులు కలిపిన కీలక నేతలకు ఈసారి అధిష్టానం గట్టి వార్నింగ్ ఇవ్వన్నట్లుగా తెలుస్తోంది. ఇక తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను కైవసం చేసుకుంది. ఈ ఎన్నికల్లో బీజేపీ సాధించిన అతిపెద్ద విజయం ఇదే. కరీంనగర్‌లో బీజేపీ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించడమే కాకుండా, తన బలాన్ని నిరూపించుకుంటూ మేయర్, డిప్యూటీ మేయర్ పీఠాలను దక్కించుకుంది. ఇక్కడ బీజేపీ మొత్తం 66 డివిజన్లలో 30 స్థానాలను గెలుచుకుంది. స్వతంత్రుల మద్దతుతో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలలో బీజేపీ ఒక చైర్మన్ పదవిని, ఏడు వైస్‌చైర్మన్ పదవులను దక్కించుకుంది. ముఖ్యంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 21 వార్డులను గెలుచుకుని బీజేపీ పెద్ద పార్టీగా నిలిచింది.

## అవినీతి చిట్టా బయటపెడతా

>> చేశారు. జీహెచ్‌ఎంసీలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉంది. బీజేపీకి భయపడి హిందూ సమాజ ఓట్లను చీల్చడానికే జీహెచ్‌ఎంసీని మూడు ముక్కలు చేశారు. టీపీసీసీ కాదు.... టీ4సీ... తెలంగాణ కరప్షన్, కమీషన్, కలెక్షన్, కాంగ్రెస్. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు మూటలు అప్పగించడానికే పరిమితమవుతున్నారే తప్ప తెలంగాణకు చేసిందేమిటో చెప్పాలి?. రిటైర్డ్ ఉద్యోగుల బెన్ ఫిట్స్ ఇవ్వకుండా వారి ఉసురు తీసుకుంటున్నరు. ఇదేమిటని ప్రశ్నిస్తున్న వృద్ధులను గుంజుకుపోయి జైల్లో వేయడానికి సిగ్గు లేదా? రాష్ట్రంలో కొందరు మంత్రులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారు. వారి అవినీతిపై ఆరా తీస్తున్నాం. ఆధారాలను సేకరిస్తున్నాం. ఆయా మంత్రుల అవినీతికి కొందరు ఐఏఎస్ అధికారులే మధ్యవర్తులుగా ఉన్నారు. అతి త్వరలో మంత్రుల కమీషన్ల చిట్టా, ఐఏఎస్ అధికారుల దందాలన్నీ బయటపెడతాం. ఐఏఎస్ అధికారులారా....2047 వికసిత్ భారత్ లక్ష్యాలు నెరవేరేదాకా బీజేపీ ప్రభుత్వమే కొనసాగుతోంది. 2029 నాటికి దేశంలోని ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పాలన ఉండదు. మంత్రి పదవులను అడ్డుపెట్టుకుని బరితెగించి బీజేపీని అడ్డుకోవాలనుకుంటే... మీ సంగతి చూస్తాం. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ నేతలను మంత్రులు ఇబ్బంది పెట్టారు. ఆయా మంత్రుల మెడలు వంచుతాం...6 గ్యారంటీలు అమలయ్యేలా చేస్తాంభాగ్యనగర్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లు, సిద్దిపేట మున్సిపాలిటీ అభివృద్ధి కావాలంటే...మోదీ ప్రభుత్వ నిధులే శరణ్యం. రాబోయే ఎన్నికల్లో ఆయా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కాషాయ జెండాను ఎగరేయబోతున్నాం అని ధీమా వ్యక్తం చేశారు.



న్యూఢిల్లీలో గురువారం ఎఐ ఇంపాక్ట్ 2026 సదస్సులో టెక్ దిగ్గజాలతో ప్రధాని మోడీ



సదస్సుకు హాజరైన వివిధ దేశాల అధ్యక్షులు, ప్రధానులతో పిఎం మోడీ

# ఎఐ సక్సెస్‌కు 'మానవ్' మంత్రం

>> భారత దేశమే సరైన వేదిక అని స్పష్టం చేశారు. ఎఐ ఇంపాక్ట్ సదస్సు 2026లో భాగంగా గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన ముఖ్య కార్యక్రమాన్ని ఉద్దేశించి మోడీ కీలకోపన్యాసం ఇచ్చారు. 100కు పైగా దేశాల నుంచి వచ్చిన నాయకులు, టెక్ నిపుణులతో సదస్సు ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఎఐ టెక్నాలజీని చూసి కొందరు భయపడుతున్నారని, కానీ అందులో దేశ భవిష్యత్తును భారత్ చూస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. దేశ భవిష్యత్ వికాసంలో మైలురాయిలా ఏఐ నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సానుకూల, ఆశావాద దృక్పథంతో ఎఐ ఆవిష్కరణలను భారత్ స్వాగతిస్తోందన్నారు. ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) టెక్నాలజీ ప్రజాస్వామికీకరణ జరగాలని భారత్ కోరుకుంటోందని ప్రధానమంత్రి వెల్లడించారు. ప్రత్యేకించి గ్లోబల్ సౌత్ దేశాలకూ ఎఐ ఫలాలు అందాలన్నారు. అందుకే సర్వజన హితాయ, సర్వజన సుఖాయ (అందరి సంక్షేమం, అందరి సంతోషం) అనే థీమ్‌తో ఎఐ ఇంపాక్ట్ సదస్సును భారత్ నిర్వహిస్తోందని తెలిపారు. చారిత్రక ఎఐ సదస్సును భారత్ నిర్వహిస్తుండటం యావత్ గ్లోబల్ సౌత్‌కు గర్వకారణమన్నారు. కొత్త టెక్నాలజీని తయారు చేయడంతో పాటు దాన్ని అందిపుచ్చుకోవడంలోనూ భారత్ ముందుంటుందని ఆయన తెలిపారు. ప్రపంచంలోనే అత్యధికంగా టెక్ నిపుణులు లభించే కేంద్ర బిందువుగా భారత్ ఎదిగిందన్నారు. నైతికత, జవాబుదారీతనం, మానవ హక్కులే కేంద్రంగా సాగాల్సిన ఎంఎఎన్ఎవి (మానవ్) దార్శనికతను ఆయన ప్రపంచం ముందుంచారు. ఏఐ అభివృద్ధిలో భారత్ అనుసరించబోయే ఐదు సూత్రాల విధానాన్ని ప్రధాని మోడీ వివరించారు. ఎంఎఎన్ఎవి అనే పదానికి ఆయన ఇచ్చిన నిర్వచనం సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎం - మోరల్ అండ్ ఎథికల్: నైతిక విలువలతో కూడిన వ్యవస్థ, ఎ - అకౌంటబుల్ గవర్నెన్స్: జవాబుదారీతనంతో కూడిన పాలన, ఎన్ - నేషనల్ సావర్నిటీ: జాతీయ సార్వభౌమాధికారం, ఎ - యాక్సెసిబుల్ టెక్నాలజీ: అందరికీ అందుబాటులో ఉండే సమ్మిళిత సాంకేతికత, వి - వాలిడేటెడ్ సిస్టమ్ : చట్టబద్ధమైన, చెల్లుబాటు అయ్యే వ్యవస్థలు అని ప్రధాని మోడీ వివరించారు.

**ఎఐకు సరైన దిశ లేకుంటే విధ్వంసమే**

'ఎఐ అనేది విప్లవాత్మక శక్తి. దానికి సరైన దిశ అనేది లేకుంటే, అదొక విధ్వంసంలా పరిణమిస్తుంది. అందరి సంక్షేమం, అందరి సంతోషం అనే థీమ్‌తో ఈ సదస్సును మేం నిర్వహిస్తున్నాం. దీన్నిబట్టి ఏఐను భారత్ ఎలా చూస్తోందో అందరూ స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. మేం అందరి సంక్షేమం, అందరి సంతోషం కోసమే ఏఐను వినియోగిస్తాం" అని ప్రధాని మోడీ వెల్లడించారు. "ఎఐ టెక్నాలజీ అనేది మానవ సామర్థ్యాలను పెంచుతుంది. దీన్ని అందిపుచ్చుకునేందుకు మనం కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలి. ఇప్పటికే ఉన్న స్కిల్స్ ను మెరుగుపర్చుకోవాలి. జీవితాంతం కొత్తకొత్త అంశాలను నేర్చుకుంటూ ముందుకుసాగాలి. తద్వారా మానవ కేంద్రిత ఎఐ సాకారం అవుతుంది. ఎఐ దృష్టిలో మనుషులు కేవలం డేటా పాయింట్స్ లాంటివారు. అందుకే ఎఐ టెక్నాలజీని ప్రపంచంలో అందరికీ అందుబాటులోకి తేవాలి. ఆకాశమే హద్దుగా వ్యాపించే అవకాశాన్ని ఎఐకు మనం ఇవ్వాలి. కాకపోతే, జిపిఎస్‌లా దాని కమాండ్‌ను మన చేతుల్లోనే పెట్టుకోవాలి. మనకు అవసరమైనప్పుడే జిపిఎస్‌ను వినియోగిస్తాం. లేదంటే వినియోగించం. డీప్ ఫేక్స్ కట్టడి, ఎఐ జనరేటెడ్ కంటెంట్‌పై మార్గదర్శకాలు వంటి విషయాల్లో వెంటనే అంతర్జాతీయ ప్రమాణాల రూపకల్పన జరగాలి. డీప్ ఫేక్స్, ఎఐ జనరేటెడ్ కంటెంట్‌తో సామాజిక అస్థిరతను క్రియేట్ చేసే ముప్పు ఉంటుంది. అందుకే ప్రజలు అసలైన కంటెంట్‌ను, ఎఐ కంటెంట్‌ను నిర్దిష్టంగా గుర్తించేలా ప్రత్యేక లేబుల్స్ ను తప్పక వినియోగించాలి" అని ప్రధాని మోడీ చెప్పారు.

**ఏఐకి భారత్ సరైన వేదిక**

ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా, అత్యధిక టెక్ టాలెంట్ కలిగిన భారత్.. ఏఐ అభివృద్ధికి బలమైన కేంద్రంగా నిలుస్తుందని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. "అందరి సంక్షేమం కోసం, అందరి శ్రేయస్సు కోసం అనే థీమ్‌తో భారత్ అడుగులు వేస్తోంది. మనం భవిష్యత్ తరాలకు ఎలాంటి ఎఐని వదిలి వెళ్తున్నామనేదే నేటి అసలు బాధ్యత" అని ఆయన అన్నారు. ఎఐ గతంలో వైర్‌లెస్ కమ్యూనికేషన్ మొదలైనప్పుడు ప్రపంచం ఇంతలా అనుసంధానమవుతుందని ఎవరూ ఊహించలేదని, ఇప్పుడు ఎఐ కూడా అటువంటి పరివర్తననే తీసుకువస్తుందని ప్రధాని మోడీ అన్నారు. "యంత్రాలు తెలివైనవిగా మారుతున్నాయి. ఇది మానవ సామర్థ్యాలను కొన్ని వందల రెట్లు పెంచుతుంది. అయితే మానవులు కేవలం డేటా పాయింట్లుగా మిగిలిపోకూడదు.. వారి సాధికారతే లక్ష్యంగా ఎఐ ఉండాలి" అని మోడీ స్పష్టం చేశారు. ఈ సదస్సుకు 100 కంటే ఎక్కువ దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా, అబుదాబి క్రౌన్ ప్రిన్స్, శ్రీలంక అధ్యక్షుడు, మారిషస్ ప్రధాని సహా పలువురు ప్రముఖులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## హైకోర్టులో పిటిషన్

>> గురువారం విచారణ చేపట్టింది. 2027 జనగణన నేపథ్యంలో రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా జారీ చేసిన సర్క్యులర్ నంబర్ 01 ప్రకారం.. జ్యూరీ డిస్టింక్షన్ ఫ్రీజ్ అమల్లో ఉందని పిటిషనర్ వాదనలు వినిపించారు. మున్సిపల్ సరిహద్దులు మార్చడం, స్థానిక సంస్థల పునర్వ్యవస్థీకరణ చట్ట విరుద్ధమని పిటిషనర్ తెలిపారు. జీవో నంబర్ 55ను రద్దు చేయాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ ధర్మాసనం విచారణ చేసింది. పిటిషనర్ వాదనలు విన్న అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని రెండు ప్రభుత్వాలనూ ఆదేశించింది.

## వారం - వర్జ్యం

20-02-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శతభిషం కార్తె
తదియ మ.2.36
ఉత్తరాభాద్ర రా.8.05
వర్జ్యం : ఉ.7.35-9.07
దు.ఉ.8.52-9.39, 2) మ.12.46-1.33
శుభసమయం: ఉ.8.00-9.00, సా.5.00-6.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** కుటుంబంలోనివారి ఆరోగ్య విషయమై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తారు. ఆర్థిక సర్దుబాట్లలో మీ వ్యూహాలు ఫలిస్తాయి. వస్త్రలాభం.

**వృషభం:** ప్రజాసంబంధాలు మెరుగ్గా ఉంటాయి. నిర్మాణాత్మకమైన నిర్ణయాలను అమలు చేయుటకు తగిన వ్యక్తులను కలుస్తారు.

**మిథునం:** బరువైన కొన్ని బాధ్యతలను దించుకుంటారు. వెనువెంటనే కాకపోయినా మీ నిజాయితీ శ్రమ గుర్తింపుకు వస్తాయి.

**కర్కాటకం:** వ్యక్తిగత అవసరాలకు, సదుపాయాలకు ధనం అధికంగా ఖర్చు చేస్తారు. బంధువులతో మాటపట్టింపులు రావచ్చు.

**సింహం:** కుటుంబసభ్యుల సహాయ సహకారాలను అందుకుంటారు. ప్రేమ విషయాలలో పురోగతి సాధిస్తారు.

**కన్య :** ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. మీరంటే ఓర్వలేనివారితో ఈ రోజు కొంత ఇబ్బందికి గురవుతారు.

**తుల :** దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడతారు. అందరిలోనూ ప్రత్యేక గుర్తింపు పొందుతారు. వ్యాపారంలో ఆశ్చర్యకరమైన మలుపులు.

**వృశ్చికం:** ప్రభుత్వపరంగా రావలసిన ఆర్డర్స్ చేతికందుతాయి. కుటుంబ బరువు బాధ్యతలు అధికం అవుతాయి.

**ధనుస్సు:** మధ్యవర్తి వ్యవహారాలు లాభించవు. గతంలో సహాయం చేసిన ఒకరికి తిరిగి మీరు ప్రత్యుపకారం చేస్తారు.

**మకరం:** ప్రత్యర్థి వర్గంలో గ్రూపు రాజకీయాలను మీకు అనుకూలముగా మార్చుకోవడానికి వ్యూహాలను పన్నుతారు.

**కుంభం:** మీ స్వయంకృషి వల్ల, శక్తి సామర్థ్యాల వల్ల కార్యాలయంలో ప్రతిష్ఠాత్మకమైన ఒక ఉన్నత స్థానాన్ని సంపాదించుకొంటారు.

**మీనం:** మానవత్వం అక్కడక్కడా మిగిలి ఉందని ఋజువుచేసే విధంగా కొన్ని సంఘటనలు జరుగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రజల తెలంగాణే లక్ష్యం

>> ఆహ్వానిస్తే తాము తప్పక హాజరయ్యేవారమని రాహుల్ గాంధీ, ఖర్గే అన్నారు. ఆహ్వానిస్తే తాను కూడా తల్లుల దర్శనానికి వచ్చే వాడినని ఖర్గే తెలిపారు. సమయాభావం వల్ల వ్యక్తిగతంగా ఆహ్వానించలేకపోయినట్లు మంత్రి సీతక్క వివరించారు. వచ్చే జాతరకు తప్పకుండా అధికారిక ఆహ్వానం అందిస్తామని మంత్రి చెప్పారు. ఆహ్వానం అందితే తప్పక వస్తామని రాహుల్ గాంధీ, ఖర్గే హామీ ఇచ్చారు. వచ్చే మూడు సంవత్సరాల తర్వాత కూడ రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. దిల్లీలో అధిష్ఠానంతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్ చెప్పిన హామీలన్నీ అమలు చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో 80 శాతం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని మహేశ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. ఖర్గే వద్ద జరిగిన సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డితో పాటు డిపూనయటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు,కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,దామోదర రాజనర్సింహ, అడ్లూరి లక్ష్మణ్,అజహరుద్దీన్,పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క,కొండా సురేఖ,ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.



భువనేశ్వర్‌లో గురువారం ఒడిశా అసెంబ్లీలో ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష ఎమ్మెల్యేలు

# అన్నీ ఉచితంగా ఇచ్చేస్తారా?

>> ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పనిచేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అన్నీ ఉచితంగా పంచుకుంటూపోతే అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా మిగలదని పేర్కొంది. ఇది ఒక్క తమిళనాడు సమస్యే కాదని, అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని తెలిపింది. తమిళనాడు ఎన్నికల వేళ డీఎంకే ఉచిత విద్యుత్ ప్రతిపాదనపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. గురువారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం విచారించింది. తమిళనాడు ప్రభుత్వ తరఫున సీనియర్ అడ్వకేట్ గోపాల్ సుబ్రమణియం వాదనలు వినిపించారు. బిల్లు చెల్లించలేని పేదలకు సహాయం చేయడం అర్థవంతమైన చర్య అని, కానీ, కానీ ఆర్థిక స్థోమత ఉన్నవారికీ, లేనివారికీ తేడా లేకుండా ఉచితాలు ఇవ్వడం సరైందా? అంటూ సిజెఐ ప్రశ్నించారు.

ఉచితాలను విచక్షణారహితంగా పంపిణీ చేయడం, ముఖ్యంగా యుటిలిటీలు, సేవలకు చెల్లించగలిగే వారికి, పని చేయకపోవడానికి ప్రతిఫలంగా కనిపించే సంస్కృతిని సృష్టించిందని కోర్టు హెచ్చరించింది. ఈ పథకాన్ని "చివరి నిమిషంలో" ఎందుకు ప్రకటించారో వివరించాలని కూడా కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. విద్యుత్ పంపిణీ కంపెనీలు సుంకాలు, బడ్జెట్ లెక్కలను సర్దుబాటు చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. "మనం దేశమంతటా ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నాము?" "మీరు ఉదయం నుండి ఉచిత ఆహారం ఇవ్వడం ప్రారంభిస్తే... తర్వాత ఉచిత సైకిల్... ఆపై ఉచిత విద్యుత్... ఇప్పుడు మనం ప్రజల ఖాతాలోకి నేరుగా నగదును బదిలీ చేసే దశకు చేరుకున్నాము... ఊహించుకోండి" అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. "సంక్షేమ వ్యవస్థలో భాగంగా, చెల్లించలేని వారికి అందించడం అర్థమయ్యేదే. కానీ మీరు ఆర్థిక స్థోమత ఉన్నవారు. ఆర్థిక స్థోమత లేనివారు అనే తేడా లేకుండా పంపిణీ చేస్తే... "విద్యను భరించలేని పిల్లలు ఉన్నారు. అప్పుడు రాష్ట్రం అందించాలి... అది రాష్ట్ర విధి. కానీ సంపన్నులు (కానీ ఇప్పటికీ) ఉన్నవారు ఏదైనా రకమైన ఉచితాన్ని ముందుగా వారి జేబులోకి తీసుకుంటారు. రాష్ట్రాలు ఈ విధాన చట్రాలను పునఃసమీక్షించాల్సిన సమయం కాదా?" అని ప్రధాన న్యాయమూర్తి అడిగారు. ఈ మేరకు తమిళనాడు విద్యుత్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలంటూ కేంద్రానికి, తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

## రాష్ట్ర వ్యాప్తంగా యూరియా యాప్...

### యాప్ ద్వారానే యూరియా పంపిణీ: మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం యూరియా బుకింగ్ యాం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రైతులు యూరియా కోసం ఇబ్బందులు ఎదుర్కొకూడదనే ఉద్దేశంతో ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. తొలి విడతలో ప్రయోగాత్మకంగా అయిదు జిల్లాల్లో మాత్రమే ఈ యాప్ సేవలు అందించగా.. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం ముహూర్తం కూడా ఫిక్స్ చేసింది. వచ్చే యాసంగి సీజన్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా యూరియా బుకింగ్ యాప్‌ను అమలు చేయనన్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజాగా ప్రకటించారు.

రైతులకు అవసరమైన సమయంలో వెంటనే యూరియా అందించడంతోపాటు కొరతను నివారించేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతులు క్యూలైన్లలో నిల్చోని యూరియా కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం లేకుండా వారి సమయాన్ని ఆదా చేసేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇది అమల్లోకి తీసుకొస్తున్నామని, దీని వల్ల యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బంది పడే పరిస్థితి ఉండదని తుమ్మల స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ పేరుతో రైతులు ఇంటి వద్దనే మొబైల్ నుంచి యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యం తీసుకొచ్చింది.

## రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాల ఏర్పాటుకు రూ.5.80 కోట్లు విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి19:** రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లా సమీకృత భవన సముదాయ ప్రాంగణాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం రూ.5.80 కోట్లను విడుదల చేసేందుకు పరిపాలన పరమైన అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో తెలుగు తల్లివిగ్రహాలను ఏర్పాటు చేయనుంది. ఇందుకు గాను గత ఏడాది ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఇప్పుడు విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి పూర్తిస్థాయి ఆర్థిక మంజూరు అనుమతులను ప్రభుత్వం జారీ చేసింది. దీంతో ఈ ఏడాది పనులు పూర్తి చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతుంది.

## గ్లోబల్ హబ్‌గా 'భారత్'

>> హాజరుకావడంతోపాటు ఎఐరంగంలో భారత్ శరవేగంగా ముందుకు వెళుతోందని కితాబునిచ్చారు. ప్రపంచస్థాయి ఎఐ హబ్‌గా మారే సామర్థ్యం భారత్‌కు ఉందని గూగుల్ సిఇఒ సుందర్‌పిచాయ్ అన్నారు. ప్రధాని మోడీతో భేటీ తర్వాత ఆయన ఎఐ సదస్సులో మాట్లాడుతూ భారత్‌లోని బెంగళూరు వంటి నగరాల్లో ఔత్సాహిక పారిశ్రామికవ్యవస్థ రాణిస్తోందని, సర్వమ్ వంటి కంపెనీలు స్థానిక ఏఐ మోడళ్ల వృద్ధిచేస్తున్నాయన్నారు. అధునాతన ఆవిష్కరణలకు దేశీయంగా పునాదులు పడుతున్నాయన్నారు. భారత్‌లో ఇప్పటికే గూగుల్ 15 బిలియన్ డాలర్ల ఎఐ మౌలికవసతుల పెట్టుబడులు పెట్టిందని, సబ్‌సీ కేబుల్స్ కూడా నిర్మిస్తోందన్నారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటవుతున్నదని సుందర్‌పిచాయ్ అన్నారు. అలాగే వెంచర్ క్యాపిటల్ సంస్థ వచ్చే పదేళ్లలో భారత్ రెండులక్షలకోట్ల డాలర్ల టెక్‌మార్కెట్ అందిస్తుందని, ఇందుకు ఎఐ రంగమే కీలకమని రూ.100తోనే వైద్య,విద్యాసలహాలు అందేరోజులు అతిత్వరలోనే వస్తాయన్నారు. గ్లోబల్‌సౌత్ దేశాల్లో ఎఐ విస్తరణకు రూ.4.5 లక్షలకోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు మైక్రోసాఫ్ట్ వెల్లడించింది. 2030 నాటికి భారత్‌లో 2 కోట్లమందికి కృత్రిమమేధ నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తయిన వారికి తమ సంస్థల్లోనే ఉద్యోగాలిస్తామని కంపెనీ వైస్‌ప్రెసిడెంట్ ఎఐ ఆఫీసర్‌నటాషా క్రాంప్టన్ అన్నారు. అదేవిధంగా భారత్‌లో క్వాల్‌కామ్ రూ.1360 కోట్లపెట్టుబడులు పెడుతున్నట్లు చిప్ దిగ్గజం క్వాల్‌కామ్ వెల్లడించింది. ఆటోమోటివ్,ఐఓటి, రోబోటిక్స్, మొబైల్‌రంగాల్లోని స్టార్టప్‌లకు క్వాల్‌కామ్ వెంచర్స్‌ద్వారా నిధులు అందచేస్తామని వివరించింది. అదేవిధంగా అమెరికాకు చెందిన ఎన్విడియా తమకు భారత్ కీలక హబ్ అని వెల్లడించింది. దక్షిణాసియా ఎండి విశాల్‌దూపర్‌మాట్లాడుతూ ఇక్కడిటెక్ దిగ్గజాలతో కలిసి పనిచేసునతన్నట్లు వివరించారు. వీటిలో ఎన్విసిఐ, సర్వమ్, ఎఐ, జోహో, భారత్‌జెన్ వంటివి ఉన్నాయి. 20 ఏళ్లపాటు పన్నువిరామం ప్రకటించడంతో ఎఐ విస్తరణకు వీలు కలిగిందని, ఎన్వీడియా సీనియర్ ఉపాధ్యక్షుడు శంకర్‌త్రివేది అన్నారు. 2వేలకుపైగా విదేశీ కంపెనీల్లో 1800 కంపెనీలకు భారత్‌లో జిసిసిలున్నాయని ఆయన అన్నారు. ఎన్విడియాతో ఇపుడు ఎల్‌అండ్‌టి, చెన్నై డేటా సెంటర్; ముంబయి డేటా సెంటర్‌లలో ఎన్విడియా జిపియు క్లస్టర్లు కూడా విస్తరించేందుకు నిర్ణయించింది.

## 21 నుంచి 3 రోజులు ఆకస్మిక వడగళ్ల వానలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** పిడుగులతో కూడిన వడగళ్ల వర్షాలు కురిసే ప్రమాదముందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నెల 21 నుండి 24వరకు రాష్ట్ర వ్యాప్తంగా మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ముఖ్యంగా ఈ నెల 22న ఉత్తర , తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వడగళ్ల వానలు కురుస్తాయని తెలిపింది. రుతువులు మారుతున్న క్రమంలో వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఈ మార్పులే అకాల వర్షాలకు ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన గాలివానలతో జనజీవనం అస్తవ్యస్తమయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలతోపాటు హైదరాబాద్ మహానగరంలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ నెల 23, 24 తేదీల్లో వర్షాల ఉధృతి మరింత పెరగనుందని, తొలుత ఉత్తర తెలంగాణపై, ఆతర్వాత దక్షిణ తెలంగాణ జిల్లాలపై వర్షప్రభావం ఉంటుందని చెప్పింది.

## ఫిల్మ్ అవార్డు జ్యూరీ ఛైర్మన్‌గా తమ్మారెడ్డి

### ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉత్తర్వులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 జ్యూరీ కమిటీలో కీలక మార్పులు చేశారు. కమిటీలో స్పెషల్ జ్యూరీ ఛైర్మన్‌గా నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజను నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం దర్శకుడు రాఘవేంద్రరావు వ్యవహరిస్తుండగా, ఆయన స్థానంలో భరద్వాజకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు గురువారం తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఈ ఏడాది ఉగాది సందర్భంగా మార్చి 19న అవార్డులను ప్రదానం చేయనున్నా రు. ఈ పురస్కారాలకు ఎంపికైన చిత్రాల స్క్రీనింగ్ ఫిబ్రవరి 6 నుంచి ప్రారంభమైంది. తెలుగు సినీ పరిశ్రమకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని, భారతీయ సినీ రంగానికి హైదరాబాదును కేంద్రంగా చేయాలన్న ఆలోచనతో ఉన్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. ప్రతిభ, పారదర్శకత ప్రమాణంగా గద్దర్ సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని వెల్లడించింది. ఈ పురస్కారాలకు ఎంపిక చేసే సినిమాల్లో వాణిజ్య అంశంతో పాటు సామాజిక సందేశం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటే రాబోయే రోజుల్లో మంచి సినిమాలను మరింత ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం ఇటీవల తెలిపింది. గత ఏడాదిలాగే ఇప్పుడూ భారీ స్థాయిలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తామని పేర్కొంది.

## 3 రోజులపాటు హైదరాబాద్‌లో అగ్రిషో

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాత వార్త:** రాష్ట్ర రాజధాని హైదరా బాద్‌లో అగ్రిషో పేరుతో ఈ నెల 20, 21, 22 తేదీల్లో మూడు రోజులపాటు అతి పెద్ద వ్యవ సాయ ప్రదర్శన కొనసాగనుంది. ఈ మేరకు షో నిర్వాహకుడు రాజేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రక టనలో తెలిపారు. ట్యాంక్ బండ్ దిగువన, ఇందిరా పార్క్ (ధర్నా చౌక్) పక్కన ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో అగ్రిషోను నిర్వహిస్తు న్నామన్నారు. మూడు రోజుల్లో వేలాది మంది రైతులు హాజరవు తారనే అంచనాతో ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. దేశ, విదేశాలకు చెందిన నూతన వ్యవసాయ సాంకేతికతను వివరించేందుకు వందల కంపెనీలు ఈ ప్రదర్శనలో స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నాయన్నారు.

## ఏప్రిల్ 20 నుంచి

## ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

### ఏప్రిల్ 27 వరకు కొనసాగింపు

### షెడ్యూల్ విడుదల చేసిన టాస్ డైరెక్టర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఓపెన్ స్కూల్ సొసైటీ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలను ఏప్రిల్ 20 నుంచి ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 27 వరకు కొనసాగించనున్నట్టు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) డైరెక్టర్ పివి శ్రీహరి గురువారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఏప్రిల్/మే2026లో జరగనున్న టెన్త్, ఇంటర్మీడియట్ స్థాయిలకు సంబంధించిన థియరీ, ప్రాక్టికల్ పరీక్షల టైమ్‌టేబుల్‌ను గురువారం ప్రకటించారు. ఏప్రిల్ 20 నుంచి 27 వరకు నిర్వహించబడతాయని తెలిపారు. థియరీ పరీక్షలు రెండు సెషన్‌లలో జరగనున్నట్టు తెలిపారు. ఉదయం సెషన్ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ పరీక్షలను మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 28 నుంచి మే 5 వరకు నిర్వహించనున్నట్టు ప్రకటనలో తెలిపారు.

## ప్రపంచ విత్తన హబ్‌గా తెలంగాణ

### ఆ సామర్థ్యం రాష్ట్రానికి ఉంది

### అంతర్జాతీయ సీడ్ టెస్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

### సిఎస్‌తో సచివాలయంలో భేటీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** అంతర్జాతీయ సీడ్ టెస్టింగ్ అసోసియేషన్ (ఇస్టా) - స్విట్జర్లాండ్ ప్రతినిధి బృందం.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసింది. విత్తనాల నాణ్యత హామీ, అంతర్జాతీయ విత్తన ప్రమాణాలు, సంబంధిత వ్యవసాయ అంశాలపై సిఎస్‌తో చర్చించారు. ఇస్టా ఎగ్జిక్యూటివ్ సమావేశం-2026 ఫిబ్రవరి 15 నుండి 21 వరకు హైదరాబాద్ నగరంలో జరుగుతోంది. ఈ సందర్భంగా గురువారం సచివాలయంలో సిఎస్‌ను ఇస్టా ప్రతినిధులు కలిశారు. సెక్రటేరియట్ స్టాఫ్ (ఇండియా) కేశవులు కుమునోత్ నాయకత్వంలో జరిగిన ఈ సమావేశంలో అమెరికా, ఇటలీ, ఫ్రాన్స్, ఫిలిప్పీన్స్, పోలాండ్, అర్జెంటినా, ఉరుగ్వే, స్విట్జర్లాండ్ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా విత్తన ప్రమాణాల ఏకీకరణ ద్వారా వ్యవసాయ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసే అంశంపై చర్చలు జరిగాయి. ఈ అంతర్జాతీయ సమావేశానికి హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వడం ద్వారా ప్రపంచస్థాయిలో గుర్తింపు పెరగడంతోపాటు వాణిజ్యం, పెట్టుబడులకు అవకాశాలు విస్తరించి, అంతర్జాతీయ విత్తన రంగంలో భారతదేశ స్థానం మరింత బలపడనుందని అంతర్జాతీయ ప్రతినిధులు అన్నారు. తెలంగాణను ప్రపంచస్థాయి విత్తన ఉత్పత్తి, ఎగుమతి కేంద్రంగా అభివృద్ధి చేయడం ద్వారా భారతదేశ విత్తన రాజధానిగా రాష్ట్ర ప్రతిష్ట మరింత పెరుగుతుందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని అనుకూల వాతావరణ పరిస్థితులు, శాస్త్రీయ మౌళిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన విత్తన రైతులు, విభిన్న విత్తన వ్యవస్థలు, అనుకూల విధానాలు పరిశోధన, ఉత్పత్తి, ప్రాసెసింగ్ తదితర అంశాలు విత్తన ఎగుమతులకు తెలంగాణను ప్రత్యేక కేంద్రంగా నిలబెడుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా కేశవులు మాట్లాడుతూ... 2047 నాటికి ప్రపంచ విత్తన హబ్‌గా అవతరించే సామర్థ్యం తెలంగాణకు ఉందన్నారు. సిఎస్‌ను కలిసిన ప్రతినిధి బృందంలో 11 దేశాల ప్రతినిధులతోపాటు భారతదేశానికి చెందిన ఇస్టా విభాగం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఉన్నారు.

## కడియం శ్రీహరి అనర్హత పిటిషన్

## స్పీకర్ విచారణ

### వివేకానంద అడ్వొకేట్లను క్రాస్ ఎగ్జామ్

### చేసిన కడియం న్యాయవాదులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి19:** ఎమ్మెల్యేల అనర్హత పిటీషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ విచారణ ముగింపు దశలో ఉంది. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటీషన్‌పై గురువారం విచారణ జరిగింది. కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో విచారణకు వివేకానంద హాజరయ్యారు. స్పీకర్ సమక్షంలో కేపీ వివేకానంద అడ్వకేట్లన్లు కడియం శ్రీహరి అడ్వకేట్లు క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. కాగా, కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేసిన కేపీ వివేకానంద ఈనెల 1న స్పీకర్‌కు మరిన్ని ఆధారాలు అందజేశారు.

**కడియం శ్రీహరి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు: వివేకానంద**

స్పీకర్ వద్ద విచారణ ముగిసిన అనంతరం అసెంబ్లీ బయట ఎమ్మెల్యే కేపీ వివేకానంద మీడియాతో మాట్లాడుతూ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని అన్నారు. కేసీఆర్ జాతిపిత ఎలా అవుతాడని కడియం చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కడియం శ్రీహరి తన హోదాకు మించి మాట్లాడుతున్నాడు. కడియం లాగ కేసీఆర్ ఎప్పుడూ ఆత్మగౌరవాన్ని తాకట్టు బెట్టుకొని, పదవుల కోసం పాకులాడి, బేరసారాలు చేయలేదన్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా, 13 సంవత్సరాలు నిరంతరం పోరాడాడని ఇదే కడియం శ్రీహరి అనలేదా అని సూటిగా ప్రశ్నించారు. ఈరోజు ఏ మొహం పెట్టుకొని ఈ వ్యాఖ్యలు చేస్తున్నాడు ఆయనకే తెలియాలన్నారు. రాజకీయ అవసరాల కోసం రంగులు మార్చిన నీ లాంటి వారు కేసీఆర్‌ను అనే అర్హతల లేదని విమర్శించారు. ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నాడో ఆయనకే స్పష్టత లేదని ఎద్దేవా చేశారు.

# రాష్ట్రాల సమన్వయంతో వ్యవసాయ పథకాలు

### నిధుల విడుదల, వ్యయాలపై సమీక్షలు జరపాలి

### రైతుల నుండి ప్రత్యక్ష అభిప్రాయాల సేకరణ అవసరం

### కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్




**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయానికి జరిపిన కేటాయింపులను వినియోగించే విషయంలో రాష్ట్రాలతో సమన్వయం చేసుకోవాలని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖల మంత్రి శివ రాజ్‌సింగ్ చౌహాన్ అధికారులను ఆదేశించారు. వ్యవ సాయ రంగానికి సంబంధించి 2026-27 కేంద్ర బడ్జెట్‌లో చేసిన ప్రకటనలను సంబంధిత రాష్ట్రాలతో సంప్రదించి అమలుచేయడానికి యుద్ధ ప్రాతిపదికన పని చేయాలని మంత్రి మంత్రిత్వ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. రబీ పంటల విత్తనాల తాజా స్థితి, కీలకమైన వ్యవసాయ వస్తువుల ధరల ధోరణులను అంచనా వేయ డానికి నిర్వహించిన ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ కేంద్ర వ్యవసాయ పథకాల అమలులో వెనుకబడిన రాష్ట్రాలతో సమీక్షలు నిర్వహించి, సకాలంలో అవి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఢిల్లీలోని కృషి భవన్‌లో ప్రస్తుత రబీ విత్తనాలు, ధరల పరిస్థితి, పథకాల అమలును కేంద్ర మంత్రి సమీక్షించారు. రబీ సీజనుకు సంబంధించి విత్తనాల పంపిణీ సకాలంలో సరిపడా చేయడం జరిగిందన్నారు.

అలాగే వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరల పరిస్థితిని కూడా నిశితంగా పరిశీలించబడుతోందని పేర్కొన్నారు. కృషోన్నతి యోజ న, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకాల కింద రాష్ట్రా లకు నిధుల విడుదల వాటి వినియోగం పట్ల రాష్ట్రాలను అప్రమత్తం చేయాలన్నారు. సకాలంలో, సమర్థవంతంగా ఆయా పథకాలు అమలు జరిగేలా చూసుకోవడానికి, ముఖ్యంగా నిధుల వినియోగం అంచనా స్థాయిల కంటే తక్కువగా ఉన్న సందర్భాల్లో, రాష్ట్ర ప్రభుత్వాలతో సమీక్ష సమావేశాలు నిర్వహించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఈ సమావేశంలో, వివిధ రబీ పంటల ప్రస్తుత విత్తనాల స్థితి, కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు మరియు ఇతర ఆహార ధాన్యాల ధరల పరిస్థితులను గూర్చి చర్చించారు.

ఫలితాల ఆధారిత పాలన యొక్క ప్రాముఖ్యతను చెబుతూ, వ్యవసాయ పథకాల వాస్తవ ప్రభావాన్ని అంచ నా వేయడానికి, తుది వినియోగదారుల నుండి ముఖ్యం గా రైతుల నుండి ప్రత్యక్ష అభిప్రాయాన్ని పొందాలని చౌహాన్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్యదర్శి డాక్టర్ దేవేష్ చతుర్వేది, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# స్వదేశీ ఎఐ రూపకర్తలుగా వర్సిటీలు ఎదగాలి

### ఎఐయు సెంట్రల్ జోన్ విసిల సదస్సులో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (తార్నాక), ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** సాంకేతిక విప్లవ యుగంలో భారత విశ్వవిద్యా లయాలు కేవలం వినియోగదారులుగా కాకుండా స్వదేశీ ఆవిష్కరణల కేంద్రాలుగా ఎదగాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పిలుపు నిచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన సెంట్రల్ జోన్ వైస్‌ఛాన్సలర్ల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒయు చరిత్రాత్మక ఠాగూర్ ఆడిటోరి యంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఎఐయు), సహకారంతో నిర్వహిస్తున్న రెండో సెంట్రల్ జోన్ వైస్‌ఛాన్సలర్ల సదస్సు 2025-26 గురువారం ఘనంగా ప్రారంభమైంది. 'ఎఐ, క్వాంటమ్ టెక్నా లజీల కలయిక కేవలం శాస్త్రీయ పురోగతికే పరిమితం కాదని, ఇది విద్యావ్యవస్థలో సమగ్ర మార్పులకు దారితీసే శక్తిగా నిలుస్తుంది' అని గవర్నర్ పేర్కొన్నారు. భవిష్యత్ ప్రపంచ పోటీలో నిలవాలంటే భారత ఉన్నత విద్యా సంస్థలు నైతిక విలువల ఆధారంగా స్వదేశీ ఎఐ పరిష్కా రాలను రూపొందించాల్సిన అవస రం ఉందన్నారు. 'సాంకే తికత సమా జంలోని చివరి వ్యక్తికీ అందు బాటులోకి రావాలంటే విశ్వవిద్యాలయాలు సమా జంతో అను సంధానమై పనిచేయాలని సూచిం చారు. వికాసం అందరికీ చేరాలని, సాంకేతిక పురోగతి సమానత్వాన్ని పెంపొం దించాలి' అని స్పష్టం చేశారు. ఎఐ ఆధారిత పరిశోధనలు, క్వాంటం సాంకేతి కతలపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా దేశ అభివృద్ధి లక్ష్యాలు వేగవంతం అవుతాయని గవర్నర్ పేర్కొన్నారు. విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేయడంలో విశ్వవిద్యా లయాల పాత్ర కీలకమని అన్నారు.

ఒయు ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం స్వాగతోపన్యాసంలో విద్యార్థులను భావి సాంకేతిక ప్రపంచానికి సిద్ధం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యను ఎఐ, క్వాంటమ్ ఆధారిత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఓ.యూ రిజిస్ట్రార్ ప్రొ. గడ్డం నరేష్‌రెడ్డితో పాటు వివిధ విభాగాల డీన్లు, ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

**విద్యలో కృత్రిమ మేధ వినియోగం - కొత్త దిశగా అడుగులు**

విద్యా రంగంలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించేందుకు కార్య క్రమాన్ని ప్రకటిం చింది. విద్యార్థుల్లో కృత్రిమ మేధస్సు ఎఐపై అవగాహన పెంపొందించడం, పరిశోధనలను ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యంగా పేర్కొన్నారు. పారదర్శకతకు ప్రాధాన్యమనే ప్రధాన కార్యక్రమంలో భాగం గా విద్యలో ఎఐ, ఇతర సాంకేతిక పద్ధతుల వినియోగంపై టెక్నాలజీ ఆధారిత చర్చలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు ప్రత్యేక కోర్సులు పారదర్శకమైన విశ్వవిద్యాలయ పరిపాలనలో భాగంగా ఎఐ సంబంధిత ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టే దిశగా చర్యలు ప్రారంభించారు. స్వదేశీ పరిష్కారాల ప్రోత్సాహం, 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను ప్రోత్స హిస్తూ స్వదేశీ సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. గోప్యతా హక్కులను కాపాడే విధంగా ఫ్రేమ్‌వర్క్ రూపొందించనున్నట్లు వెల్లడించారు.

## జిహెచ్‌ఎంసి విభజనపై హైకోర్టులో పిటిషన్

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసిని మూడు కార్పొరేషన్లుగా విభజించడంపై తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిహెచ్‌ఎంసిని మూడు కార్పొరేషన్లుగా విభజన చేస్తూ జీవో నంబర్ 55 జారీ చేసిన విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ వ్యాపారి గురువారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. 2027 జనాభా లెక్కల ప్రకారం కేంద్ర సర్క్యులర్‌గా ఇది విరుద్ధమని, జనగణన ముగిసే వరకు ఈ జీవోపై స్టే విధించాలని కోరారు. మున్సిపల్ సరిహద్దులు మార్చడం, స్థానిక సంస్థల పునర్వ్యవస్థీకరణ చట్ట విరుద్ధమని పిటిషనర్ తెలిపారు. జీవో నంబర్ 55ను రద్దు చేయాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని కోరారు. జిహెచ్‌ఎంసిని యథావిధిగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ ధర్మాసనం విచారణ చేసింది. పిటిషనర్ వాదనలు విన్న అనంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

## ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ నిర్మాణ పనుల

## పునఃప్రారంభానికి సర్వం సిద్ధం

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** ఎస్‌ఎల్‌బిసి(శ్రీశైలం ఎడమ గట్టు కాలువ) సొరంగ నిర్మాణ పనుల పున: ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ఇప్పటికే నీటిపారుదలశాఖ పర్యవేక్షణలో డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో ట్రయల్‌రన్ కూడా విజయవంతంగా పూర్తయింది. మన్నెవారిపల్లి ఔట్‌లెట్ నుంచి సొరంగంలోపల 20 కిలోమీటర్లు దాటిన తర్వాత బ్లాస్టింగ్ చేపట్టారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 5 మీటర్ల మేర విజయవంతంగా బ్లాస్టింగ్‌ను అధికారులు పూర్తి చేశారు. టన్నెల్‌లోపల బ్లాస్టింగ్ ద్వారా వచ్చే మట్టి, రాళ్లను బయటకు తీసుకురావడంపై అధ్యయనం కొనసాగుతోంది. ఏడాది క్రితం ఎస్‌ఎల్‌బిసి టన్నెల్‌లో జరిగిన ఘోర ప్రమాదం మిగిల్చిన చేదు ఘటనను అధిగమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటిపారుదలశాఖ కొత్త వ్యూహంతో సొరంగ నిర్మాణ పనులను పునఃప్రారంభించేందుకు సిద్ధమైంది.

## కర్రెగుట్టల్లో కూంబింగ్‌ను తక్షణమే నిలిపివేయాలి

### సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని డిమాండ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** కర్రెగుట్టల్లో చేపడుతున్న కూంబింగ్ చర్యలను తక్షణమే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాం బశివరావు డిమాండ్ చేశారు. మావోయిస్టులు చర్చలకు వచ్చేందుకు మార్గం సుగమం చేయాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో కోరారు. మావోయిస్టులు సైతం జన జీవన స్రవంతిలోకి వచ్చి, మార్క్సిస్టు సిద్ధాం తాన్ని విస్తరించేలా ఎత్తుగడ లను మార్చుకోవాలని కూనంనేని సూచిం చారు. అడవుల్లోని లక్షల కోట్ల ఖనిజ సంపద కోసం మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్, జార్ఖండ్‌లో లక్షలాది చెట్లు నరికి వేయడాన్ని నిలిపివేయాలన్నారు. ఒకదగ్గర చెట్టును తొలగించాలంటే, మరో ప్రాంతంలో కొత్త మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్న గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పును ఆసరాగా చేసుకొని ఈ చర్యలకు పాల్పడడం సమంజసం కాదన్నారు. అడవిలో ప్రకృతిసహజంగా పెరిగిన చెట్లను కొట్టేసి, ఇతర ప్రాంతంలో అన్ని చెట్లు పెంచడం సాధ్యమా అని కూనంనేని ప్రశ్నించారు.

## నేటి నుంచి జలమండలి.. బస్తీ బాట

### ప్రజలతో మమేకమవడానికి వినూత్న కార్యక్రమం

### వారానికి 4 రోజులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** జలమండలి బోర్డు పరిధి కోర్ అర్బన్ రీజయన్ వరకు పరిధి పెరగడంతో వాటర్ సీవరేజ్ సేవలు మరింత సమర్థవంతంగా అందించే విధంగా స్థానికంగా నెలకొన్న సమస్యలు గుర్తించి వాటిని అధిగమించడంతో పాటు ప్రజల నుంచి సమస్యలు తెలుసుకునే విధంగా జలమండలి బస్తీ బాట్ల పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ నుంచి వార్డు మేనేజర్ల వరకు భాగస్వామ్యులుగా ఉంటారు. శుక్రవారం నుంచి జలమండలి బస్తీ బాట్ల కార్యక్రమం ప్రారంభించనుంది, ప్రజల్లో జలమండలిపై మరింత నమ్మకం కలిగించే విధంగా క్రార్యక్రమాన్ని రూపొందించారు. జల మండలి పరిధిలోని బస్తీ, కాలనీలలో ప్రతి మంగళవారం, బుధవారం, శుక్రవారం, శనివారం ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు మేనేజింగ్ డైరెక్టర్ నుంచి వార్డు మేనేజర్ల వరకు పర్యటిస్తారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కార్యాలయంలో యధావిధిగా అందుబాటులో ఉంటారు. క్షేత్ర స్థాయిలో ఎండి నుంచి వార్డు మేనేజర్ల వరకు పర్యటించి, మంచినీరు, సీవరేజీ సమస్యలు గుర్తించి, ప్రజలతో మాట్లాడి, సమస్యలు తెలుసుకొని, తాత్కాలిక సమస్యలు తక్షణమే పరిష్కారించి, శాశ్వత పరిష్కారం కోసం వార్డుల వారిగా ప్రణాళికలు రూపొందించుకుంటారు. బస్తీలో పర్యటన తీరును పరిశీలించేందుకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్, జాయింట్ ఎండి, డైరెక్టర్లు, రీజియన్ ఈడిలు, డైరెక్టర్ (ఆపరేషన్)లు, జోన్ సిజిఎం, జనరల్ మేనేర్లు, సర్కిల్ డిజిఎం వరకు వారి పరిధిలో అకస్మిక తనిఖీలు నిర్వహిస్తారు. సమస్యల పరిష్కరానికి ప్రజలతో మమేకం అవుతారు.

**క్షేత్రస్థాయి పర్యటనలో ప్రాధాన్యత ఇలా..**

సివరేజీ మ్యాన్ హోల్స్, పైప్‌లైన్ పరిస్థితి, లీకేజీ, ఓవర్ ఫ్లో, డీసిల్టింగ్ పరిశీలనతో, సత్వర చర్యలు చేపడతారు. వాటర్ పైప్‌లైన్, లీకేజీలు, నీటి సరఫరాలో సమయ పాలన, నీటి వృధా, లోప్రెషర్, నల్లాలకు మోటర్ల బిగింపు, సరఫరా అవుతున్న తాగు నీటి నాణ్యత పరిశీలించి సత్వర చర్యలు తీసుకుంటారు. అలాగే నివాసాల్లో భూగర్భజలాల పెంపు కోసం ఇంకుడు గుంతలు, ఇంజక్షన్ బోర్‌వెల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ప్రతి వార్డు మేనేజర్ పర్యటన రోజుకు సంబంధించి గుర్తించిన సమస్యలు, తాత్కాలిక పరిష్కారాలు, శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళిక ప్రతిపాధనలు రూపొందించి ఆన్‌లైన్ యాప్‌లో సర్కిల్ డిజిఎంలకు, సర్కిల్ డిజిఎంలు సర్కిల్ వారిగా జోన్‌లకు, జోన్ నుండి జోన్‌ల వారిగా రీజియన్‌కు, రీజియన్ నుంచి కేంద్ర కార్యాలయాలానికి ఆన్‌లైన్ నివేదికలు అందించడంతో పాటు ప్రతి వారం పర్యటనపై శనివారం సమీక్షా సమేవేశం నిర్వహించనున్నారు.

# ఇంటర్ విద్యార్థుల హాల్‌టికెట్లు విడుదల

### కాలేజీల లాగిన్‌లో పొందుపర్చిన ఇంటర్‌బోర్డు

### హాజరుకానున్న 9.90 లక్షల మంది విద్యార్థులు

### 25 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడయట్ వార్షిక పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఇంటర్ బోర్డు గురువారం జారీ చేసింది. అయితే హాల్ టికెట్లను విద్యార్థులు నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించకుండా.. వారి కాలేజీల లాగిన్‌లో అప్‌లోడ్ చేసినట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి ప్రకటన లో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9.9 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంతోపాటు రెండో సంవత్సరం విద్యార్థుల హాల్ టిక్కెట్లను సంబంధిత కళాశాల లాగిన్‌లలో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్టు ఇంటర్ బోర్డు ప్రకటించింది. విద్యార్థులు తమ సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ల నుండి తమ హాల్ టిక్కెట్లను తీసుకోవాలని సూచిం చారు. హాల్ టిక్కెట్లలో ఏవైనా అవసరమైన దిద్దుబాట్లు ఉంటే సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్స్ ద్వారా తమ దృష్టికి తీసుకు రావాలని ఇంటర్ బబోర్డు విద్యా ర్థులకు సూచించింది.

విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలను సులభంగా గుర్తించడంలో సహాయపడటానికి హాల్ టిక్కెట్లలో క్యూఆర్ కోడ్ ఉంటుందని తెలిపింది. విద్యార్థుల సౌలభ్యం కోసం వారి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకి ఎస్ఎంఎస్ లింక్‌ను త్వరలో పంపించనున్నట్టు బోర్డు ప్రకటనలో తెలిపింది. ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. ఇంటర్ పరీక్షల కోసం రాష్ట్రంలో సుమారు 1400కిపైగా పరీక్షా కేంద్రాలను ఇంటర్ బోర్డు ఏర్పాటు చేయనున్నట్టు తెలుస్తోంది.


# 24 గంటలు పనిచేస్తున్న సిఎం, మంత్రులు

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు 24 గంటలు పని చేస్తున్నారని ఎంపి చామలకిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల దెబ్బకు హరీష్ రావు మైండ్ బ్లాక్ అయిందని, మతి స్థిమితం కోల్పోయార న్నారు. స్వయంపాలన, అస్తిత్వం,మోకరిల్లడం, ఆత్మగౌరవం అని పెద్ద,పెద్ద మాటలు మాట్లాడుతున్నారని, హరీష్ రావు మాట్లాడే మాటలకు బిఆర్ఎస్ పదేళ్ల హయంలో అర్థం లేదన్నారు. రెండు ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి గుండు సున్నా వచ్చిందన్నారు. లోక్‌సభ ఎన్నికలు, కార్పొరేషన్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు గుండు సున్నా మిగిలిందన్నారు. మీ చిల్లర మాటలను ప్రజలు పట్టించుకోవడం లేదని, హరీష్ రావు లేఖ పేరుతో డ్రామాలు ఆడుతున్నారని, ఢిల్లీ అధిష్టానం వద్ద క్యాబినెట్ మీటింగ్ జరగడం లేదన్నారు. క్యాబినెట్ మీటింగ్ 23వ తేదీన సెక్రటేరియట్‌లో జరుగుతుందన్నారు. క్యాబినేట్ లేకుండా ఫామ్ హౌస్ పాలన నడపడంలేదన్నారు. పార్టీ వ్యవహారాలను చర్చించడానికి అధిష్టానం పెద్దలు తెలంగాణ ముఖ్య నేతలను పిలిచారని, తెలంగాణలో జరుగుతున్న అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ,సోనియా గాంధీ వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందని, పది సంవత్సరాల్లో కెసిఆర్ కుటుంబం దోచుకుంది,దాచుకుందిపది ఏళ్ళల్లో ఒక్క కెసిఆర్ కుటుంబం మాత్రమే అన్నారు. బిఆర్ఎస్ అధిష్టానం ఫామ్ హౌస్‌లో ఉందని, తెలంగాణ ప్రజలు తప్పు చేశారని బిఆర్ ఎస్ నేతలు పిచ్చి, పిచ్చి మాటలు మాట్లాడుతు న్నారన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ మీటింగులో ఎలాంటి చర్చ జరుగుతుందో తెలుస్తుందన్నారు సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి అధిష్ఠానాన్ని కలుస్తున్నారన్నారు.

# ఇక మీకు పదిరోజులే..

### ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటమ్



**వాషింగ్టన్, ఫిబ్రవరి 19:** అమెరికాఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు కఠినమైన హెచ్చరికలు జారీ చేశారు. వాషింగ్టన్‌లో బోర్డ్ ఆఫ్ పీస్ తొలి సమావేశంలో మాట్లాడిన ట్రంప్ మధ్యప్రాచ్యంలో భారీ స్థాయిలో అమెరికా సైనిక సమీకరణ జరుగుతోందని, ఇరాన్ త్వరగా ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని, అప్పటికీ ఒప్పుకోకపోతే అమెరికా ముందుకు వెళ్లాల్సి ఉంటుందని, ఏమి జరుగుతోందో వచ్చే 10 రోజుల్లో మీరే తెలుసుకుంటారు అని అల్టిమేటం జారీచేశారు. ఇరాన్‌తో అర్థవంతమైన ఒప్పందా చేయడం కష్టమని చెప్పారు. డీల్ కుదరకుంటే చెడు పరిణామాలు సంభవిస్తాయని ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. శాంతి మార్గంలో మాతో చేరండి అంటూ టెహ్రాన్‌ను కోరారు. మరోవైపు, అమెరికా రాయబారులు స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్‌లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఫ్చితో చర్చలు జరుపు తున్నారు. యూఎస్ ఇరాన్ అణు చర్చలు ఇంకా కొలిక్కి రాలేదు. ఇదిలా ఉంటే, మరోవైపు అమెరికా ఇరాన్‌పై దాడులకు పూర్తిస్థాయిలో సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ వారాంతం నుంచే ఇరాన్‌పై వైమానిక దాడు లకు సిద్ధంగా ఉన్నట్లు అమెరికన్ సైన్యం వైట్ హౌజ్‌కు సమాచారం ఇచ్చింది. ట్రంప్ దాడులపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇరాన్ రాజకీయసైనిక నాయకత్వాన్ని టార్గెట్ చేసే ప్రణాళికలు కూడా అమెరికా దగ్గర ఉన్నాయి. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ మాట్లాడుతూ తాము యుద్ధం కోరుకోవడం లేదని, కానీ అమెరికా తమపై ఒత్తిడి చేస్తే తలవంచబోమని చెప్పారు. అయితే అమెరికా మధ్యప్రాచ్యంలో భారీగా యుద్ధ సామాగ్రిని మోహరించింది. 13 అమెరికా యుద్ధ నౌకలు ప్రస్తుతం అక్కడ మోహరించాయి. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్, 9 డిస్ట్రాయర్లు, 3 లిట్టోరల్ కాంబాట్ షిప్స్, ప్రపంచంలోనే అతిపెద్ద నౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ అట్లాంటిక్ నుంచి మధ్యప్రాచ్యం వైపు వెళ్తోంది. ఎఫ్22 రాప్టర్లు, ఎఫ్15, ఎఫ్16 ఫైటర్లు, కెసి135 రీఫ్యూయలింగ్ విమానాలు మిడిల్ ఈస్ట్ వైపు వెళ్లాయి.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
T.N.No.01/2025-26/CE/SE(WSM)/EE(WSM-II), Dt: 12.02.2026 (2nd Call)
Number of Works : 01 (One), Value of Works : Rs.389.90 Crores
Downloading starting Date : 13.02.2026 @ 5.00 PM
Last date for Submission of bid : 05.03.2026 @4.00 PM
Further Details at http://www.apeprocurement.gov.in
O/o the Executive Engineer (WSM-II) Division.
Cell No.: 81878 98428.
For Commissioner

వార్త

తొందరపడి నిర్ణయాలకు రావడం అనే వ్యాయామాన్ని మాత్రమే మూర్ఖులు చేస్తుంటారు.

-విలియం కాంటన్

# తరలిపోతున్న ఎర్ర చందనం!

ఎన్ని చట్టాలు చేసినా, ఎంతమంది అధికారులను నియమించినా, మరెన్నిసార్లు హెచ్చరించినా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎర్రచందనం తరలిపోతూనే ఉన్నది. పట్టుబడిన స్మగ్లర్లపై కేసు నమోదు చేస్తూనే ఉన్నారు. జైళ్లకు పంపుతున్నారు. కొన్ని సందర్భాల్లో కాల్పులకు కూడా వెనుకాడడం లేదు. అయినా ఇవేమీ ఈ స్మగ్లింగును ఆపలేకపోతున్నాయి. అరుదైన ఎర్రచందనం వృక్షసంపదను కాపాడేందుకు ఏకంగా ప్రత్యేక టాక్స్‌ఫోర్సును కూడా ఏర్పాటు చేశారు. అవసరమైన అన్ని హంగులు కూడా కల్పించారు. ప్రాణాలకు తెగించి సిబ్బంది కూడా రాత్రింబవళ్లు శక్తిమేరకు కృషి చేస్తూనే ఉన్నారు. ఏకంగా పదుల సంఖ్యలోస్మగ్లర్లు టాక్స్‌ఫోర్స్ సిబ్బంది చేతిలో గతంలో మరణించినా ఏ మాత్రం వెరవడం లేదు. అప్పుడప్పుడు తాత్కాలికంగా ఆగినట్లు కన్పించినా ఏదో ఒక దారిలో కళ్లుగప్పి తరలిపోతూనే ఉన్నది. ఇటీవల దాడుల్లో బయటపడుతున్న ఎర్రచందనం దుంగలు, పట్టుబడుతున్న స్మగ్లర్లు ఈ విషయం చెప్పకనే చెబుతున్నాయి. గత రెండు, మూడు దశాబ్దాలుగా అత్యంత విలువైన ఈ వృక్ష సంపదను తరలిస్తూనే ఉన్నారు. అయితే కూలీ కోసం వచ్చి ఎర్రచందనం చెట్లను కూలగొడుతున్న తమిళనాడుకు చెందిన కూలీలే పట్టుబడుతున్నారు తప్ప వారి వెనుక ఉన్న పెద్దల హస్తం వెలుగు చూడడం లేదు. ఆయా ప్రాంతాల్లో ఎవరిని అడిగినా ఈ ఎర్ర చందనం స్మగ్లింగ్ వెనుక పాత్ర ఎవరిది ఉందో కథలు కథలుగా చెప్తున్నారు. అయినా పాలక పెద్దలు ఆవైపు దృష్టి సారించకుండా మూలాల్లోకి వెళ్లకుండా ఈ అక్రమ స్మగ్లింగ్‌ను నిరోధించేందుకు ప్రయత్నాలు చేయడం ప్రయోజనం లేకుండాపోతున్నది. ఆంధ్రప్రదేశ్‌లో కడప, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మాత్రమే ఈ ఎర్రచందనం వృక్షాలు విస్తరించి ఉన్నాయి. వీటిని 1973లో అరుదైన వృక్షజాతుల జాబితాలో సైట్స్ (కన్వెన్షన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఎన్ డేంజర్డ్ స్పైసీస్)లోకి చేర్చారు. దీనివల్ల ఎర్రచందనం దుంగల ఎగుమతిపై నిషేధం అమలులోకి వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో పరిమితంగా ఉన్న ఈ వృక్షాలను రక్షించేందుకే వెసులుబాటు కల్పించారు. వాస్తవంగా చూస్తే ఇప్పటికీ ఈ ఎర్రచందనానికి మనదేశంలో పెద్దగా గిరాకీ లేదు. మార్కెట్ కూడా లేదనే చెప్పొచ్చు. కానీ చైనా, జపాన్ దేశాల్లో మాత్రం ఊహించని డిమాండ్ ఉంది. అంతకంతకు పెరుగుతుండడంతో కోట్లాది రూపాయల ఆదాయం వస్తుండడంతో ఎర్రచందనం దుంగలను స్మగ్లర్లు అక్రమంగా విదేశాలకు ఎగుమతి చేసి సొమ్ము చేసుకుంటున్నారు. సముద్రాల ద్వారా సరిహద్దులు దాటించేందుకు ఎప్పటికప్పుడు కొత్త కొత్త వ్యూహాలను అమలు చేస్తున్నారు.కొన్ని ప్రాంతాల్లో అయితే వ్యవసాయోత్పత్తుల పేరుతో బోగస్ అనుమతులు కూడా పొందుతున్నారు. చెన్నై,ముంబయి, కొచ్చి తదితర రేవుల నుంచి సరుకు రవాణా ఓడల ద్వారా తరలిపోతున్నది. రోడ్డు మార్గాలను కూడా వదిలిపెట్టడం లేదు. ఢిల్లీ, చండిగడ్‌లోని గోదాముల్లో దాచిన సరుకును ఒక వ్యూహం ప్రకారం నేపాలకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి రవాణా చేస్తున్నారు. ఇదే కాదు మణిపూర్, మిజోరం రాష్ట్రాల నుంచి కూడా ఈ అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతున్నది. అధికార వర్గాలు కూడా అంగీకరిస్తున్నాయి. ఈ వృక్షాలు వెలుగొండ అడవుల్లో మాత్రమే పెరగడానికి కారణాలు ఏవో ఇప్పటికీ మన శాస్త్రజ్ఞులు కనుక్కోలేకపోతున్నారు. కొన్ని వందల సంవత్సరాలుగా వృక్షశాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నా తెలియడం లేదు. పదిహేడువందల సంవత్సరంలో బ్రిటిష్ శాస్త్రవేత్తలు ఎర్రచందనం చెట్లకు దేశంలోని వివిధ ప్రాంతాలకు, తమ దేశాలకు కూడా తీసుకువెళ్లి పరీక్షలు జరిపారు. అక్కడ కూడా సత్ఫలితాలు ఇవ్వలేదు. చెట్లు పెరగడం లేదు. పెరిగిన అందులో కావలసిన నాణ్యత లభించడం లేదు. ఇక ఈ చెట్లకు ఇంత విలువ ఎందుకు వస్తున్నది? ఎందుకు ఉపయోగిస్తున్నారన్నా విషయాల్లో ఇప్పటికీ స్పష్టత లేదు. సంగీత పరికరాలకు, ఆటంబాంబుల కోసం జపాన్ వీటిని కొంటున్నదని ప్రచారం జరిగినా ఆ తర్వాత ఇది తప్పని తేలింది. అణుఇంధనం తయారీలోనూ, శృంగార సామర్థ్యం పెంచే మందుల్లోనూ వీటిని వాడుతున్నారని ఊహాగానాలు వెలువడుతున్నాయి. జపాన్ కానీ, చైనా కానీ వీటిని తాము ఎందుకు కొంటున్నాము? ఎందుకు ఉపయోగిస్తున్నామనేది ఏమాత్రం బయటపడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. బయోడైవర్‌సిటీ సంస్థ అధ్యయనం ప్రకారం ఒక టన్ను ఎర్రచందనం కోట్లల్లో ధర పలుకుతున్నది. అందుకే రాయలసీమలోని మాఫియా ముఠాలు కొందరు ఫ్యాక్షన్ నేతలు, ఇంకొందరు రాజకీయ వాదులు ఎర్రచందనం స్మగ్లింగ్‌ను తమ వ్యాపకంగా మార్చుకున్నారు. దీనికితోడు అటవీ, పోలీసు శాఖ సిబ్బంది అధికారుల్లో కొందరు స్మగ్లర్లతో కుమ్మక్కు అవుతున్నారు. చట్టాల్లోని లొసుగులుకూడా స్మగ్లర్ల పాలిట వరాలుగా మారుతున్నాయి. వారిపై పెట్టిన కేసులను తిరుగులేని సాక్ష్యాలతో రుజువు చేయడంలో కొందరు అధికారులు విఫలమవుతున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాను నిరోధించేందుకు గతంలో ప్రత్యేకంగా తిరుపతి కేంద్రంగా ఏర్పాటు చేసిన టాక్స్‌ఫోర్స్ విభాగం రకరకాల సమస్యలతో కుదేలవుతున్నది. గతంలో ఇచ్చిన ప్రాధాన్యత పాలకులు నేడు అంతగా పట్టించుకోకపోవడం ఆ సిబ్బంది నిరుత్సాహంతో నీరసించిపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. అరుదైన ఈ వృక్షసంపదను సంరక్షించేందుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాలి.

మీ గౌరవ మర్యాదలు పెరగాలంటే, మంచి గుణాలున్న వారి సాంగత్యాన్ని పెంచుకోండి. చెడు సహవాసం చేయడం కంటే, ఒంటరిగా ఉండటం మంచిది.



స్వామి వివేకానంద

సంపదను సరిగ్గా వాడుకోవడం తెలీని ధనవంతుల్ని సంపద దుర్వినియోగదారులుగా తయారు చేస్తుంది.



థామస్ ఫుల్లర్

# ప్రజావాక్కు



### పెన్షన్లు రద్దు చేయాలి

అనేక సంవత్సరాల నుండి పార్లమెంటు,అసెంబ్లీ సభ్యుల పెన్షన్లనురద్దుచేయాలని ప్రజలు అనేకవిన్నపాలు చేసుకున్నా ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయి. వీరందరూఇంచుమించుకోటీశ్వరులు.పైగాఎన్నిసార్లు ఎన్నికయితే అన్ని పెన్షన్లు వస్తాయట. ఇదేమి విచిత్రమో. మన దేశంలో చాలామంది ప్రభుత్వ,ప్రయివేటుఉద్యోగులకు పెన్షన్లు రావు.ఉన్నవి పెరగవు. ఉదహరణకు ఇ.పి.ఎస్. 1995 అన్కేపరమ అక్రమస్కీంలో రిటైరైన ఉద్యోగులకు కొంచెం అటు ఇటుగా దశాబ్దం పైగా వెయ్యి రూపాయల పెన్షను వస్తోంది. దానిని కనీసం 9000 చేయమని కేంద్రంలోని బిజెపి గవర్నమెంటు వారికినోళ్ళు చించుకుని ఎన్నిసార్లు విన్నపాలు చేసినా వారు విననట్లే ప్రవర్తిస్తున్నారు.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### విజయయాత్రలు చేపట్టకూడదు

రెండేళ్లక్రితం జరిగిన జెంజీ ఉద్యమ ఫలితంగా రాజకీయాలలో పాలనపద్ధతిలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి అనడంలో సందేహం లేదు. జులై చార్టర్ ప్రధాన కారణంగాతోస్తోంది.అందులో ప్రతిపాదించిన ఆరు అంశాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి.అందులో ఉన్న పోలీస్ సంస్కరణలు, పాలన సంస్కరణలున్యాయ సంస్కరణలు లాంటివి అందులో ఉన్నాయి. ఇంకా ముఖ్యమైన మార్పు ఏమిటి మైనారిటీలా మీద దాడులవల్లభారత్, బాంగ్లాదేశ్ మధ్య చెడిపోయిన సంబంధాలు ఇప్పుడు ఇద్దరు మైనారిటీలను మంత్రివర్గంలో చేర్చుకోవడం ద్వారా మైనారిటీల కుఅండగా నిలబడుతాం అనిసందేశంఇచ్చినట్లు అయింది.

- భారత అవినాష్,జనగామ

### రక్షణ మార్గాలను ఏర్పాటు చేయాలి

తిరుపతి తిరుమల ఘాట్ రోడ్‌లో నిత్యమూ బస్సులు లక్షల ప్రయాణీకుల్ని తీసుకువెళ్తాయి.ఏడాదిపాటు ట్రాఫిక్ ఉంటుంది. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం గానీ, ప్రమాదం గానీతప్పవచ్చు.ట్రాఫిక్ సరిచేయడంఎక్కడైనా ఉంటుంది. దశాబ్దకాలం నుండి ఈఘాట్‌రోడ్, పైన కొండలు, మలుపులు పూర్తిగాచూసి దేశంలోనిఅత్యంత ప్రతిష్టాత్మక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న నిపుణుల అభిప్రాయం. నిపుణులు సూచించే రక్షణ మార్గాలు పక్కగా ఇంజనీరింగ్ విభాగం చర్యలు చేపట్టాలి.

- బి. మేఘానథం, విశాఖపట్నం

### విస్తరిస్తున్న కేన్సర్ వ్యాధి

క్యాన్సర్ వ్యాధివిస్తృతి పెరుగుతున్ననేపథ్యంలో,ఆరోగ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ప్రభుత్వాల తక్షణ బాధ్యత. ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదికల ప్రకారం,క్యాన్సర్ మరణాలలో అధికశాతం తక్కువమధ్య ఆదాయదేశాల్లోనే సంభవిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం అత్యాధునిక చికిత్సా సౌకర్యాలు అందరికీ అందుబాటులో లేకపోవడం. ప్రభుత్వాలు కేవలం వ్యాధి సోకిన తర్వాత చికిత్స అందించడంపైనే కాకుండా, ముందస్తు నివారణ చర్యలపై కూడా దృష్టి సారించాలి. ముందుగా, ప్రతి జిల్లా స్థాయిలో అత్యాధునిక రోగ నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేయడం అత్యవసరం.క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ స్క్రీనింగ్ యూనిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించడంవల్ల మారుమూల ప్రజలకు వైద్యసేవలు అందుతాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో రేడియేషన్, కిమోథెరపీవంటి ఖరీదైన చికిత్సలను ఉచితంగా,తక్కువ ధరకే అందుబాటులోకి తేవాలి.

-సి.హెచ్.ప్రతాప్,శ్రీకాకుళం

### వైట్ పాపులేషన్ లెక్కించాలి

ప్రపంచంలో వైట్‌పాపులేషన్ రోజురోజుకుపెరుగుతుంది. యూఎస్ఏలో 2000 సంవత్సరం నుండి 2025 సంవత్సరం వరకు 25 సంవత్సరాలలో వైట్ పాపులేషన్ జనాభా లెక్కలు సేకరించడం జరిగింది. అదే తరహాలో తెలంగాణ రాష్ట్రంలోని 12.769గ్రామాలలో ప్రతి గ్రామంలో ఈ మధ్యకాలంలో ప్రభుత్వం చేపట్టేజనాభా లెక్కలసేకరణలో వైట్ పాపులేషన్ వివరాలు కూడా సేకరించాలి.వీరు చాలామంది పుట్టుకతో దృష్టిలోపంతోఎండ,వాన,చలి వాతావరణానికి తట్టుకోలేకపోతున్నారు. శారీరక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవడం జరుగుతుంది. ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించాలి.తక్కువ జనాభా కలిగిన మైనారిటీ వర్గంగా గుర్తించి వారి సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### కఠిన శిక్షలు పడాలి

అవినీతి నిరోధక శాఖ కేసులు ఏళ్ళుగడుస్తున్నా కొలిక్కి రావటంలేదు. ఇదే అలుసుగా లంచాల బాటలో నడుస్తున్న అధికారులు మళ్ళీ తిరిగి అదే బాటలో నడుస్తున్నారు. ఈ పరిస్థితి మారాలి. లంచావతారులపై కఠిన చర్యలు తీసుకొని,వారికి కఠిన శిక్షలు పడేలా చేయాలి.

-మా.శ్రీ. రాజు, పాల్వంచ

మన్నవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భారతదేశంవైపు అగ్రరాజ్యాల చూపు!

**ప్రపంచంలో వివిధ దేశాలపై ఎగుమతులు, దిగుమతులపై అసమతుల్యమైన టారిఫ్ విధానాన్ని వివిధ దేశాల మధ్య అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా తెర వెనుక అత్యంత శక్తివంతమైన దక్షిణాసియా దేశాలైన చైనా రష్యా, భారత్ లాంటి దేశాలు ఏకమైతే అగ్రరాజ్యమైన అమెరికా పరిస్థితి ఎలా ఉంటుందో అమెరికా ఊహించుకుందేమోకానీ ఇక లాభం లేదు అనుకునే రీతిలో భారతదేశంపై అనవసరంగా అధిక సుంకాలను విధించడం అమెరికా తమ దేశ ప్రయోజనాలకు మంచిది కాదని భావించి ఉండవచ్చు. ఇదే రీతిలో భారతదేశ స్వతంత్ర విదేశాంగ విధానం ప్రపంచ శాంతి సౌభాగ్యం సద్భావన మంచి స్నేహ సంబంధాలు ప్రజల మధ్య సఖ్యత పరస్పర సహకారం అహింసావాదం లాంటి నిర్దిష్టమైన విధానాలు అనుసరిస్తున్న తరుణంలో అమెరికా, రష్యా లాంటి దేశాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు భారత దేశంతో కలిసి వాణిజ్య వ్యాపార సంబంధాలను మరింత మెరుగుపరుచుకోగలవని ఆశించడంలో సందేహంలేదు.**

దాడిశెట్టి శ్యామ్ కుమార్

భారతదేశం ప్రపంచ దేశాలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన దేశంగా గోచరిస్తుందా అంటే అవును నిజమే అనిపిస్తుంది. ప్రపంచంలో అగ్రరాజ్యాలు అయిన అమెరికా, రష్యా ,యూరప్ యూనియన్ లాంటి దేశాలు భారతదేశంతో వ్యాపార వాణిజ్య తదితర అంశాలలో మంచి సంబంధాలు కలిగి ఉంటున్నా, ఎన్నడూ లేని విధంగా భారత్ ప్రత్యక్షంగా రష్యా నుండి అధిక మొత్తంలో క్రూడ్‌ఆయిల్ దిగుమతి చేసుకుంటుందనే నెపంతో భారతదేశ వాణిజ్య వ్యాపారంపై అమెరికా అత్యధిక టారిఫ్ అంటే సుంకం విధానాన్ని అమలు చేసి రష్యా నుండి క్రూడాయిల్ దిగుమతి చేసుకోకుండా భారతదేశంపై ఒత్తిడి పెంచాలని ప్రయత్నాలు చేసినా చివరకు కారణాలేవైనా భారతదేశంపై విధించిన సుంకాలను తగ్గిస్తున్నట్టు అమెరికా ప్రకటించడం, ఈ క్రమంలో అమెరికా చేసిన ప్రకటనపై భిన్న వాదనలు తెరపైకి వచ్చాయి. భారతదేశం రష్యాతో పాటు యూరోపియన్ దేశాలతో అనుసరిస్తున్న స్వతంత్ర విదేశాంగ విధానంతో భారతదేశం ఎప్పుడూ శాంతి పక్షాన ఉంటుందని ప్రపంచంలో శాంతియుత జీవనవిధానాలకు అనుగుణంగా ఉంటామని చెప్పిన మాటకు కట్టుబడి ఉండి ఆ దిశగా పురోగమిస్తున్న తరుణంలో అమెరికా అధిక టారిఫ్ విధించి రష్యాతో భారత్‌కు ఉన్న వ్యాపార వాణిజ్యాన్ని కట్టడి చేసే ప్రయత్నం చేసింది. తద్వారా భారత్ ఆర్థిక వ్యవస్థను బలహీన పరచటాడానికి అనేక రకాలుగా విశ్వప్రయత్నం చేసింది. ఎగుమతులు దిగుమతుల వస్తువులపై అత్యధిక సుంకాలను విధించినప్పటికీ, భారత్ కొంచెం కూడా ఆందోళన చెందక ప్రత్యామ్నాయ ఏర్పాట్ల వైపే దృష్టి సారించింది. భారతదేశం దేశ ప్రజల ప్రయోజనాల గురించి మాత్రమే ఆలోచించింది తప్ప ఇతర దేశాల పెత్తనాన్ని భారత్ ఎప్పుడూ సహించలేదు. ఇటీవల కాలంలో ఇండియా, రష్యా, వార్షిక శిఖరాగ్ర సభ కూడా జరగడం, భారతదేశానికి రష్యా అధ్యక్షుడు విచ్చేయడం వాణిజ్య వ్యాపార సంబంధాలు రక్షణ విషయంలో రష్యా మరింత దగ్గర కావడం అమెరికాకు అంతగా నచ్చలేదేమో కానీ, రష్యా, ఉక్రేయిన్ యుద్ధ సమయంలో రష్యా ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచేందుకే భారత్ క్రూడ్‌ఆయిల్‌ను రష్యా నుండి ఎన్నడూ లేని విధంగా అధికంగా దిగుమతి చేసుకోవడం, వ్యాపార వాణిజ్య సంబంధాలు సైతం రష్యాతో జోరుగా సాగిస్తుంది అనే అమెరికా ఊహాజనితమైన వాదనలే ప్రత్యక్షంగా పరోక్షంగా భారతదేశం ఎగుమతులు, దిగుమతులపై సుంకాలను పెంపునకు కారణం కావచ్చు అనే భిన్న అభిప్రాయాలు లేకపోలేదు. భారత్ యూరోప్ యూనియన్ దేశాలతో పాటు ప్రపంచంలోని వివిధ దేశాలతో ప్రత్యామ్నాయంగా వాణిజ్య వ్యాపార సంబంధాలను మెరుగుపరుచుకునే ప్రయత్నంలో ఉండగా ఎక్కడ భారతదేశంతో సత్సంబంధాలు తెగిపోతాయేమోనని



కావచ్చు. తిరిగి భారత్‌తో వాణిజ్య వ్యాపార సంబంధం మెరుగుపరచుకోవడానికి ఇటీవల భారతదేశంపై విధించిన సుంకాలను తగ్గిస్తున్నట్టు ఒప్పందం జరిగిందని ప్రకటించింది. కానీ ఒప్పందంలో ఇరుదేశాల అగ్రనేతలు ఎక్కడ పాల్గొన్నట్లు కనిపించలేదు. కాకపోతే అమెరికా భారత్‌పై సుంకాలు తగ్గించినట్లు వచ్చిన వార్త నిజమే అన్నట్టు భారతదేశ సంబంధిత శాఖ కేంద్ర మంత్రి సూచప్రాయంగా తెలపడంతో ఈ క్రమంలో ఒప్పందం వల్ల ప్రయోజనాల కన్నా ఏమైనా నష్టాలున్నాయా తెలుపమని దేశంలోని ప్రతిపక్ష నాయకులు కూడా అనేక ప్రశ్నలు లేవనెత్తడం తీవ్ర చర్చాంశంగా మారింది. గతం కంటే భారతదేశం అంతరిక్ష శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రపంచంలో తిరుగులేని శక్తిగా మారుతుంది. విప్లవాత్మకమైన మార్పులతో వ్యాపార వాణిజ్య పరంగా అత్యధికంగా స్వయం శక్తితో ముందుకు పురోగమిస్తుంది. ప్రపంచ శాంతి సద్భావనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే ప్రత్యక్షంగా పరోక్షంగా టెర్రరిస్టులకు వ్యతిరేకంగా పోరాడుతున్న అత్యంత శక్తివంతమైన భారతదేశం ఇప్పుడు ప్రపంచ స్థాయిలోనే అగ్రరాజ్యాలను సైతం అహింసా విధానాలతో సై అంటే సై అని ఢీకొట్టే దమ్మున్న భారతదేశం వైపు ప్రపంచ దేశాలు దృష్టి సారిస్తుండడం గమనార్హం. అయితే అమెరికా నుండి భారతదేశంపై అధిక సుంకాలను తగ్గిస్తున్నట్టు ప్రకటన రాకముందు కొన్ని యూరోపియన్ దేశాల నేతలు అమెరికా భారత్ పైఅనుసరిస్తున్న విధానాన్ని పక్కనపెట్టి భారత దేశంతో వ్యాపార వాణిజ్యాలు చేసుకునేందుకు ముందుకు రావడం విశేషం. యూరోపియన్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షులు ఇటీవల భారతదేశాన్ని సందర్శించడంతో పాటు భారతదేశం గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం ప్రపంచదృష్టిని ఆకర్షించింది.పరోక్షంగా నైనా భారతదేశం రష్యా స్నేహబంధం మధ్య దూరాన్ని తగ్గించాలనుకోవడం అంత సులువు కాదేమో అని అమెరికా గ్రహించింది కావచ్చు. అమెరికా కూడా చివరకు భారతదేశంతో సత్సంబంధాలు వదులుకోవడానికి సాహసించలేదు అనే రీతిలో భారతదేశ వాణిజ్య వ్యాపారలపై ఎగుమతులు దిగుమతులపై సుంకాలను తగ్గిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఏదిఏమైనప్పటికీ ప్రపంచంలో వివిధ దేశాలపై ఎగుమతులు, దిగుమతులపై అసమతుల్యమైన టారిఫ్ విధానాన్ని వివిధ దేశాల మధ్య అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా తెర వెనుక అత్యంత శక్తివంతమైన దక్షిణాసియా దేశాలైన చైనా రష్యా, భారత్ లాంటి దేశాలు ఏకమైతే అగ్రరాజ్యమైన అమెరికా పరిస్థితి ఎలా ఉంటుందో అమెరికా ఊహించుకుందేమోకానీ ఇక లాభం లేదు అనుకునే రీతిలో భారతదేశంపై అనవసరంగా అధిక సుంకాలను విధించడం అమెరికా తమ దేశ ప్రయోజనాలకు మంచిది కాదని భావించి ఉండవచ్చు. ఇదే రీతిలో భారతదేశ స్వతంత్ర విదేశాంగ విధానం ప్రపంచ శాంతి సౌభాగ్యం సద్భావన మంచి స్నేహ సంబంధాలు ప్రజల మధ్య సఖ్యత పరస్పర సహకారం అహింసావాదం లాంటి నిర్దిష్టమైన విధానాలు అనుసరిస్తున్న తరుణంలో అమెరికా, రష్యా లాంటి దేశాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు భారత దేశంతో కలిసి వాణిజ్య వ్యాపార సంబంధాలను మరింత మెరుగుపరుచుకోగలవని ఆశించడంలో సందేహంలేదు. ●

# పరీక్షలు యుద్ధంలా కాదు..పండుగలా జరుపుకుందాం

నల్ల రవికుమార్

ఆంధ్రప్రదేశ్ పదో తరగతి చదువుతున్న లక్షలాది మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఇళ్లలో ప్రస్తుతం ఒకే చర్చ నడుస్తోంది. అది '100 రోజుల యాక్షన్ ప్లాన్' విద్యా సంవత్సరం ప్రారంభంలో నెమ్మదిగా సాగే పాఠశాల వాతావరణం డిసెంబర్ వచ్చేసరికి ఒక్కసారిగా యుద్ధ ప్రాతిపదికన మారిపోయింది. ఫిబ్రవరి నాటికి పూర్తి కావాల్సిన సిలబస్‌ను డిసెంబర్ నాటికే ముగించాలన్న అధికారుల ఆదేశాలతో తరగతి గదుల్లో బోధన వేగం పుంజుకుంది. అయితే, ఈ వేగం వెనుక విద్యార్థుల భవిష్యత్తుపై ఉన్న ఆందోళన కంటే, రాష్ట్ర స్థాయిలో ఉత్తీర్ణతాశాతం పెంచి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్న ప్రభుత్వ లక్ష్యమే ఎక్కువగా కనిపిస్తోందన్న విమర్శలు విద్యా రంగ నిపుణుల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రతి ఏటా నిర్వహించే 'పరీక్షా పే చర్చా' కార్యక్రమ ఉద్దేశాలకు, ఏపీలో అమలవుతున్న ఈ యాక్షన్ ప్లాన్కు మధ్య ఉన్న స్పష్టమైన వైరుధ్యం చర్చనీయాంశంగా మారింది. నిజానికి ప్రధాని మోడీ 'పరీక్షా పే చర్చా' ద్వారా ప్రపంచానికి ఒక సందేశాన్ని ఇస్తున్నారు. పరీక్షలు అనేవి కేవలం విద్యార్థుల జ్ఞాపకశక్తిని కొలిచే సాధనాలు కాకూడదని, వాటిని పండుగలా (ఎగ్జామ్స్ యాజ్ ఫెస్టివల్) ఆనందంగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. పరీక్షల సమయంలో విద్యార్థుల్లో కలిగే ఒత్తిడిని, ఆందోళనను తగ్గించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే ఈ కార్యక్రమంపరమార్థం. కానీ, ఏపీలో అమలవుతున్న వంద రోజుల ప్రణాళిక దీనికి భిన్నంగా, విద్యార్థులను నిరంతర ఒత్తిడికి గురిచేసేలా ఉందని మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరంతర బోధన, ఆపై ప్రత్యేక తరగతులు, ఆదివారాలు కూడా మాక్ టెస్టులు నిర్వహించడం వంటి చర్యలు విద్యార్థులను మానసిక అలసటకు గురిచేస్తున్నాయి. శాస్త్రవేత్తలు చెప్పినట్లుగా, పిల్లల అభ్యాస ప్రక్రియ అనేది ఒక సహజ వృద్ధి విధానం. దానిని అర్థం చేసుకునే సమయం, పునశ్చరణ, స్వేచ్ఛగా ప్రశ్నలు అడిగే వాతావరణం అవసరం. వేగంగా సిలబస్ పూర్తి చేయాలన్న ఆరాటంలో ముఖ్యంగా గణితం, సైన్స్ వంటి కఠినమైన సబ్జెక్టుల్లో మూలభూత సూత్రాలు అర్థం కాకుండానే తదుపరి పాఠాలకు వెళ్లడం వల్ల విద్యార్థులకు సమాచారం చేరుతోంది కానీ జ్ఞానం కలగడం లేదు.




ప్రధాని మోడీ సైతం తన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకంలో మార్కుల కంటే అవగాహనకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. 'జ్ఞాపకశక్తి కంటే భావనాత్మక స్పష్టత మిమ్మల్ని జీవితంలో గొప్పవారిని చేస్తుంది' అన్న ఆయన మాటలకు, కేవలం పరీక్షా ఫలితాలకోసం చేస్తున్న ఈ'యుద్ధ సన్నద్ధత' వ్యతిరేక దిశలో ప్రయాణిస్తోంది.మరోవైపు, ప్రతి రోజు స్లిప్ టెస్టులు నిర్వహించి వాటి మార్కులను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలన్న నిబంధన ఉపాధ్యాయులను డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా మారుస్తోంది. బోధన నాణ్యతపై దృష్టి పెట్టాల్సిన గురువులు, మార్కుల నమోదు,అటెండెన్స్ వివరాల సేకరణలో సమయం వృథా చేయాల్సి వస్తోంది. ఇది ఉపాధ్యాయుల్లో కూడా అసహనాన్ని, అలసటను పెంచుతోంది. 'మూల్యాంకనం అనేది విద్యార్థి లోపాలను సరిదిద్దే ఆలోచనాత్మక ప్రక్రియ కావాలి కానీ, అది యాంత్రికంగా మారకూడదు' అని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. పండుగల సెలవుల్లో కూడా విద్యార్థులను బడికి రప్పించడం వల్ల వారు కుటుంబంతో గడిపే సమయాన్ని కోల్పోతున్నారు. ఇది వారి భావోద్వేగ అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం ఏపీలోని పదో తరగతిగదుల్లో ప్రతి విద్యార్థి ఒక సంఖ్యగా మారిపోతున్నాడనే విమర్శ వినిపిస్తోంది. చైల్డ్ సైకాలజీ ప్రకారం,14-15 ఏళ్ల వయసులో ఉన్న పిల్లలకు శారీరక, మానసిక మార్పులు సంభవిస్తున్న తరుణంలో అధిక ఒత్తిడి కలిగించడం వల్ల వారిలో నిద్రలేమి, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు తలెత్తుతాయి. పరీక్షా ఫలితాలు రాష్ట్ర విజయ సూచిక కావచ్చు కానీ, అది విద్యార్థుల సృజనాత్మకతను బాల్యాన్ని బలితీసుకునేదిగా ఉండకూడదు. 'ఫలితాలు ముఖ్యమే కానీ, ఆ ఫలితాల వైపు సాగే ప్రయాణం కూడా అంతే ముఖ్యమని' ప్రధాని పదేపదే చెబుతుంటారు. అంతిమంగా, విద్యా సంస్కరణలు అనేవి విద్యార్థిని మానసిక దృఢత్వం కలిగిన వ్యక్తిగా తీర్చిదిద్దాలి. 100 రోజుల యాక్షన్ ప్లాన్ లక్ష్యాన్ని సమతుల్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పరీక్షల ప్రిపరేషనను ఒక సహజ అభ్యాస ప్రక్రియగా మార్చి, స్లిప్ టెస్టుల మోత తగ్గించి, విద్యార్థులకు తగినంత విశ్రాంతిని కల్పించినప్పుడే అది నిజమైన విద్యా సాధన అవుతుంది. పరీక్షలు జీవితంలో ఒక మలుపు మాత్రమే తప్ప, అవే జీవితం కాదన్న వాస్తవాన్ని విద్యార్థులకు, తల్లిదండ్రులకు అర్థమయ్యేలా చెప్పడమే 'పరీక్షా పే చర్చా' అసలు ఉద్దేశ్యం. ఆ స్ఫూర్తితోనే రాష్ట్రస్థాయి ప్రణాళికలు కూడా రూపొందితే విద్యార్థులు ఎగ్జామ్ వారియర్లుగా మారి విజయం సాధిస్తారు. ●

# ఎఐపై నియంత్రణ లేకపోతే వినాశనమే!

మేకిరి దామోదర్

ఆధునిక సాంకేతిక విప్లవానికి భారత్ వేదిక ఈ నెల 16నుంచి 20 తేదీల వరకు ఢిల్లీలోని భారత్ మండపంలో కృత్రిమ మేధపై అంతర్జాతీయ స్థాయి ఏఐ ఎక్స్‌పో 2026 ఇంపాక్ట్ సమ్మిట్ జరుగుతుంది. విద్యుత్ ఆవిష్కరణ ప్రపంచాన్ని ఎలా మారుస్తుందో, 21వ శతాబ్దంలో కృత్రిమ మేధ కూడా అంతే స్థాయిలో మానవ జీవన విధానాలను, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పాలన, వ్యాపారం, ఆర్థిక వ్యవస్థలను,రాజకీయ నిర్మాణాలను ప్రభావితం చేస్తున్నదనే అభిప్రాయం ప్రపంచవ్యాప్తంగా బలపడుతోంది. ఈ సదస్సులో ప్రపంచ దేశాల ప్రభుత్వాధినేతలు, పరిశ్రమల అగ్రగాములు, ప్రముఖ టెక్నాలజీ సంస్థల సీఈఓలు, శాస్త్రవేత్తలు, విధాననిర్ణేతలు పాల్గొననున్నారు. అలాగే ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా హాజరవుతారు. సుమారు 700కి పైగా వివిధ అంశాలపై సెషన్లు నిర్వహించనున్న ఈ సమ్మిట్, కేవలం సాంకేతిక ప్రదర్శన వేదికగా కాకుండా, భవిష్యత్ మానవ సమాజ దిశను నిర్ణయించే విధాన చర్చలకు కేంద్రమవుతోంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా ఆర్థిక వ్యవస్థ, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థల విస్తరణ, గ్లోబల్ కనెక్టివిటీ వంటి అంశాల నేపథ్యంలో భారత్ ఈ వేదికను వినియోగించుకోవడం ఒక వ్యూహాత్మక అడుగు. ప్రపంచ సాంకేతిక నాయకత్వంలో భారతదేశం కీలక పాత్ర పోషించాలనే లక్ష్యంతో ఈ చర్చలు సాగనున్నాయి.ఇప్పుడు ఏఐ ప్రతిరోజు జీవనంలో అంతర్భాగమై పోయింది. ఆరోగ్య రంగంలో ముందస్తు వ్యాధి నిర్ధారణ, వైద్యచిత్రాల విశ్లేషణ, వ్యవసాయంలో వాతావరణ అంచనాలు, పంటలనిర్వహణ, విద్యారంగంలో వ్యక్తిగతీకరించిన అభ్యాస పద్ధతులు, పరిశ్రమల్లో ఆటోమేషన్ సరఫరా గొలుసు నిర్వహణ - ఇవన్నీ ఏఐ ఆధారిత మార్పులే. 2023-24 కాలంలో ఏఐపై అనేక భయాలు వ్యక్తమయ్యాయి. ఉద్యోగాలు కోల్పోతాం, మనిషిని భర్తీ చేస్తుంది, నియంత్రణ తప్పుతుంది వంటి చర్చలు జోరుగా సాగాయి. అయితే 2025-26 నాటికి ప్రపంచ రాజకీయ చర్చలు అవకాశాల వైపు మళ్లాయి. పెట్టుబడులు పెరిగాయి. దేశాలు ఏఐలో ఆధిపత్యం సాధించడానికి పోటీ పడుతున్నాయి. అయితే భయం తగ్గిందని ప్రమాదం కూడా తగ్గిందని భావించడం పొరపాటు. వాస్తవానికి సాంకేతిక సామర్థ్యం పెరిగిన కొద్దీ దాని ప్రభావం మరింత విస్తరిస్తుంది. అణుశక్తి విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగపడినట్టే వినాశనానికి కారణమైందని చరిత్ర చెబుతోంది.అలాగే కృత్రిమ మేధ కూడా ద్విముఖ కత్తి లాంటిది. ఏఐ ద్వారా ఉత్పాదకత పెరిగి ఆర్థిక వృద్ధి వేగవంతమవుతుంది. ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, అవినీతి నియంత్రణకు సాంకేతిక సహకారం లభిస్తుంది. పేదరిక నిర్మూలనలో డేటా ఆధారిత నిర్ణయాలు సహకరిస్తాయి. ప్రకృతి విపత్తుల ముందస్తు హెచ్చరికలు, వాతావరణ మార్పుల అంచనాలు వంటి అంశాల్లో కూడా ఏఐ కీలక పాత్ర పోషిస్తుంది.



భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశానికి ఇది ఒక చారిత్రాత్మక అవకాశం. యువ జనాభా, డిజిటల్ మౌలిక సదుపాయాలు, స్టార్టప్ సంస్కృతి - ఇవన్నీ కలిసి ఏఐ విప్లవంలో భారత్‌ను ముందుకు తీసుకెళ్లగలవు. అయితే ఈ అభివృద్ధి సమగ్రతతో కూడి ఉండాలి. నగరాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకు కూడా ప్రయోజనం చేకూరాలి. ఏఐ శక్తి అపారమైనది. ఒక దేశం లేదా కార్పొరేట్ సంస్థ చేతుల్లో కేంద్రీకృతమైతే అనేక రకాల ముప్పులు తలెత్తవచ్చు. స్వయం నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరిన ఏఐ వ్యవస్థలు రక్షణ రంగంలో కీలక పాత్ర పోషించవచ్చు. కానీ అదే సమయంలో సైబర్ యుద్ధాలు, స్వయంచాలిత ఆయుధ వ్యవస్థలు వంటి అంశాల్లో నియంత్రణ తప్పితే జాతీయ భద్రతకు ప్రమాదం. దుష్ట శక్తులు, ఉగ్రవాద గుంపులు ఏఐని సైబర్ దాడులు, దుష్ప్రచారం, జీవ ఆయుధాల రూపకల్పన వంటి కార్యకలాపాలకు వాడితే ప్రపంచ భద్రతకు తీవ్ర సవాలు. ఏఐ ఆధిపత్యం కొద్ది కార్పొరేట్ సంస్థల చేతుల్లోనే కేంద్రీకృతమైతే ఆర్థిక అసమానతలు పెరుగుతాయి. డేటా, నీరు, విద్యుత్, నైపుణ్య మానవ వనరులు - ఇవన్నీ కొందరి నియంత్రణలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఏఐ ఉత్పాదకతను పెంచినా, అనేక సంప్రదాయ ఉద్యోగాలు నశించే అవకాశం ఉంది. కొత్త నైపుణ్యాల కోసం పెద్ద ఎత్తున శిక్షణ అవసరం. లేకపోతే నిరుద్యోగం, సామాజిక అస్థిరత పెరుగుతాయి. పౌరహక్కులు, గోప్యత, వివక్ష వంటి అంశాలు కీలకం. ఏఐ మోడళ్లలో పక్షపాత వైఖరులు నిక్షిప్తమైతే సామాజిక అన్యాయం పెరుగుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలపై దుష్ప్రభావం పడే ప్రమాదం ఉంది.ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ఖచ్చితమైన నియంత్రణా చట్టాలు రూపొందించాలి. ఆవిష్కరణలను అడ్డుకోకుండా, ప్రమాదాలను మాత్రమే కట్టడి చేసే విధానాలు అవసరం. కంపెనీలు స్వచ్ఛందంగా బాధ్యత వహించాలి. అంతర్జాతీయ స్థాయిలో పర్యవేక్షణ, పారదర్శకత, డేటా రక్షణ ప్రమాణాలు రూపొందించాలి. భారత్‌లో జరుగుతున్న ఈ సమ్మిట్ ఈ దిశగా మార్గదర్శకంగా నిలవాలి.ప్రపంచ దేశాలు కలిసి ఒక సాధారణ నైతిక చట్రం రూపొందించగలిగితేనే ఏఐ ప్రయోజనాలు సమానంగా పంచబడతాయి. సాంకేతికత స్వతహాగా తటస్థం. దాని వినియోగమే దాని స్వరూపాన్ని నిర్ణయిస్తుంది. కృత్రిమ మేధ మానవ వికాసానికి అపార అవకాశాలను అందిస్తోంది. అదే సమయంలో నియంత్రణ లేకపోతే వినాశనానికి దారితీసే శక్తి కూడా ఉంది. అందువల్ల ఈ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ కేవలం పెట్టుబడుల వేదికగా కాకుండా, మానవీయ విలువలకు కట్టుబడి ఉండే గ్లోబల్ ఒప్పందానికి దారితీయాలి. సామ్రాజ్యవాద స్వార్థాలు, కార్పొరేట్ ఆధిపత్యం, డేటా దోపిడీ వంటి అంశాలను నియంత్రించేందుకు అంతర్జాతీయ సహకారం అవసరం. పారదర్శకత, బాధ్యత, సమానత్వం, సౌభ్రాతృత్వం ఈ నాలుగు స్తంభాలపై ఏఐ భవిష్యత్తు నిర్మితమవ్వాలి. అభివృద్ధి, ప్రగతి, శాంతిఇవే సాంకేతిక ప్రయాణానికి పరమావధిగా నిలవాలి.ఢిల్లీలోని భారత్ మండపంలో ప్రారంభమైన చర్చలు ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశం ఇవ్వాలి. కృత్రిమ మేధ మనిషిని భర్తీ చేయడానికి కాదు, మానవ వికాసాన్ని వేగవంతం చేయడానికి. ఈ అగ్ని పరీక్షలో మానవీయ విలువలు గెలవాలి. ప్రపంచ శాంతి, సమగ్ర అభివృద్ధి, బాధ్యతాయుత సాంకేతిక యుగానికి భారత్ మార్గదర్శకంగా నిలవాలి. ఆధునిక సాంకేతికత సమాజ ప్రగతికి, వికాసానికి, విశ్వ శాంతికి తోడ్పడాలని విశ్వమానవాళి ఆకాంక్షిస్తోంది. ●

# కమ్ముకుంటున్న యుద్ధమేఘాలు..

## ఇరాన్‌ను చుట్టుముడుతున్న వార్‌షిప్‌లు, విమానాలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** పశ్చిమాసియాపై యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఏ క్షణమైనా ఇరాన్‌పై అమెరికా దాడి జరగవచ్చన్న ఆందోళన పెరుగుతోంది. ఇరాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో గడచిన 24 గంటల్లో 50కిపైగా యుద్ధ విమానాలను పశ్చిమాసియాకు అమెరికా తరలించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇరాన్ సరిహద్దుకు సమీపంలోని తన వైమానిక, నౌకాదళ సామర్థ్యాన్ని బలోపేతం చేసే ప్రయత్నంలో భాగంగా 50కిపైగా ఎఫ్16, ఎఫ్22, ఎఫ్35 యుద్ధ విమానాలను మోహరించినట్లు అమెరికన్ మీడియా ప్రకటించింది. పెద్ద సంఖ్యలో యుద్ధ విమానాలు పశ్చిమాసియా దిశగా పయనిస్తున్నట్లు స్వతంత్ర విమాన ట్రాకింగ్ డాటా సూచించింది. ఇరాన్ అణు కార్యకలాపాలపై అమెరికా, ఇరాన్ ప్రతినిధుల మధ్య పరోక్ష చర్చలు సాగుతున్న నేపథ్యంలో తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇరాన్ అణుకార్యక్రమంపై ఆందోళనలు కొనసాగుతూ ప్రత్యక్ష పోరు అనివార్యంగా కనిపిస్తున్నప్పటికీ దౌత్యపరమైన ప్రయత్నాలు మాత్రం ఇటీవల కొన్ని వారాలుగా జరుగుతున్నాయి. తన బలాన్ని మరింత ప్రదర్శించేందుకు అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద విమాన వాహక నౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్‌ను పశ్చిమాసియాకు తరలిస్తోంది. కరీబియన్‌లో ఉన్న ఈ యుద్ధ నౌకకు గతవారం అమెరికా కొత్త బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ త్వరలోనే సైనిక చర్యను ప్రారంభించే అవకాశం ఉందని యాక్సియోస్ వార్తాసంస్థ వెల్లడించింది. గత ఏడాది జరిగిన 12 రోజుల ఘర్షణలతో పోలిస్తే రానున్న దాడి విస్తృతి చాలా పెద్దదని, కొన్ని వారాలపాటు ఘర్షణలు కొనసాగే అవకాశం ఉందని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ యాక్సియోస్ ప్రత్యేక కథనం ప్రచురించింది. చిన్నపాటి కార్యాచరణలతో కూడిన దాడికి ట్రంప్ ప్రభుత్వం సన్నాహాలుచేస్తున్నా పూర్తి స్థాయి సైనిక చర్యగా మారుతుందని యోక్సియోస్ తెలిపింది. ఇజ్రాయెల్‌తో కలసి అమెరికా సైనిక చర్యకు దిగవచ్చుని, ఇది ప్రాంతీయ సైనిక ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉందని వార్తాసంస్థ పేర్కొన్నది. జెనీవాలో జరిగిన తాజా అణు చర్చలుసహా దౌత్య స్థాయి చర్చలు కొనసాగుతున్నప్పటికీ అవి ఫలప్రదమయ్యే అవకాశాలు కనపడడం లేదన్న అంచనాలున్నాయి. మీ యుద్ధనౌక కన్నా మా ఆయుధం ప్రమాదకరమని ఇరాన్ సుప్రీం నాయకుడు అయాతొల్లా అలీ ఖమేనీ అమెరికాకు ప్రత్యక్ష హెచ్చరికలు జారీచేశారు. అమెరికన్ యుద్ధ నౌకలను సముద్రం అడుగుభాగానికి పంపగల ఆయుధాలు ఇరాన్ వద్ద ఉన్నాయని ఖమేనీ తెలిపారు. ఇరు దేశాల మధ్య జెనీవాలో అణు చర్చలు తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో ఖమేనీ నుంచి ఈ హెచ్చరికలు జారీ కావడం గమనార్హం. అమెరికా విమానవాహక నౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్. ఫోర్డ్ తీవ్రంగా దెబ్బతిన్నట్లు, సముద్రంలో మునిగిపోతున్నట్లు చూపించే ఏఐ ఫొటోను ఖమేనీ షేర్ చేశారు. ఇరాన్ వైపు ఓ యుద్ధ నౌకను పంపినట్లు అమెరికన్లు నిరంతరం చెబుతుంటారని ఎక్స్‌లో ఖమేనీ చెపుతూ ఆ నౌకను సముద్రం అడుగుకు పంపగల ఆయుధం మరింత ప్రమాదకరం అని ఆయన వ్యాఖ్యానించారు. ఆయుధ సంపత్తిలో తమకు ఎవరూ సాటిలేరంటూ అమెరికా చెబుతున్న మాటలను ఆయన కొట్టివేశారు. తన దేశానికి ప్రపంచంలోనే అత్యంత బలమైన సైన్యం ఉందని అమెరికా అధ్యక్షుడు చెబుతు న్నారని అత్యంత బలమైన సైన్యం కూడా కొన్ని సార్లు తన కాళ్లపై నిలబడలేనంతగా దెబ్బలు తింటుంది అని ఖమేనీ వ్యాఖ్యా నించారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్ ప్రావిన్సు లో బుధవారం మంటలు చెలరేగాయి. పరంద్ నగరంలోని ఓ భవనం పైనుంచి దట్టమైన పొగలు కమ్ముకుంటున్న దృశ్యాలు సోషల్ మీడియాలో కనిపించాయి. ఆ ప్రదేశంలో పేలుడు సంభవించినట్లు ప్రాథమిక ఆన్‌లైన్ నివేదికలు పేర్కొన్నాయి. భవనం సమీపంలోని నది ఒడ్డున రెల్లు గడ్డి అంటుకోవడం వల్ల పొగ ఏర్పడిందని ఇరాన్ ప్రభుత్వ ప్రసార సంస్థ ఐఆర్ఐబీ తర్వాత తెలిపింది. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పుతున్నట్లు ప్రసార సంస్థ పేర్కొంది. షిరాజ్ ప్రావిన్సులో పేలుడు సంభవించినట్లు తెలుస్తున్నది. నగర శివార్లలోని పర్వత ప్రాంతంలో పేలుడు శబ్దం వినిపించినట్లు స్థానికులు తెలిపారు.



### విషవాయువులు పీల్చి 37 మంది మృతి 26 మందికి తీవ్ర అస్వస్థత

**లాగోస్, ఫిబ్రవరి 19:** నార్త్ సెంట్రల్ నైజీరియాలోని ఓ గనిలో విషవాయువులు లీకయ్యాయి. ఈ విషవాయువులు పీల్చి 37 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 26 మంది తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుందని అక్కడి పోలీస్ అధికారులు వెల్లడించారు. గనిలో ఆకస్మికంగా లెడ్ ఆక్సైడ్, సల్ఫర్, కార్బన్ మోనాక్సైడ్ గ్యాస్‌లు లీక్ కావడంతో ప్రమాదం జరిగిందని అధికారుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ గ్యాస్‌లు మానవాలికి చాలా విషపూరితమైనవని, ముఖ్యంగా తక్కువ వెంటిలేషన్ ఉన్న ఏరియాల్లో వీటి ప్రభావం తీవ్రంగా ఉంటుందని అధికారులు తెలిపారు. నైజీరియా సర్కారు ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించింది. మృతదేహాలను అంతిమ సంస్కారాల కోసం కుటుంబసభ్యులకు అప్పగించింది. గనిలో విష వాయువులు లీకవుతాయనే విషయంలో ముందుగానే అవగాహన లేకపోవడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగిందని అక్కడి మంత్రి చెప్పారు. ప్రమాదానికి కారణమైన గని సక్రమ మైనదా, అక్రమమైనదా అనే కోణంలో కూడా దర్యాప్తులో తేలుతుందని నైజీరియా మంత్రి తెలిపారు. నైజీరియాలో బంగారం కోసం పలు ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ జరుగుతోంది. ఈ గనుల్లో ఎంతోమంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.



### 122 సంవత్సరాల తర్వాత కోణార్క్ పునరుద్ధరణ

**కోణార్క్, ఫిబ్రవరి 19:** ఒడిశాలోని 13వ శతాబ్దపు కోణార్క్ సూర్య దేవాలయ గర్భ గుడిలోకి త్వరలో భక్తులు ప్రవేశించే అవకాశం రానున్నది. ప్రస్తుతం ఆ స్థలం ఇసుకతో నిండి ఉంది. దాన్ని ఇప్పుడు తొలగిస్తున్నారు. ఆలయం వెనుక ఉన్న 15 అడుగుల ఎత్తయిన గోడ కూలిపోకుండా నిరోధించడానికి బ్రిటిష్ పాలకులు 1903-04లో గర్భ గుడిని వేల టన్నుల ఇసుకతో నింపారు. జగ్‌మోహన్ హాల్‌గా పిలిచే ఈ ప్రాంతంలోకి శతాబ్దం పాటు ఎవరూ ప్రవేశించలేదు. తాజాగా భారత పురావస్తు శాఖ, ఐఐటీ మద్రాస్ నిపుణులతో కూడిన బృందం ఈ ఇసుకను తొలగించే పని చేపట్టింది. మొత్తం 122 సంవత్సరాల తర్వాత ఇపుడు ఈ పురాతన దేవాలయం ఉనికిలోకి వస్తోంది. మొత్తం ఇసుకను తరలించడానికి మూడు నెలలు పడుతుందని ఓ పురావస్తు శాఖ అధికారి తెలిపారు. ఇసుకను తరలించిన తర్వాత లోపలి గోడల పటిష్ఠతను పరిశీలించి గుడి పునర్ నిర్మాణంపై ఓ నిర్ణయం తీసుకోనున్నారు. పురావస్తుశాఖ, ఐఐటి మద్రాసు నిపుణులతో ఉన్న 30 మంది బృందం శాస్త్రీయపద్ధతిలో నిర్వహిస్తోంది. నిర్మాణంపై ఒత్తిడిని పర్యవేక్షించేందుకు 40 హైప్రెసిషన్ సెన్సార్లు కూడా ఏర్పాటుచేసారు. తాజ్‌మహల్ తర్వాత దేశంలో అత్యధికంగా సందర్శకులను ఆకర్షిస్తున్న స్మారకాల్లో కోణార్క్ రెండోది.

## బోగస్, నకిలీ హెచ్‌ఆర్‌సిలపై కమిషన్ సీరియస్

### కఠిన చర్యలు తీసుకోండి: రాష్ట్రాలకు ఆదేశం




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** మానవహక్కుల కమిషన్ తరహాలోనే గుర్తుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న నకిలీ సంస్థలు, వ్యక్తులను జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) తీవ్రంగా పరిగణించింది. ఇలాంటి సంస్థలపై దేశ వ్యాప్తంగా కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఈ మేరకు తీసుకున్న చర్యలపై రెండు వారాల్లోగా నివేదిక సమర్పించాలని గురువారం స్పష్టం చేసింది. ఢిల్లీ ప్రభుత్వంతో 2022లో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) పేరుతో ఓ ఎన్జీవో రిజిస్టర్ అయినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపింది. ఆ సంస్థ తమకు నీతి ఆయోగ్, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖల గుర్తింపు ఉందని ప్రచారం చేసుకుంటోందని పేర్కొంది. కర్ణాటకకు చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి ఈ సంస్థకు స్టేట్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నట్లు తేలిందని వెల్లడించింది. ఈ వ్యవహారం తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కమిషన్, దీనిపై సుమోటోగా విచారణ చేపట్టింది. ఇలాంటి మోసపూరిత పేర్లు ప్రజలను గందరగోళానికి గురిచేస్తాయని, ఈ సంస్థలు ఎన్‌హెచ్ ఆర్‌సీలో భాగమని లేదా తమచే గుర్తింపు పొందాయని భ్రమ కల్పిస్తున్నాయని అభిప్రాయపడింది. ఇది ప్రజల్లో కమిషన్ పట్ల నమ్మకాన్ని దెబ్బతీయడమే కాకుండా, నిధుల దుర్వినియోగానికి దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. గతంలో పలుమార్లు హెచ్చరించినా, ఉల్లంఘనలు కొనసాగుతు న్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో, అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలు, డీజీపీలకు నోటీ సులు జారీ చేసింది. ఎన్‌హెచ్ ఆర్‌సీ పేరును దుర్వినియోగం చేస్తున్న సంస్థలను గుర్తించి, వాటి రిజిస్ట్రేషన్లను రద్దు చేయడంతో పాటు తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రత్యేకించి, ఢిల్లీలో రిజిస్టరై కర్ణాటకలో కార్యకలాపాలు సాగిస్తున్న సదరు నకిలీ సంస్థపై తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల ఉన్నతాధికారులను ఆదేశించింది.

## వెనిజులా చమురు కొనుగోలుచేస్తున్న బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ కంపెనీలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** దేశీయ ఇంధన అవసరాలను తీర్చుకోవడంలో భారత్ సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందాల నేపథ్యంలో రష్యా నుంచి దిగుమతులు తగ్గించి, వెనిజులా వైపు మొగ్గు చూపుతోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) తొలిసారిగా వెనిజులా నుంచి ముడిచమురు కొనుగోలు చేయగా, ప్రైవేటు సంస్థ హెచ్‌పీసీఎల్ మిట్టల్ ఎనర్జీ లిమిటెడ్ (హెచ్ఎంఈఎల్) రెండేళ్ల విరామం తర్వాత మళ్లీ అక్కడి నుంచి దిగుమతులు చేపట్టింది. ఈ రెండు రిఫైనరీలు చెరో 1 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేశాయి. ప్రముఖ గ్లోబల్ ట్రేడర్ 'విటోల్' ద్వారా ఈ ఒప్పందం కుదిరింది. షిప్పింగ్ ఖర్చులను తగ్గించుకోవడానికి ఈ రెండు ఆర్డర్లను ఒకే భారీ నౌక (వీఎల్ సీసీ) ద్వారా భారత్‌కు తరలించనున్నారు. బీపీసీఎల్ ఈ చమురును కేరళలోని కొచ్చి మరియు గుజరాత్‌లోని బీనా రిఫైనరీలకు తరలించనుంది. హెచ్ఎంఈఎల్ దీనిని గుజరాత్‌లోని ముంద్రా పోర్ట్ ద్వారా పంజాబ్‌లోని బటిండా రిఫైనరీకి పంపనుంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై అదనపు సుంకాలను రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. రష్యా చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేస్తుందని, దానికి బదులుగా అమెరికా మరియు వెనెజువెలా నుంచి చమురు దిగుమతులు పెంచుతుందని ట్రంప్ ప్రకటించారు. తాజా కొనుగోళ్లు ఈ ఒప్పందంలో భాగంగానే జరుగుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. వెనిజులా నుంచి లభించే మెరీ గ్రేడ్ ముడిచమురుపై భారీగా డిస్కౌంట్లు లభించే అవకాశం ఉంది. రష్యాపై ఆధారపడటం తగ్గించి, చమురు వనరులను వైవిధ్యం చేసుకోవడం వల్ల దేశ ఇంధన భద్రత మరింత బలపడుతుంది. అమెరికా నేరుగా వెనిజులా చమురు విక్రయాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, భారతీయ రిఫైనరీలకు ఎటువంటి చట్టపరమైన ఇబ్బందులు లేకుండా తక్కువ ధరకు చమురు లభిస్తోంది. గతంలో 2019 వరకు వెనెజువెలా నుంచి భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేసేది. అయితే అమెరికా ఆంక్షల వల్ల అది నిలిచిపోయింది. మళ్లీ ఇప్పుడు మారుతున్న రాజకీయ సమీకరణాల వల్ల ఈ వాణిజ్యం పుంజుకుంటోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా ఇప్పటికే వెనెజువెలా నుంచి నేరుగా చమురు దిగుమతి చేసుకునేందుకు అమెరికా నుంచి లైసెన్స్ పొందినట్లు సమాచారం.

### అందరూ సమష్టిగా చేతులు పైకెత్తినా..

## ఓపెన్ ఎఐ,ఆంథ్రోపిక్ సిఇఒలు విరుద్ధ ధోరణులు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** దేశ రాజధానిలోని భారత్ మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సదస్సులో ఓ అనూహ్య సన్నివేశం చోటుచేసుకున్నది. రెండు దిగ్గజ ఏఐ కంపెనీల మధ్య ఉన్న విబేధాలు స్పష్టంగా కనిపించాయి. గ్రూప్ ఫోటో కోసం వేదికపై నిలుచున్న ఏఐ ప్రతినిధులు చేతులు జోడించే సమయంలో రెండు కంపెనీలకు చెందిన లీడర్లు తమ చేతులను ఒకర్ని ఒకరు పట్టుకోలేదు. ప్రపంచ మీడియా ముందే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ప్రధాని మోదీ చూస్తుండగానే ఈ ఘటన జరిగింది. ఓపెన్ ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మ్యాన్, ఆంథ్రోపిక్ సీఈవో దారియో అమోడీ పక్కపక్కనే నిలుచున్నా ఆ ఇద్దరూ తమ చేతులను పట్టుకోలేదు. దీనికి బదులుగా ఆ ఇద్దరూ పిడికిలి బిగించి చేతులను పైకి ఎత్తారు. ఏఐ లీడర్లు అందరూ వరుసగా నిలబడ్డా ఆ ఇద్దరూ అయిష్టంగానే పక్కపక్కనే నిలుచున్నారు. కానీ చేతులను కలపడానికి వ్యతిరేకించారు. వరుస క్రమాన్ని బ్రేక్ చేసి కేవలం పిడికిలి మాత్రమే బిగించారు. దీంతో ఆ ఘటనకు చెందిన పిక్స్, వీడియోలు వైరల్ అవుతున్నాయి. కృత్రిమ మేధపై పనిచేస్తున్న ఓపెన్ ఏఐ కంపెనీ నుంచి అమడీ ఎప్పుడో వెళ్లిపోయారు. ఏఐని కమర్షలైజ్ చేస్తున్నట్లు ఆరోపించారు. భద్రతపై ఫోకస్ చేయడం లేదన్న ఉద్దేశంతో ఆ కంపెనీ వీడారు. అయితే సేఫ్టీ ముఖ్యమన్న లక్ష్యంతో ఆంథ్రోపిక్ కంపెనీ పెట్టారు అమోడీ. ఏఐ టెక్నాలజీ అనేది కోట్లాది మంది ప్రజలకు చేరాలని ఆల్ట్‌మ్యాన్ భావిస్తున్నారు. ఇది సాధ్యం కావాలంటే ఓపెన్ ఏఐ తమ ఉత్పత్తులను ఎక్కువగా కమర్షలైజ్ చేయాలని ఆల్ట్‌మ్యాన్ ప్రయత్నిస్తున్నారు. సర్వీసులు అందుబాటులో ఉండాలంటే అడ్వర్టైజింగ్ అవసరమని అన్నారు. అయితే ఓపెన్ ఏఐ, ఆంథ్రోపిక్ మధ్య ఉన్న శత్రుత్వం ఇవాళ భారత మండపం వేదికపై స్పష్టంగా కనిపించింది. ఏఐపై తీవ్ర పోటీపడుతున్న ఈ రెండు కంపెనీలు ఇటీవల కోడింగ్ టూల్స్‌ను ఆవిష్క రించాయి. కొన్ని క్షణాల వ్యవధి తేడాలోనే ఆ టూల్స్‌ను రిలీజ్ చేశాయి. తమ పోరాటం కేవలం ఐడియాలకు మాత్రమే కాదు అని, ఉత్తమ ఉత్పత్తులను నిర్మించాలన్న ఉద్దేశంతో ఉన్నట్లు ఆ కంపెనీలు పేర్కొన్నాయి. అయితే ఏఐ భవిష్యత్తు కోసం కలిసి దిగ్గజ నేతలు ఒకరి చేతులను ఒకరు పట్టుకోకపోవడం శోచనీయమే అవుతుంది. ఐకమత్యానికి సంకేతంగా చేయి, చేయి పట్టుకోవాలని మోదీ కోరగా, ఏఐ లీడర్ల మధ్య ఉన్న విబేధాలు బయటపడ్డాయి.

తాజాగా ఆంథ్రోపిక్ క్లాడ్ ఓపెన్ 4.6 ప్రొడక్ట్‌ను లాంచ్ చేసింది. అయితే 20 నిమిషాల తేడాలోనే ఓపెన్‌ఏఐ సంస్థ జీపీటీ5.3 కోడెక్స్‌ను ఆవిష్కరించింది. రెండు కంపెనీల మధ్య ఉన్న వైరానికి ఢిల్లీ వేదికైంది.




### అమెరికా చరిత్రలో వరస్ట్ అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్!

#### భారీస్థాయిలో పతమైన అధ్యక్షుడి ఆమోద రేటింగ్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 19:** అమెరికా 48వ అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ రేటింగ్ భారీగా పడిపోయింది. బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలంలోనే ఆయన రేటింగ్ అత్యంత దారుణంగా పడిపోయింది. తాజాగా యాహూ/యుగోవ్ నిర్వహించిన సర్వేలో 40 శాతం మంది అమెరికన్లు ట్రంప్‌ను అమెరికా చరిత్రలోనే అత్యంత చెత్త అధ్యక్షుడ్మగా పేర్కొన్నారు. గతంలో అమెరికా అధ్యక్ష బాధ్యతలు నిర్వహించిన ఎవరికీ ఈ స్థాయిలో వ్యతిరేకత ఎదురుకాలేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కేవలం 12 శాతం మంది మాత్రమే ట్రంప్‌ను అద్భుతమైన అధ్యక్షుడుగా భావిస్తుండగా 53 మంది ఆయనను విఫల అధ్యక్షుడుగా ముద్ర వేశారు. ట్రంప్ ఆమోదం రేటింగ్ 39 శాతానికి పడిపోగా వ్యతిరేకత 58 శాతానికి పెరిగింది. ముఖ్యంగా వలస వ్యతిరేక విధానాలు, హెచ్1బీ వీసా నిబంధనల కఠినత, మరియు వాణిజ్య యుద్ధం వంటి నిర్ణయాలపై అమెరికన్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది లిబరేషన్ డే పేరుతో వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలు వికటించాయి. స్వదేశంలోనూ దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ప్రతిపక్ష డెమొక్రాట్ల నియంత్రణలో ఉన్న నగరాల్లో నేషనల్ గార్డ్స్‌ను మోహరించడం వంటి నిర్ణయాలు ప్రజా వ్యతిరేకతను మరింత పెంచాయి. ప్రజాదరణ పడిపోతుండటంతో 2026లో జరగబోయే మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఓటమి తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సెనేట్ డెమొక్రాట్ల వశమైతే తనపై అభిశంసన వేటు పడే అవకాశం ఉందని ట్రంప్ స్వయంగా తన మద్దతుదారులను హెచ్చరించడం అక్కడి రాజకీయ వేడిని సూచిస్తోంది. ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహాన్ని గమనించిన ట్రంప్ యంత్రాంగం ఇప్పుడు వ్యూహాలు మారుస్తోంది. మిన్నెసోటాలో వలసదారులపై అణిచివేతను ఆపడం, ఉక్కు, అల్యూమినియంపై సుంకాలను తగ్గించడం వంటి దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని, ఈ చర్యలు ఓటర్ల మనసు మార్చలేవని తాజా పోల్ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.



### అణుస్థావరాల రక్షణకు ఇరాన్ చర్యలు!

**టెహ్రాన్, ఫిబ్రవరి 19:** అణు ఒప్పందానికి సంబంధించి ఇరాన్-అమెరికాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. పశ్చిమాసియాలో అగ్రరాజ్యం తన సైనిక బలాన్ని మోహరిస్తున్న నేపథ్యంలో ఇరాన్ తన అణుస్థావరాలను రక్షించుకొనేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఒకవేళ యుఎస్ దాడులకు పాల్పడినా వాటిని తట్టుకుని నిలబడేలా అణుస్థావరాలపై గట్టి బంకర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని వాషింగ్టన్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. గత రెండు వారాల్లో ఇరాన్‌న మిలిటరీ కాంప్లెక్స్‌లోని న్యూ తలేఘాన్-2 కేంద్రంపై కాంక్రీటుతో ఓలేయర్‌ను ఏర్పాటు చేసిందని ఇన్‌స్టిట్యూట్ పేర్కొంది. ఈ తలేఘాన్-2 టెహ్రాన్‌కు 30 కి.మీ.ల దూరంలో ఉంది. ఈ నెల 13నాటి శాటిలైట్ చిత్రాల ప్రకారం.. అణుస్థావరం మొత్తాన్ని పూర్తిగా కాంక్రీట్‌తో కప్పేశారు. ఇప్పుడు దానిపై మట్టి పోస్తున్నారు. ఇది త్వరలోనే పూర్తి బంకర్‌గా మారిపోతుందని, వైమానిక దాడుల నుంచి దీనికి రక్షణ లభిస్తుందని ఐఎస్ఐఎస్ అధ్యక్షుడు డేవిడ్ అల్‌బ్రైట్ పేర్కొన్నారు. కోలాంగ్-గాజ్‌లా పర్వతం కింద సొరంగ మార్గాలను తవ్వినట్లు ఈ నెల 10నాటి ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. నటాంజ్ అణుశుద్ధి కేం ద్రం నుంచి ఇది దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రయత్నాలన్నీ సొరంగంపై జరిగే వైమానిక దాడుల నుంచి రక్షణ కల్పించేందుకేనని సంస్థపేర్కొంది. ఈ ప్రాంతంలో కొన్ని వాహనాల కదలికలను గుర్తించింది. లోపల ఇరాన్ ఎఒ కార్యకలాపాలు చేపడుతున్నట్లు సంస్థ అనుమానిస్తోంది. ఎస్ఫహాన్ అణు కేంద్రం వద్ద కూడా రక్షణ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ నెల 8నాటి ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి.

## సంక్షిప్తంగా..

### ఎప్‌స్టీన్ ఫైల్స్ వివాదం.. బ్రిటన్ రాజు ఛార్లెస్ సోదరుడి అరెస్టు



**లండన్, ఫిబ్రవరి 19:** ఎప్‌స్టీన్ సెక్స్‌రాకెట్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. వాటిల్లో పలువురు ప్రముఖుల పేర్లు వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఆఫైళ్లలో బ్రిటన్‌రాజు సోదరుడు ఆండ్రూ మౌంట్‌బాటెన్ విండ్సర్ పేరు కూడాఉండటంతో రాజకీయంగా దుమారం రేగుతోంది. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్టుచేసినట్లు గురువారం యుకె పోలీసులు వెల్లడించారు. పదవీ దుర్వినియోగం ఆరోపణల కింద ఒక వ్యక్తిని కస్టడీలోకి తీసుకున్నామని పేర్కొన్నారు. మాజీ యువరాజు పేరు చెప్పకుండా ఈ అరెస్టు గురించి ప్రకటించారు. ఆండ్రూ బ్రిటన్‌రాజు ఛార్లెస్‌కు స్వయానసోదరుడు. ఎప్‌స్టీన్ ఫైళ్లలో పేరువెలువడినప్పటినుంచి ఆండ్రూ తీవ్రఒత్తిడి ఎదుర్కొంటున్నారు. అమెరికాకు చెందిన ఓ బాధితురాలు ఆయనపై లైంగిక ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.

### ద.కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు జీవిత ఖైదు



**సియోల్, ఫిబ్రవరి 19:** దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు జీవిత ఖైదు పడింది. ఆయన అధికారంలో ఉన్నప్పుడు దేశంలో మార్షల్‌లా విధించిన కేసులో తీర్పు వెలువడింది. చట్ట విరుద్ధంగా పార్లమెంట్‌ను తన గుప్పిట్లోకి తీసుకునేందుకు, నేతలను అరెస్టు చేసేందుకు, అనియంత్రిక అధికారాన్ని చెలాయించేందుకు సైన్యం, పోలీసు బలగాలను సమీకరించినందుకు గానూ తిరుగుబాటు కింద ఆయనను దోషిగా నిర్ధారించినట్లు న్యాయమూర్తి జీ కుయ్-యోన్ తెలిపారు. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ 2024 డిసెంబరులో అధికారంలో ఉన్న అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో 'మార్షల్ లా' విధించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో గంటల వ్యవధిలోనే ప్రకటనను విరమించుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అభిశంసనకు గురై పదవి కోల్పోయారు.

### కాలువలోకి దూసుకెళ్లిన కారు.. నలుగురు దుర్మరణం



**లక్నో, ఫిబ్రవరి 19:** కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. ఉత్తరప్రదేశ్‌లో మధుర జిల్లాలోని మాగోర్రా పోలీసుస్టేషన్ పరిధిలో ఈ విషాదఘటన చోటు చేసుకుంది. అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులోని నలుగురు అక్కడికక్కడే ప్రాణాలుకోల్పోయారు. మృతులు రాహుల్ (23), అమిత్ (22), మోహిత్ (22)గా గుర్తించారు. మరో వ్యక్తిని వారి స్నేహితుడిగా గుర్తించినట్లు తెలిపారు. వారంతా రాజస్థాన్‌లోని డీగ్‌కు ఓ వివాహవేడుకలో పాల్గొనేందుకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారమందుకున్నపోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికితీయించి పోస్టుమార్టానికి పంపించారు.

### కరాచి బిల్డింగ్‌లో గ్యాస్‌లీకేజితో పేలుడు: 16 మంది మృతి



**కరాచీ, ఫిబ్రవరి 19:** పాకిస్థాన్‌లోని కరాచీలోని ఒక రెసిడెన్షియల్ బిల్డింగ్‌లో గ్యాస్ లీకేజీ వల్ల పేలుడు జరిగింది. ఆ ప్రమాదంలో 16 మంది మరణించారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నారు. కరాచీలోని సోల్జర్ బజార్ ఏరియాలో దుర్ఘటన జరిగింది. గుల్ రాణా కాలనీ ఏరియాలో ఉన్న ఓ బిల్డింగ్‌లో ప్రమాదం జరిగినట్లు అధికారులు చెప్పారు. గాయపడ్డవారిని సివిల్ ఆస్పత్రికి తరలించారు. తెల్లవారుజామున 4.15 నిమిషాలకు బిల్డింగ్ తొలి ఫ్లోర్‌లో గ్యాస్ లీకేజీ పేలుడు ఘటన జరిగినట్లు తెలుస్తోందని ఏఎస్పీ జెంషెడ్ అషేర్ తెలిపారు. గ్యాస్ పేలుడు వల్ల బిల్డింగ్‌లో కొంత భాగం కూలినట్లు రెస్క్యూ టీమ్ ఆఫీసర్ డాక్టర్ అబిద్ జలాలుద్దిన్ షేక్ తెలిపారు. మృతుల్లో 8 మంది మైనర్లు, నలుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. గాయపడ్డవారిలో ఏడు మంది మైనర్లు ఉన్నారు.

### సాంకేతిక లోపంతో విమానసర్వీసులకు అంతరాయం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** నెవిటేర్ వ్యవస్థలో సాంకేతిక లోపం కారణంగా యూరప్‌తోపాటు ఢిల్లీ, ముంబై సహా దేశంలోని ఎయిర్‌పోర్టుల లో విమాన సర్వీసుల కు అంతరాయం ఏర్పడింది. నెవిటేర్‌వ్యవస్థలో దాదాపుగా 45 నిమిషాలపాటు సాంకేతిక లోపం తలెత్తడంతో ఈ పరిస్థితి నెలకొంది. దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం ఉదయం 6.45 గంటల సమయంలో ఈ సాంకేతిక సమస్య తలెత్తింది. బుకింగ్, చెక్‌ఇన్ కోసం ఎయిర్‌లైన్ సంస్థలు ఉపయోగించే నెవిటేర్ వ్యవస్థలో ఈ సమస్యను గుర్తించారు. గంటలోపే దానిని పరిష్కరించారు. కానీ ఈ సమయంలో సిబ్బంది బుకింగ్, చెక్‌ఇన్‌లను మాన్యువల్‌గా నిర్వహించాల్సి వచ్చింది.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

## భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ గొప్ప సామాజిక ఉద్యమం

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (సికింద్రాబాద్), ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, సమాజంలో సానుకూల మార్పు తీసుకువచ్చే గొప్ప సామాజిక ఉద్యమమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన బేడెన్ పావెల్ మెమోరియల్ హాల్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గవర్నర్ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమంలో మరింత మంది యువతను భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. సమాజంలో సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. స్కౌటింగ్ వ్యవస్థాపకుడు రాబర్ట్ బేడెన్‌పావెల్ కలను భారతీయ పరిస్థితులకు అనుగుణంగా విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. జాతీయ విద్యావిధానం (ఎన్ఇపి) ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ, పుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా నైతిక విలువలతో కూడిన విద్య అవసరమని పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో భాగస్వాములయ్యే బాధ్యతగల పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ వేదికగా నిలుస్తోందన్నారు.

## శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా ఘన నివాళులు : పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** మహానాయకుడు, స్వరాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఘన నివాళులు అర్పించారు. శివాజీ మహారాజ్ దేశభక్తి, ధైర్యసాహసం, పరిపాలనా దక్షతతో భారత చరిత్రలో చిరస్మరణీయ స్థానం సంపాదించారని ఆయన పేర్కొన్నారు. శివాజీ మహారాజ్ ప్రజల స్వాభిమానాన్ని కాపాడిన మహోన్నత నాయకుడు. సామాజిక సమానత్వం, మతసహనం, సుస్థిర పరిపాలనకు ఆయన ఆదర్శం అన్నారు. ప్రజల భద్రత, సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించి స్వరాజ్య స్థాపన సాధించారు. ఆయన స్ఫూర్తి నేటి తరాలకు మార్గదర్శకం అని అన్నారు. అన్యాయానికి ఎదురొడ్డి నిలబడే ధైర్యం, ప్రజలతో సన్నిహిత సంబంధం, శక్తివంతమైన పరిపాలన వ్యవస్థ నిర్మాణం శివాజీ మహారాజ్ ప్రత్యేకతలని ఆయన వివరించారు. యువతలో దేశభక్తి, నైతిక విలువలు పెంపొందించడానికి శివాజీ మహారాజ్ జీవితం ఆదర్శమని పేర్కొన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా పనిచేస్తోందని తెలిపారు. దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ శివాజీ మహారాజ్ ఆశయాలను ఆచరణలో పెట్టాలని మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు.

## ఎస్సీ గురుకుల పనివేళల సవరణకు ప్రభుత్వం హామీ

### సొసైటీ సెక్రటరీతో ఉపాధ్యాయ సంఘాల భేటీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల పని వేళలు సవరిస్తామనిఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ఎస్సీ గురుకుల సొసైటీ సెక్రెటరీ హామీ ఇచ్చినట్టు ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి. గురువారం సాంఘీక సంక్షేమ గురుకులాల సొసైటీలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించటానికి ఉపాధ్యాయ సంఘాలతో సొసైటీ సెక్రటరీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో టియస్‌యుటిఎఫ్ తరపున రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్ సాంఘిక సంక్షేమ గురుకులాల సొసైటి విభాగం నాయకులు ఎల్లయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారని యుటిఎఫ్ నాయకులు తెలిపారు. సమావేశం సందర్భంగా సొసైటీ సెక్రటరీ కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమానికి ఉపాధ్యాయులు ప్రాధాన్యతనివ్వాలని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోహెడ్ చంద్రమౌళి

## ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలి

### లేకుంటే మార్చి 2 నుంచి ఎమ్మెల్యేసహా వేలాది మంది దీక్షలు

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనే ప్రత్యేక నిధులను విడుదల చేయాలని తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కోహెడ్ చంద్రమౌళి డిమాండ్ చేశారు. మార్చి 1లోగా ప్రభుత్వం నిధులను విడు దల చేయకపోతే మార్చి 2వ తేదీ నుంచి కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విధంగా ఆయన చేపట్టే ఆమరణ నిరాహారదీక్షకు మద్దతుగా వేలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాలు దీక్షలో పాల్గొంటారని హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 23 నెలలుగా ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన జిపిఎఫ్, జిఐఎస్, లీవ్ ఎన్కాష్మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూటి అందలేదని, ఈ విషయంపై సిఎం, మంత్రులు, అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేశామన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు కనపర్తి దివాకర్, బుర్ర సుధాకర్, అంబటి వేణుకుమార్, ఆనందం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీలకు ఆర్థిక మద్దతు

### రూ.90 కోట్లతో వివిధ పథకాల అమలు

### మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** మైనారిటీలకు ఆర్థిక మద్దతును రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తెలిపారు. ఇదే సందర్భంలో వారికి అవసరమైన నైపుణ్య అభివృద్ధి పథకాలను కూడా అమలు చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో గురువారం ఒక ప్రకటనలో ఈ పథకాలు లబ్ధిదారులకు, ముఖ్యంగా మహిళలకు, యువతకు ప్రత్యక్ష మద్దతును అందిస్తాయన్నారు. వారు ఆర్థికంగా స్వతంత్రంగా మారడానికి వీలు కల్పిస్తుందని ఆయన ధ్రువీకరించారు.

మొత్తంగా రూ.90 కోట్ల వ్యయంతో వివిధ పథకాలను అమలు చేయ నున్నట్లు తెలిపారు. వీటిలో ఆర్థిక సహాయం (2025-26) కింద కొనసాగుతున్న పథకాలు కూడా ఉన్నాయి. ఇందులో భాగంగా, తుర్కా కాషా కమ్యూనిటీ సభ్యులకు టూల్ కిట్లు, జనరేటర్లను పంపిణీ చేయడానికి రూ.15 కోట్లు ఖర్చు చేస్తున్నారు. యూనిట్ ఖర్చు రూ.60,000 వరకు, వారి సాధికారత కోసం ఒకేసారి గ్రాంట్‌గా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అలాగే ఇందిరమ్మ యువతకు ఈస్కూటర్ల పంపిణీకి రూ.40 కోట్లు, యూనిట్ ఖర్చు రూ.1.50 లక్షల వరకు, తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొ రేషన్ నుండి 80 శాతం సబ్సిడీ, యువత సాధికారత కింద 20 శాతం లబ్ధిదారుల వాటాతో. కార్పొరేషన్ ఆర్థిక సహాయ పథకం (2024-25) కోసం కూడా ఖర్చు చేస్తున్నట్లు వివరించారు.

ఇందులో భాగంగా రూ.5 కోట్లను ఫకీర్, దూదేకుల, ఇతర ముస్లిం బలహీన మైనారిటీ వర్గాల సభ్యులకు వారి పునరావాసం కోసం మోపెడ్‌ల పంపిణీకి వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక రూ.25 కోట్లను ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం కింద వారి సాధికారత కోసం మైనారిటీ మహిళలకు (వితంతువు, విడాకులు తీసుకున్నవారు, అనాథలు, నిరాశ్రయులు, ఒంటరి మహిళలు/ వంకర టింకరులు) ఒకేసారి గ్రాంట్‌గా ప్రతి లబ్ధిదారునికి రూ.50 వేల వరకు 100 శాతం సబ్సిడీ చెక్కుల పంపిణీ చేస్తున్నట్లు మంత్రి అజారుద్దీన్ వెల్లడించారు.

## దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో అవినీతి ఆరోపణలపై 8 మంది ఇంజినీర్ల సస్పెన్షన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న దక్షిణ తెలం గాణ విద్యుత్ పంపిణీ సంస్థలో (ఎస్పీడీసీఎల్) అవినీతి అధికారులదే ఇష్టా రాజ్యమైందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంస్థ ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులతో పాటు, క్షేత్రస్థాయి అధికార్లు పలువురిపై సైతం అవినీతి ఆరోపణలు చోటు చేసుకున్నాయి. సంస్థ సిఎండి ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్న పలువురు అధికారులు అవినీతికి చేయి చాస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపధ్యంలోనే దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో తాజాగా పలువురు ఇంజనీర్లపై వేటు పడింది. అవినీతి ఆరోపణలు ఉన్న ఎనిమిది మంది ఇంజనీరింగ్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సస్పెన్షన్‌కు గురైన వారిలో అడిషనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సబ్ ఇంజనీర్లు ఉన్నారు. యాంటీ బ్రైబరీ సెల్‌కు వచ్చిన ఫిర్యాదుల నేపధ్యంలో ఇంటెలిజెన్స్ విభాగం ఇటీవల విచారణ చేపట్టింది. ఈ క్రమంలో అవినీతి అధికారుల విషయంలో కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా కొత్తగా విద్యుత్ కనెక్షన్ల నిమిత్తం దరఖాస్తులు, ప్యానెల్ బోర్డులను ఏర్పాటు చేయడం, విద్యుత్ ట్రాన్స్‌ఫర్మర్లను మంజూరు చేయడం తదితర వాటికి సంబంధించి కొందరు అవినీతికి పాల్పడి, లంచాలు వసూలు చేస్తున్నట్లు ఈ విచారణలో వెల్లడయింది. ఈ అవినీతి సొమ్మును డిజిటల్ పేమెంట్ ద్వారా వసూలు చేసినట్లు ఆధారాలను సేకరించారు. దీనికి సంబంధించిన విచారణ నివేదిక ప్రభుత్వానికి సమర్పించిన నేపధ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన 8 మంది ఇంజనీరింగ్ అధికారులను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది.

## పిఎంశ్రీ స్కూళ్లను పరిశీలించనున్న సివిల్ సర్వెంట్స్

### 25 వరకు కొనసాగనున్న పరిశీలనలు

### 10 జిల్లాల్లో రెండు రోజులపాటు పర్యటించనున్న కేంద్ర అధికారులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పిఎంశ్రీ పాఠశాలలను కేంద్ర సివిల్ సర్వెంట్ అధికారులు పరిశీలించనున్నారు. కేంద్ర అధికారుల పరిశీలనలు ఈ నెల 25 వరకు కొనసాగనున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర స్వయంగా పిఎంశ్రీ స్కూల్స్‌ను పరిశీలించి వాటిలో పిఎంశ్రీ పథకం అమలుతీరును తనను తెలియజేయాలని కేంద్ర విద్యాశాఖను ఆదేశించిన నేపథ్యంలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కొనసాగుతున్న పిఎంశ్రీ స్కూల్స్‌లోనూ కేంద్ర అధికారులు పరిశీలన ప్రారంభించారు. కేంద్ర అధికారులు ఈ నెల 18 నుంచి 25 వరకు రాష్ట్రంలోని పిఎంశ్రీ స్కూల్స్‌లో పరిశీలన చేయనున్నారు. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో కేంద్రం నుంచి వచ్చిన ఉన్నతాధికారి బుధవారం, గురువారం రెండు రోజులు పర్యటించారు.

మొదటిరోజు రెండు స్కూళ్లలో తనిఖీలు నిర్వహించనున్న కేంద్ర అధికారి, అదే రోజు సాయంత్రం జిల్లా కలెక్టర్, డిఇఒతో పాటు పిఎంశ్రీ అమలవుతున్న పాఠశాలల హెడ్మాష్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. మరుసటిరోజు మరో రెండు పిఎంశ్రీ స్కూళ్లలో పరిశీలన చేపట్టనున్నారు. రాష్ట్రంలో 784 ఎంపిశ్రీ పాఠశాలలు కొనసాగుతున్నాయి. వాటిలో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు 520 ఉండగా.. మిగిలిన వివిధ సంక్షేమ శాఖ ద్వారా కొనసాగుతున్న గురుకుల స్కూల్స్‌లో ఉన్నాయి. పిఎంశ్రీ స్కూల్స్‌లో 124 ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. మిగిలినవి హైస్కూల్స్ ఉన్నాయి. పిఎంశ్రీ స్కూల్స్ తనిఖీల ముఖ్యఉద్దేశ్యం పథకం అమలు తీరుతో పాటు.. ఇంకా అదనంగా చేపట్టాల్సినవి ఏమైనా ఉంటే వాటిని కూడా అదనంగా చేర్చాలని కేంద్రం భావిస్తున్న నేపథ్యంలో కేంద్ర అధికారులతో పరిశీలను చేపడుతున్నట్టు తెలుస్తోంది.

## మొదటిరోజు ఎప్‌సెట్‌కు 3,385 దరఖాస్తులు

### ఇంజినీరింగ్‌కు 1,950.. అగ్రికల్చర్, ఫార్మసీకి 1,430

### ఎప్‌సెట్ కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఈఏపి(ఎప్) సెట్-2026కి సంబంధించి మొదటి రోజు 3385 దరఖాస్తులు వచ్చాయి. గురువారం నుంచి ఆన్‌లైన్‌లో ఎప్ సెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైన నేపథ్యంలో మొదటి రోజు సాయంత్రం 5 గంటల వరకు 3,385 దరఖాస్తులు వచ్చినట్టు ఎప్‌సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ కె విజయ్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు 1950 ఇంజనీరింగ్ దరఖాస్తులు రాగా, అగ్రికల్చర్, ఫార్మసీకి 1430 దరఖాస్తులు వచ్చినట్టు తెలి పారు. రెం డింటికి కలిపి మొదటి 5 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 14న నోటిఫికేషన్ జారీ చేయగా.. గురువారం నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించడం ప్రారంభించారు. ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులను ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను స్వీకరించనున్నారు. అపరాధ రుసుం రూ. 10వేలతో పరీక్షకు రెండు రోజుల ముందు వరకు అనగా.. మే 2 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 500 కాగా.. ఇతరులకు రూ. 900గా నిర్ణయించారు. రెండు పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 1000 కాగా, ఇతరులకు రూ. 1800గా నిర్ణయించారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. రూ. 250 అపరాధ రుసుంతో ఏప్రిల్ 10 వరకు, రూ. 500తో ఏప్రిల్ 15 వరకు, రూ. 2500తో ఏప్రిల్ 20 వరకు, రూ. 5000 అపరాధ రుసుంతో ఏప్రిల్ 24 వరకు స్వీకరించనుండగా.. అపరాధ రుసుం రూ. 10వేలతో మే 2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. అగ్రికల్చర్ పరీక్షలను మే 4, 5 తేదిల్లో నిర్వహించనుండగా.. మే 9 నుంచి 11 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు.

## కర్రెగుట్టలో ఆపరేషన్ కగార్‌ను నిలిపి శాంతిని నెలకొల్పాలి

### పౌర హక్కుల సంఘం సీనియర్ నేత ప్రొ. హరగోపాల్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** కర్రెగుట్ట ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ బలగాలు చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతియుత వాతావరణం నెలకొనేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని పౌర హక్కుల సంఘం సీనియర్ నాయకుడు ప్రొఫెసర్ జి.హరగోపాల్ కోరారు. కర్రెగుట్ట తెలంగాణ రాష్ట్రంలోనే ఉందని, గత రెండేళ్ళ నుంచి కర్రెగుట్టలో కేంద్ర బలగాలు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నాయని, శాంతి యుతవాతావరణం కరువైందని హత్యలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది మంది బలగాలు కర్రెగుట్టను చుట్టుముట్టి శవాల గుట్టగా మార్చడం సరైనది కాదని సూచించారు.

గురువారం ఎన్ఎస్ఎస్‌లో తెలంగాణ పౌర హక్కుల సంఘం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు తదితరులతో కలిసి హరగోపాల్ మాట్లాడుతూ గతంలో పౌర హక్కుల సంఘం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కగార్ యుద్ధాన్ని వెంటనే నిలువరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగిందని, ఇందులో భాగంగానే సిఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్క ఆదే విధంగా కోరారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్రంలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్‌గాంధీ ప్రజాస్వామ్యం గురించి పార్లమెంట్‌లో గొంతె త్తుతూ ఉంటే ఇక్కడ కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని, తెలంగాణ సరిహద్దుల్లో మిలటరీ క్యాంప్‌లు ఏర్పాటు చేయడం కర్రెగుట్టలో శవాలగుట్టగా మార్చడం జరుగుతున్నదన్నారు.

ప్రొఫెసర్ లక్ష్మణ్, నారాయణరావు మాట్లాడుతూ కర్రెగుట్టలో 90 ఎన్‌కౌంటర్లు, 1000 మంది మావోయిస్టులు, ఆదివాసీలు హత్యకు గురైనారని ఆందోళన వ్యక్తం చేశారు. నేడు కూడా కర్రెగుట్టలో బూటకపు ఎన్‌కౌంటర్ జరిగిందని, 5 గురు హత్యకు గురైనారని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ప్రభుత్వాలు ఉద్యమకారులను, ఆదివాసీలను హత్య చేస్తున్నాయని ఆరోపించారు. తక్షణమే కగార్ ఆపరేషన్‌ను ఆపాలని, శాంతియుత వాతావరణం నెలకొల్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సురేష్‌కుమార్, చేతన పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జి.హరగోపాల్, చిత్రంలో లక్ష్మణ్, నారాయణరావు తదితరులు

## ఆర్‌టిసి ప్రచారకర్త కిన్నెర మొగులయ్యకు సంస్థ ఎండి వై.నాగిరెడ్డి అభినందన

### గ్లోబల్ హ్యూమన్ పీస్ వర్సిటీ డాక్టరేట్ ప్రదానం



**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** తెలంగాణ ఆర్‌టిసి ప్రచారకర్తగా కొనసాగుతున్న కిన్నెర మొగులయ్యని టిజిఎస్ఆర్‌టిసి విసి అండ్ ఎండి వై.నాగిరెడ్డి అభినందించారు. పద్మశ్రీ దర్శనం మొగులయ్యకు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిన విషయం తెలిసిందే. డాక్టరేట్ అందుకున్నాక మొగలయ్య గురువారం హైదరాబాద్ బస్‌భవన్‌లో ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎండి మొగలయ్యను అభినందించారు. అంతరించిపోతున్న కిన్నెర వాయిద్య కళకు పునరుజ్జీవనం చేయడంలో విశేష ప్రతిభ కనబరిచిన కిన్నెర వాయిద్య కళాకారుడు దర్శనం మొగులయ్య అని ఆయన కొనియాడారు.

## సిఎం ప్రజావాణి ఫీడ్‌బ్యాక్ వల్ల పట్టణాల్లో ఇందిరమ్మ ఇళ్లు

### రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ చిన్నారెడ్డి హర్షం

**హైదరాబాద్ (బేగంపేట), ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజాభవన్ లో నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణిలో భారీఎత్తున నగర, పట్టణ వాసుల నుంచి వస్తున్న ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల ఫీడ్‌బ్యాక్‌తో పేదలకు ఐదు నుంచి పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకం అని సీఎం ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలియజేసారు. హైదరా బాద్, సికిందరాబాద్ ముఖ్యంగా పాతబస్తీసహా పట్టణ ప్రాంతాల నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం పేదప్రజలు సిఎం ప్రజావాణితోపాటు కలెక్టర్ కార్యాల యాల్లో దరఖాస్తు చేసుకుంటున్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తించి ప్రభుత్వమే వారికి ఇళ్లను నిర్మించి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారని చిన్నారెడ్డి అన్నారు. నగర, పట్టణ ప్రాంతాల్లో సొంత నివాసస్థలం ఉండక పోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే పేద ప్రజలకు స్వయంగా డబుల్‌బెడ్ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం పట్ల చిన్నారెడ్డి హర్షం వ్యక్తం చేసారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. ప్రభుత్వాన్ని నిర్ణయంతో రాష్ట్రంలోని పేదప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల రూపంలో నిలవ నీడకు మార్గం సుగమం కాబోతుందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలన అంటే పేద ప్రజలకు కొండంత అండ అని ఆయన అన్నారు.



ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణకు వినతిపత్రాన్ని ఇస్తున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో నీల వెంకటేష్, రాజేందర్, అనంతయ్య తదితరులు

## వచ్చే బడ్జెట్‌లో బిసిలకు రూ. 25 వేల కోట్లు కేటాయించాలి

### చీఫ్ సెక్రటరీకి 14 బిసి సంఘాల విజ్ఞప్తి

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో బిసిల సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 25 వేల కోట్లు కేటాయించాలని 14 బిసి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు గురువారం 14 సంఘాల ప్రతినిధులు సచివాలయంలో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణతో సమావేశమై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో బిసిలకు ప్రతి బడ్జెట్‌లో 25 వేల కోట్లు కేటాయిస్తామని ప్రకటించిందని, కాని ఇంతవరకు 10 వేల కోట్లకు మించి కేటాయించలేదని, ఖర్చు కూడా పెట్టడం లేదన్నారు. గత రెండు సంవత్సరాలుగా బిసిల సంక్షేమం కుంటుపడిందని, కొత్త పథకాలు లేవని, ఫీజులు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించడం లేదని, బిసి కార్పోరేషన్‌కు నిధులు కేటాయించడం లేదని, ఒక్క హాస్టల్‌కు బిల్డింగ్‌గాని, గురుకుల పాఠశాలల బిల్లులు గాని కట్టలేదని, చివరికి ఒక్క పైసా ఖర్చులేని స్థానిక సంస్థల రిజర్వేషన్‌లు 42 శాతానికి పెంచుతామని వాగ్ధానం చేసి పెంచకుండా బిసి వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నదని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో బిసి నాయకులు నీల వెంకటేష్, సి.రాజేందర్, జిల్లపల్లి అంజీ, అనంతయ్య, పగిళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## 20 నుండి కూరగాయల సాగుపై సదస్సు

### ఉద్యాన వర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ రాజిరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యానవర్సిటీ ఆధ్వర్యంలో కూరగాయల సాగుపై అఖిలభారత సమన్వయ పరిశోధన పథకం సమావేశాలు నిర్వహించనున్నట్టు ఆ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి తెలిపారు. ఈ సెమినార్ ఈనెల 20 నుంచి 22 వరకు మూడ్రోజులపాటు జరుగుతుందన్నారు. హైదరాబాద్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సెమినార్ సందర్భంగా క్షేత్రస్థాయిలో పరీక్షించిన దేశీయ, హైబ్రిడ్ రకాలు, విత్తన ఉత్పత్తిలో మేలైన పద్ధతులు, జనక (జన్యు) రకాల సేకరణ, పంటల ఆధునిక సాగు, చీడపీడలు, అతివృష్టి, అనావృష్టి తదితర వాటిపై చర్చించనున్నట్టు తెలిపారు. 22న ఏర్పాటు చేసిన శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమంలో రైతుల ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానాలు చెబుతారని వివరించారు. ఈ సెమినార్‌లో దేశ వ్యాప్తంగా 300 మందికిపైగా శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొంటారని చెప్పారు. ప్రముఖ విత్తన సంస్థ నిపుణులు, భారత ప్రభుత్వ విత్తన ప్రతినిధులు కూడా హాజరుకానున్నట్టు వివరించారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, వారణాసి, బెంగూళూరు, ఢిల్లీలోని భారతీయ పరిశోధనల సంస్థల నుంచి పలువురు శాస్త్రవేత్తలు, నిపుణులు హాజరవుతారని పేర్కొన్నారు.

# పళ్ల తోటలకు 40 శాతం రాయితీ

### పాలీ, గ్రీన్‌హౌస్‌లకు 50 శాతం సబ్సిడీ

### పట్టుపురుగుల పెంపకానికి రూ.2.90 లక్షలు

### ఉద్యాన పంటలకు రాష్ట్ర సర్కార్ ప్రోత్సాహం

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉద్యాన పంటలను విస్తరించప చేసేందుకు ప్రోత్సాహం కింద రాయితీలను ఆ శాఖ అధికారులు కల్పిస్తున్నారు. ప్రధానంగా సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకంలో భాగంగా పండ్లతో పాటు, పూల తోటల పెంపకానికి ప్రోత్సాహకాల కింద సబ్సిడీ ఇస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. కొత్తగా వేసే పండ్ల తోటలు బొప్పాయి, అరటి, అల్లనేరడు, సీతాఫలం, మామిడి, నిమ్మ, జామ, బత్తాయి, పూల సాగుకు 40 శాతం మేర రాయితీ వర్తింపజేయనున్నారు. అదేవిధంగా వంగ, టమాట, పచ్చిమిర్చి, కూరగాయల నారును ఈ పథకం కింద రైతులకు సరఫరా చేయనున్నారు. మామిడి, బత్తాయికి సంబంధించి పాత తోటలు పునర్జీవం కింద 40 శాతం రాయితీ ఇస్తారు. పాలీ, గ్రీన్‌హౌస నిర్మాణం, మల్చింగ్ పద్ధతిలో సాగుకు 50శాతం రాయితీ ఇవ్వనుండగా, సమగ్ర తెగులు నివారణకు, సమీకృత పోషణ నిర్వహణకు 50శాతం రాయితీ ఇవ్వనున్నారు. ఉద్యాన పంటల రైతులకు ట్రాక్టరు, పవర్‌టిల్లర్, పవర్ వీడర్, రష్ కట్టర్, స్ప్రెయర్లను కేటాయిస్తారు. ఇక వర్మికంపోస్టు యూనిట్లకు 50శాతం రాయితీ ఇవ్వనున్నారు. పండ్ల తోటలతో పాటు, కూరగాయలకు, మిరప, ఆయిల్‌పామ్ సాగుకు బిందు, తుంపర సేద్యాన్ని రాయితీపై పరికరాలు అందించనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీ, బీసీ, సన్నచిన్నకారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం రాయితీ ఇవ్వనున్నారు. శాశ్వత పందిరి పద్ధతిలో తీగజాతి కూరగాయల సాగును ప్రోత్సహించనున్నారు. వీటికి కూడా 50శాతం రాయితీ ఇవ్వనున్నారు. అలాగే ఎస్‌బీఎం కింద వెదురు మొక్క పెంపకానికి ప్రోత్సాహకం అందించనున్నారు. ఎకరానికి 50శాతం రాయితీపై రూ. 14,400లు రైతులకు అందజేస్తారు. కాగా మల్బరీ సాగు ద్వారా పట్టు పురుగులు ఉత్పత్తి చేసే రైతులకు పట్టుగూళ్లకు కిలోకు రూ.75ను ప్రోత్సాహకంగా అందించనున్నారు. ఎకరానికి రూ.60వేల నుంచి రూ.78 వేలు, అదేవిధంగా రూ.2.25లక్షల నుంచి రూ.2.90 లక్షలు రేరింగ్ షెడ్ నిర్మాణంతో పాటు క్రిమిసంహారక మందుల సరఫరా, ఉద్యాన యాంత్రీకరణ పరికరాలకు 50శాతం రాయితీ ఇవ్వనున్నారు.



## 42 మంది ఎమ్మెల్యేలకు పాట్నా హైకోర్టు నోటీసులు

**పాట్నా, ఫిబ్రవరి 19:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రకటించి చాలా కాలం అయినా ప్రతిపక్షాలు ఎన్నికల మోసంపై పదే పదే ఆరోపణలు చేస్తున్నాయి. ప్రశాంత్ కిషోర్‌కు చెందిన జన్‌సురాజ్‌పార్టీ సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించినా కోర్టు ఆయనను తీవ్రంగా మందలించింది. ఇదిలావుంటే, ఎన్నికల అఫిడవిట్‌లో మోసం, తప్పుడు సమాచారం అందించారంటూ మరో కేసు ఇప్పుడు పాట్నా హైకోర్టుకు చేరుకుంది. బీహార్ ఎన్నికల్లో ఎన్నికల అఫిడవిట్లలో దొంగఓట్లు, తప్పుడు సమాచారం కేసు ఇప్పుడు పాట్నా హైకోర్టులో విచారణకు వచ్చింది. దీంతో అసెంబ్లీ స్పీకర్, అనేక మంది మంత్రులతో సహా 42 మంది ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వారి స్పందనలు తెలియజేయాలని కోర్టు కోరింది. ఓడిపోయిన అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్ల ఆధారంగా ఈ చర్య చేపట్టింది. విదీతి, మహా కూటమి రెండింటిపై ఓటు కొనుగోలు ఆరోపణలకు దారితీసింది. ఇది బీహార్‌లో రాజకీయ గందరగోళాన్ని రేకెత్తించింది. పాట్నా హైకోర్టు 42 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. వారిపై ఓట్ల దొంగతనం, ఎన్నికల అఫిడవిట్లలో తప్పుడు సమాచారం అందించడం వంటి ఆరోపణలు ఉన్నాయి. ఓడిపోయిన పార్టీ, ప్రతిపక్ష అభ్యర్థులు గెలిచిన ఎమ్మెల్యేలపై పాట్నా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. గెలిచిన ఎమ్మెల్యేలందరికీ పాట్నా హైకోర్టు నోటీసులు జారీ చేసి వారి స్పందనలు కోరుతోంది. ఈ కేసు ప్రస్తుతం పాట్నా హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో అసెంబ్లీ స్పీకర్ ప్రేమ్ కుమార్, ఇంధన మంత్రి విజేంద్ర యాదవ్, మాజీ మంత్రి జీవేష్ మిశ్రా, ఎమ్మెల్యే చేతన్ ఆనంద్, గోహ్‌కు చెందిన ఆర్జేడీ ఎమ్మెల్యే అమరేంద్ర ప్రసాద్, ఇతర అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్నారు. ఎన్డీఏ ఒక్కొక్కరికి రూ.పదివేలు ఇచ్చి ఓట్లు కొనుగోలు చేసిందని, మహా కూటమి మై బెహన్ యోజన కింద రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి ఓట్లు కొనుగోలు చేసిందని జన్‌సురాజ్ పార్టీ ఆరోపణలు చేసింది. ప్రస్తుతం, కోర్టు అందరు ఎమ్మెల్యేలను వారి సమాధానాలను దాఖలు చేయాలని కోరింది.




## టాటా అంబేద్కర్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ప్రణాళికలు

### 64 మంది అభ్యర్థులకు జాబ్ ఆఫర్‌లెటర్ల అందజేత

### వైస్‌ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** ప్రఖ్యాతిగాంచిన విద్యాసంస్థలకు ధీటుగా అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం విద్యార్థులు పోటీపడుతున్నారని, రానున్న రోజుల్లో టాటా అంబేద్కర్ శిక్షణ కేంద్రం" ఏర్పాటుకు ప్రణాళికలు చేస్తున్నామని అంబేద్కర్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి తెలిపారు. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా టి.సి.ఎస్. అయాన్ భాగస్వామ్య కంపెనీల ద్వారా ఎంపికైన 64 మంది అభ్యర్థులకు జాబ్ ఆఫర్ లెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ప్రొ. ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. దేశంలోని ప్రముఖ విద్యా సంస్థలతో ధీటుగా డా. బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పోటీ పడుతోందన్నారు. అభ్యాసకులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలను అందించడానికి నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. ఉద్యోగ అవకాశాలను పెంపొందించడానికి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్)తో కలిసి ఓ ప్రత్యేకమైన శిక్షణా కేంద్రాన్ని ఖిటాటా అంబేద్కర్ఖి పేరిట ఏర్పాటు చేయాలనే ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. మానవ వనరుల అభివృద్ధితో సమాజానికి, దేశ నిర్మాణానికి సేవ చేయడానికి టాటా సంస్థ ముందుంటుందని పేర్కొన్నారు. విద్యార్థులను అధునాతన సాంకేతిక నైపుణ్యాలు, వృత్తిపరమైన సామర్థ్యాలతో సన్నద్ధం చేయడంపై ప్రతిపాదిత కేంద్రం దృష్టి సారిస్తుందని వెల్లడించారు. టిసిఎస్ అయాన్ దక్షి ణ భారత దేశ ఇంచార్జ్ కృష్ణ కిశోరే దున్నిగాల మాట్లాడుతూ, ప్రతి వ్యక్తికి మొదటి ఉద్యోగం చాలా కీలకమన్నారు. విద్యార్థులు తమ కెరీర్ ను అభిరుచికి అనుగుణంగా మార్చుకోవాలని సూచించారు.



## శివాజీ ధర్మపాలన, దేశభక్తి భావనలను ప్రతి భారతీయుడు అనుసరించాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** హిందూ హృదయ సామ్రాట్, మొఘలాయిల అణచివేతకు ఎదురొడ్డి హైందవ సామ్రాజ్య స్థాపననే ధ్యేయంగా అఖండ ధైర్యంతో పోరాడిన ధీరుడు, భారతమాత వీరపుత్రుడు, సాహసానికి చిరకాల స్ఫూర్తిగా నిలిచిన మహావీరుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు శివాజీ మహారాజ్‌కి ఘనంగా నివాళులర్పించారు. ఈ వేడుకల్లో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్, బిజెపి తెలంగాణ పదాధికారులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఎన్.రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, గొప్ప యోధుడు అన్నారు. శివాజీ మహరాజ్ నుంచి స్ఫూర్తి పొందిన యువత ఈరోజు యావత్ దేశవ్యాప్తంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తుందన్నారు.

**బిజెపిలో చేరిన కరీంనగర్ కార్పొరేటర్**

రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది మేధావులు బిజెపిలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారని బిజెపి అధ్యక్షులు రాంచందర్‌రావు, కేంద్రమంత్రి బండి సంజయ్‌లు అన్నారు. గురువారం రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో కరీంనగర్ 10వ డివిజన్ కార్పొరేటర్ సొగాని కొమరయ్య బిజెపిలో చేరారు. కాషాయ కండువా కప్పి రాంచందర్ రావు పార్టీలోకి ఆహ్వానించారు.

# క్రిటికల్ మినరల్స్‌పై యావత్ ప్రపంచం దృష్టి

### మైనింగ్ రంగంలో అపార అవకాశాలు

### సద్వినియోగం చేసుకోవాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 19. ప్రభాతవార్త:** భారతదేశంతో పాటుగా యావత్ ప్రపంచం క్రిటికల్ మినరల్స్ పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం ఫిక్కి ఆధ్వర్యంలో రెండో ఎడిషన్ క్రిటికల్ మినరల్ సదస్సును కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలు, క్లీన్ ఎనర్జీ లక్ష్యాలను చేరుకునేందుకు క్రిటికల్ మినరల్స్ చాలా కీలకం అన్నారు. ఈ సదస్సు భారతదేశంలో క్రిటికల్ మినరల్ రంగంలో భారతదేశ భవిష్యత్తుకు సంబంధించి చాలా కీలకంగా ఉందన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎనర్జీ ట్రాన్సిషన్, గ్రీన్ డెవలప్‌మెంట్, సాంకేతిక పురోగతి తదితర అంశాలకు క్రిటికల్ మినరల్స్ అత్యంత కీలకంగా ఉందని, ప్యానల్స్, ఎలక్ట్రికల్ వాహనాలు, డిఫెన్స్, ఎయిరోస్పేస్, మెడికల్ ఇమాజింగ్, న్యూక్లియర్స్ వంటి వివిధ రంగాల్లో లిథియం, కోబాల్ట్, కాపర్ వంటి క్రిటికల్ మినరల్స చాలా అవసరం అన్నారు. భారత్ మాత్రమే కాదు, మొత్తం ప్రపంచ భవిష్యత్తు ఈ మినరల్స్‌పె ఆధారపడి ఉంది. భారత్ తన అవసరాల 95శాతం క్రిటికల్ మినరల్స్‌ను దిగుమతి చేసుకుంటుందని, అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా మినరల్ వాల్యూచైన్ కొన్ని దేశాల్లోనే కేంద్రీకృతమై ఉందని, కొన్ని దేశాలు ఉద్దేశపూర్వకంగా వీటిని పూర్తిగా తమ ఆధీనంలో ఉంచుకోవాలని ప్రయత్నిస్తున్నాయన్నారు. దీంతో క్రిటికల్ మినరల్స్ అనేది ఒక కీలకమైన జియోపొలిటికల్ అంశంగా మారిందన్నారు

# ఎఐలో భద్రతకే ప్రభుత్వ ప్రాధాన్యం

### ఆవిష్కరణలకు అది అడ్డంకి కాదు

### ప్రత్యేక ఎఐ సిటీకి రూపకల్పన: మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో భద్రతను తెలంగాణ ప్రభుత్వం ఆవిష్కరణలకు అడ్డంకిగా కాకుండా, 21వ శతాబ్దపు ఏరో డైనమిక్స్‌గా భావిస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. డిజిటల్ గవర్నెన్స్ అడ్వయిజరీ, ఆల్ బ్రైట్ స్టోన్‌బ్రిడ్జ్ గ్రూప్ లాంటి గ్లోబల్ స్ట్రాటెజిక్ అడ్వయిజరీ సంస్థల ప్రతినిధులు, ఏఐ సేఫ్టీ కనెక్ట్ సంస్థల నిపుణులను ఉద్దేశించి ఆయన కీలకోపన్యాసం చేశారు. నియంత్రణలు లేకుండా సాధించే వేగవంతమైన వృద్ధి త్రైమాసిక నివేదికల్లో అద్భుతంగా కనిపించవచ్చుని, కానీ సరైన భద్రతా చర్యలు లేకుంటే జరిగే ఒక్క చిన్న పొరపాటు దశాబ్దాలుగా సంపాదించుకున్న ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని మంత్రి హెచ్చరించారు. ప్రముఖ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ మాటలను మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా ఉటంకించారు. "ఖ్యాతిని గడించడానికి 20 ఏళ్లు పడితే, దానిని కోల్పోవడానికి కేవలం 5 నిమిషాలు చాలు" అని బఫెట్ చెప్పినట్లుగానే నేడు ఏఐ విషయంలో మనం అలాంటి కీలక కూడలిలోనే ఉన్నామని మంత్రి వ్యాఖ్యానించారు. విమానయాన రంగం ప్రారంభ దశలో భద్రతపై ఆందోళనలు ఉన్నప్పటికీ సీటు బెల్టులు, రాడార్ వంటి కఠినమైన భద్రతా ప్రమాణాలు ఆ రంగాన్ని ఆపలేదని, మరింత ఎత్తుకు ఎదగడానికి అవి అవకాశాన్ని కల్పించాయని ఆయన గుర్తుచేశారు. ఏఐకి కూడా ఇదే సూత్రం వర్తిస్తుందన్నారు.

షెన్‌జెన్‌లా మనదీ చారిత్రక ఘట్టమేమంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ప్రస్తుతం 80 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న హైదరాబాద్ వృద్ధిలో సగానికి పైగా మన టెక్ నిపుణుల కృషితోనే సాధ్యమైందన్నారు. 1980లలో చిన్న మత్స్యకార గ్రామంగా ఉన్న చైనాలోని షెన్‌జెన్ ఆ సమయంలో తయారీ రంగంపై దృష్టి సారించి నేడు 500 బిలియన్ డాలర్ల దిగ్గజ నగరంగా ఎదిగిందని ఆయన ఉదహరించారు.

తెలంగాణ సైతం ఇప్పుడు అటువంటి షెన్‌జెన్ ఘట్టంఖిలోనే ఉందని, కాకపోతే మన ఇంజిన్ తయారీ రంగం కాదని, టెక్నాలజీ అని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అగ్రగామి ఏఐ హబ్‌గా ఎదగడం ద్వారా 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించడమే తమ లక్ష ్యమని ఉద్ఘాటించారు. సుస్థిరతను ప్రధాన వృద్ధి వ్యూహంగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వం ఏఐ టెక్నాలజీని క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్తుందని, కేవలం మౌలిక సదుపాయాలకే పరిమితం కాకుండా, 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సుస్థిరమైన జీవనానికి అనుగుణంగా ఏఐ సిటీ, దేశంలోనే తొలి నెట్‌జీరో నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీఖిలను తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. భాగస్వామ్య బాధ్యతలో భాగంగా దేశంలోనే మొట్టమొదటి సార్వభౌమ ఏఐ హబ్ ఐకామ్‌ను ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్ పేరిట ప్రపంచంలోనే మొట్టమొదటి సావరిన్ ఓపెన్ డేటా పైప్‌లైన్‌ను నిర్మించామన్నారు. దీని ద్వారా 28 ప్రభుత్వ శాఖలకు చెందిన 1,084 డేటాసెట్ల (500 జీబీ)ను ప్రజోపయోగంగా మార్చామని వెల్లడించారు. ప్రస్తుతం 360 ఏఐ మోడల్స్ ఈ డేటాను వినియోగించుకుంటుండగా, 950 మందికి పైగా నిపుణులు, అంకుర సంస్థలు ఈ ప్లాట్‌ఫామ్‌పై చురుకుగా పనిచేస్తున్నాయన్నారు.



# హామీల మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలి

### ముఖ్యమంత్రికి రాసిన బహిరంగ లేఖలో కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి19:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు సగం కాలం పూర్తవుతున్నా,ఇప్పటికీ హామీల్లో 95 శాతం పెండింగ్‌లోనే ఉన్నాయని ఆరోపించారు. ఈ సారైన బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని లేనిపక్షంలో తెలంగాణ సమాజం ఇంకా ఓపికపట్టే ప్రసక్తే లేదని గుర్తుచేశారు. ఆరు గ్యారెంటీల పేర్లు చెప్పి అధికారంలోకి వచ్చి వాటి అమలను పక్కన పెట్టారని, ఇప్పటి వరకు ప్రవేశపెట్టిన రెండు బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలో హామీ ఇచ్చిన మహిళలు, వృద్ధులు, విద్యార్థి, యువత, రైతన్నల కోసం భారీగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిక్లరేషన్ల పేరుతో హామీలు ఇచ్చిన మేరకు బీసీ, ఎస్సీ,ఎస్టీ,మైనార్టీలకు ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాలి. ఆయా వర్గాలకు రెండు సంవత్సరాలుగా ఎగ్గొట్టిన హామీలను, కాంగ్రెస్ ఇస్తామని చెప్పిన నిధుల బకాయిలకు ఈ బడ్జెట్లో కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకువస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దాని నిలబెట్టుకోవాలన్నారు. ఈసారి కూడా హామీల అమలకు నిధులు కేటాయించకుంటే ప్రజల తరపున ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొస్తామని, మోసకారి కాంగ్రెస్‌ను ప్రజలపక్షాన నిలదీస్తామని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారెంటీలు,420 హామీల పేరిట మభ్యపెట్టి రెండేళ్లు గడిచినా ఇప్పటికీ అమలుకు నోచుకోని నేపథ్యంలో, కనీసం ఈ సారి బడ్జెట్ లోనైనా అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

వృద్ధులు, వితంతువులకు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్‌ను నాలుగు వేలకు పెంచడానికి ఎన్ని నిధులు కావాలో లెక్కగట్టి ప్రతి పైసాను ఈ సారి బడ్జెట్‌లో కేటాయించాల్సిన బాధ్యత మీపై ఉంది. అలాగే రాష్ట్ర జనాభాలో సగభాగంగా ఉన్న ప్రతి ఒక్క మహిళకు మహాలక్షి ్మ కింద నెలకు రూ.2500లు అందజేస్తామని హామీ ఇచ్చి 25 నెలలు గడిచినా ఇప్పటికీ ఒక్క లబ్ధిదారుకు ఒక్క పైసా దక్కలేదు. ఈ గ్యారెంటీ అమలుకు అడుగులు పడకపోతే ఆడబిడ్డలు ఊరుకునే ప్రసక్తే లేదనే విషయాన్ని గుర్తుచేస్తునట్లు పేర్కొన్నారు.ఇప్పటికే మూడుసార్లు పెండింగ్‌లో పెట్టిన రైతుబంధు పాత బకాయిలను కూడా చెల్లించాలన్న రైతుల డిమాండ్‌ను మీ ముందు ఉంచుతున్నాను.

అలాగే కౌలు రైతులకు, రైతు కూలీలకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం వారి ఖాతాల్లో నిధులు జమ చేయాలని కోరుతున్నానని అన్నారు.కేవలం రైతులు, మహిళలకే కాదు, నిరుద్యోగులకిచ్చిన ప్రతి హామీ కూడా రెండేళ్ల నుంచి పెండింగ్ లోనే ఉంది. తొలి ఏడాదే రెండులక్షల ఉద్యోగాల భర్తీతోపాటు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలుకు కూడా బడ్జెట్ లో కేటాయింపులు చేయాలని తెలంగాణ యువతీ యువకుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానని కెటిఆర్ అన్నారు.

## మేలో కొత్త పార్టీ పెడతా, సిద్దిపేట నుంచి పోటీ చేస్తా: కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి19:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీ ప్రకటనకు ముహూర్తం ఖరారు చేశారు. మే నెల మొదటి వారంలో మంచి రోజు చూసుకుని పార్టీని అధికారికంగా ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు. పార్టీ పేరులో తెలంగాణ అనే పదం తప్పనిసరిగా ఉంటుందని కవిత స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తన మొదటి ఛాయిస్ సిద్దిపేట అని, రెండో ఛాయిస్ బోధన్ అని పేర్కొన్నారు.

భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ ఉండదని, ప్రధాన ప్రతిపక్షంగా తామే అవుతామని కవిత ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తామే వస్తామని, ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తోందని, కొత్త తరహా రాజకీయం చేయడం లేదని విమర్శించారు.



## ఆదర్శ పాఠశాల టీచర్లకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలి

### టిజిటిలకు 40 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి

### అడిషనల్ డైరెక్టర్‌కు తపస్ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది సమస్యలను పరిష్కరిం చాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంటయ్య, తెలంగాణ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ సంఘం (టిపియుఎస్) రాష్ట్ర కన్వీనరన జె రామకృష్ణ, కో కన్వీనర్ బి రమేష్ గురువారం ఆదర్శ పాఠశాలల అడిషనల్ డైరక్టర్‌ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, సిబ్బందికి వేతనాలను 010 అకౌంట్ కింద ఇవ్వాలని, టిజిటిలకు 43 ఫిట్‌మెంట్ ఇచ్చేలా చూడాలని కోరారు. డీఏ ఏరియర్స్ గురించి, ప్రిన్సిపాల్స్ అకౌంట్‌లో ఉన్న సీపీఎస్ అమోంట్ గురించి వివరించామన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన టీచర్స్‌కి రావాలసిన అమోంట్ గురించి చర్చించి వారి నుంచి తగు చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు. తాము అడిషనల్ డైరక్టర్ దృష్టికి తీసుకెళ్లిన సమస్యలు త్వరలో పరిష్కారం అవుతాయని అడిషనల్ డైరక్టర్ చెప్పారని తపస్ నేతలు తెలిపారు.

# 'సర్'పై 4 జిల్లాల ఎన్నికల అధికారులకు శిక్షణ

### జాబితాల నుంచి అనర్హుల పేర్లు తొలగించాలి

### రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 19:** రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని సీఈఓ కార్యాలయంలో నాలుగు జిల్లాలకు చెందిన ఎన్నికల అధికారులకు (ఈఆర్వోలు) ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మెద్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన మొత్తం 50 మంది ఈఆర్వోలు ఈ శిక్షణలో పాల్గొన్నారు.ఈ శిక్షణలో ఓటరు జాబితాల తయారీ, సవరణ, నిర్వహణ విధానాలపై సమగ్ర అవగాహన కల్పించడంతో పాటు, త్వరలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై వివరంగా చర్చించారు. ఎన్నికల జాబితాల్లో ఖచ్చితత్వం, పారదర్శకత, సమగ్రతను పాటించేందుకు ఫీల్డ్ స్థాయి అధికారుల సామర్థ్యాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష ్యంగా ఉందని అధికారులు తెలిపారు. క్లెయిమ్స్, ఆబ్జెక్షన్ల పరిశీలన, చట్టపరమైన నిబంధనలు, సమయపట్టికల అమలు, సాంకేతికత వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ సంద ర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల జాబితాల స్వచ్ఛతను కాపాడడం ఈఆర్వోల కీలక బాధ్యత అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాల్లో చేర్చడంతో పాటు, అనర్హుల పేర్లను చట్ట బద్ధంగా తొలగించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఎస్ఐఆర్ అమలులో ఎదుర య్యే సవాళ్లు, పరిష్కారాలపై చర్చించగా, అధికా రుల సందేహాలను నివృత్తి చేసే ఇంటరాక్టివ్ సెష న్లు కూడా నిర్వహించారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, పారదర్శక ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమం

## వ్యవసాయ వర్సిటీ ప్రశ్నపత్రాల లీక్ కేసు

# చేతులు మారిన లక్షలు?

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యా లయం పరిధిలోని కళాశాలల్లో కొంతకాలంగా సాగుతున్న పేపర్ లీకేజీ వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇన్ సర్వీస్ విద్యార్థులకు ప్రశ్నాపత్రాలను లీక్ చేస్తున్న ఉదంతంపై సీఐడీ అధికారులు చేపట్టిన దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగు చూస్తు న్నాయి. కేవలం ఈ యేడాది మాత్రమే కాకుండా, అయిదేళ్లుగా ఈ అక్రమ దందా కొనసాగు తున్నట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా వరంగల్, జగిత్యాల, ఆదిలాబాద్, రాజేంద్రనగర్, సిరిసిల్ల, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలల్లోని విద్యార్థులకు ఈ లీకైన పేపర్లు అందినట్లు సీఐడీ ప్రాథమికంగా నిర్ధారించింది.

ఈ అక్రమ మార్గం ద్వారా లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు అధికారులు భావిస్తున్నారు. పరీక్షలకు ముందే ప్రశ్నలు అందుతుండటంతో, ఇన్ సర్వీస్ కోటాలో ఉన్న వారు భారీ మొత్తాలను వెచ్చించి వీటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి థర్డ్ ఇయర్ ప్రశ్నాపత్రాలు బయటకు రావడం కలకలం రేపుతోంది.


ఈ వ్యవహారంలో వరంగల్ వ్యవసాయ వర్సిటీకి చెందిన జూనియర్ అసిస్టెంట్ కార్తీక్ కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో తేలింది. విశ్వవిద్యా లయం నుండి ప్రశ్నాపత్రాలను సేకరించి, ఇన్ సర్వీస్ విద్యార్థులకు చేరవేస్తున్నట్లు సమాచారం. ఈ నెట్‌వర్క్‌లో కేవలం కార్తీక్ మాత్రమే ఉన్నాడా లేక ఉన్నతాధికారుల హస్తం కూడా ఉందా అనే కోణంలో సీఐడీ విచారణ జరుపుతోంది.

## బాలికపై సామూహిక అత్యాచారం

### ఇద్దరు రిమాండ్.. పరారీలో మరో నిందితుడు

**హైదరాబాద్ (నార్సింగి), ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** మాయమాటలు చెప్పి, బాలికకు మత్తుపదార్థాలు ఇచ్చి, సామూహిక అత్యాచారం చేసిన ఘటన నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గండిపేట మండలం పుప్పాలగూడలోని తన అమ్మమ్మ ఇంట్లో ఉండి చదువుకుంటున్న బాలిక (16) ఈ నెల 7న చార్మినార్‌కు షాపింగ్ కోసం వెళ్లింది. అక్కడ ఓ అబ్బాయి(16)తో పరిచయం ఏర్పడింది. ఇరువురూ తమ మొబైల్ నెంబర్లు చెప్పుకొని ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 16న తన ఇంట్లో చెప్పకుండా మళ్లీ చార్మినార్‌కు వెళ్లి ఆ బాలుడితో కలిసి తిరిగింది. రాత్రివేళ ఆ బాలుడు తన ఇద్దరు స్నేహితులకు బాలిక ఉన్న విషయం చెప్పగా ముగ్గురు కలిసి ఆ బాలికను ఆటోలో చెంగిచెర్ల డబుల్ బెడ్ ఇళ్ల వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ఆ బాలికను బెదరించి మత్తు పదార్థాలు ఇచ్చి ముగ్గురూ కలిసి సామూహిక అత్యాచారం చేశారు. 16న బాలిక ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికి నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని బాలిక ఆచూకీ కోసం ప్రయత్నం మొదలుపెట్టారు. విశ్వసనీయంగా లభించిన సమాచారం మేరకు బాలిక ఉంటున్న చెంగిచెర్ల ప్రాంతానికి చేరుకొని బాధిత బాలికను కాపాడారు. వైద్య చికిత్స నిమిత్తం ఆమెను ఆస్పత్రికి తరలించారు. బాలుడితోపాటు ఇమ్రాన్‌ను అరెస్టు చేసి, న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. రౌడీషీటర్ అయిన ఇమ్రాన్‌పై వివిధ పోలీసు స్టేషన్లలో 8 కేసులు ఉన్నాయి. మరో బాలుడు పరారీలో ఉన్నాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు.

# ఇడి పిటిషన్ విచారణకు తిరస్కరించిన ఢిల్లీ హైకోర్టు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో ఈడీ దాఖలు చేసిన సవాల "పిటిషన్‌పై విచారణను ఢిల్లీ హైకోర్టు వాయిదా వేసింది. దిగువకోర్టు ఈడీ దాఖలుచేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. దీనితో ఈడీ అధికారులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయిం చారు. సింగిల్‌బెంచ్ జస్టిస్ స్వర్ణకాంతశర్మ ఈ పిటిషన్ విచారణను తిరస్కరించారు. ఈ కేసును మరింతగా సమ గ్రంగా విచారణచేయాల్సి ఉందని, ఈడి రివిజన్ పిటిషన్ వాదనలు కూడా ఉన్నందున ఈ పిటిషన్ విచారణకు తిరస్క రించింది. కాగా ఈకేసులో వాయిదానున మార్చి 9వ తేదీకి వాయిదావేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఢిల్లీఓని రౌస్ అవన్యుకోర్టులో దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును అప్పటి జడ్జి డిస్మిస్‌చేసారు. ఈడీ ఆరోపించిన అభియోగాలు పరిగణనలోనికి తీసుకోలేమని న్యాయమూర్తి అప్పట్లోపేర్కొన్నారు. అయితే ఈ పిటిషన్‌ను మరింత సమగ్ర విచారించాల్సి ఉందని, ఇందుకు సంబంధించి రాహుల్, సోనియాగాంధీలు వివరణలు ఇవ్వాల్సి ఉంటుందని ఢిల్లీ హైకోర్టు అభిప్రాయపడింది.

కేవలం 50 లక్షలు మాత్రమే యంగ్ ఇండియా అనే కంపెనీ ద్వారా చెల్లించి మొత్తం స్వాధీనంచేసుకున్నారని, యంగ్ ఇండియాలో సోనియా రాహుల్‌లు మెజార్టీ వాటాదారులని ఈడీ వాదించింది. బిజెపి నాయకుడు సుబ్రహ్మణ్యస్వామి దిగువకోర్టులో ఒక ప్రైవేటు ఫిర్యాదును దాఖలుచేసారు.

## అమరావతిలో క్యాట్ శాశ్వత బెంచ్ రాష్ట్ర ప్రభుత్వ చర్యలు

విజయవాడ, ఫిబ్రవరి 18 ప్రభాత వార్త ప్రతినిధి: అమరావతిలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ సర్క్యూటివ్ శాశ్వత బెంచ్ ఏర్పాటుకు భూ కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని ఆ సంస్థ తెలిపింది. విజవయాడలోని క్యాట్ బెంచ్ ఏర్పాటు చేసిన ఏడాది కాలంలో 1420 కేసులు పరిష్కరించినట్లు పేర్కొంది. 50 రోజుల సిట్టంగ్‌లో కేసుల పరిష్కారం 146 శాతంగా నమోదైనట్లు వివరించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ నవీన్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

అమరావతిలో శాశ్వత బెంచ్ ఏర్పాటు చేస్తే కేసుల పరిష్కారం మరింత సులభతరం అవుతుంది. ఏపీ పరిధిలోని కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఐఎఎస్, ఐపీఎస్ అధికారులు, ప్రభుత్వ పింఛన్‌దారులు తమ సేవలకు సంబంధించిన వివాదాల్లో విజయవాడ బెంచ్ ద్వారా సత్వర న్యాయం పొందుతున్నారు. ప్రతి నెల మూడో వారంలో ఏడు రోజుల పాటు ఇక్కడ విచారణ జరుగుతోంది.

హైదరాబాద్ బెంచ్ నుంచి సభ్యులు, సిబ్బంది వస్తున్నారు అని క్యాట్ ప్రస్తావించింది. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ మెంబర్లు వీఎస్‌కే కౌముది, ఆన్‌లైన్ ద్వారా శాలిని మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 2027కి రాజధానిలోని ప్రధాన రహదారులు పూర్తి

## అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో వెల్లడించిన మంత్రి నారాయణ



విజయవాడ, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: రాజధానిలోని ప్రధాన రహదారులు (ట్రంక్ రోడ్లు) ఏప్రిల్ 2027కి పూర్తి చేసేందుకు ప్రణాళిక చేశామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. మొదటి దశలో 67.6 కిలోమీటర్ల నిర్మాణం, గుంటూరు జిల్లాలో 14, పల్నాడులో 3, కృష్ణాలో 6, ఎన్టీఆర్‌లో జిల్లాలో 3 గ్రామాలు, మొత్తం 26 గ్రామాల ద్వారా నిర్మాణం జరుగుతుంది. దీనికోసం డీపీఆర్ కూడా సిద్ధమయ్యింది. ఈ నిర్మాణానికి భూ సమీకరణ కూడా ప్రారంభించాం. ఆరు నెలల్లో భూ సమీకరణ పూర్తి చేసే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. 2027 నాటికి ట్రంక్ రోడ్ల నిర్మాణం పూర్తవుతుందన్నారు. శాసనసభలో అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డుపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. ఇన్నర్‌రింగ్ రోడ్డులో 96.2. కి.మీ పొడవు, 75 మీటర్ల వెడల్పుతో 8+4 వరసల రోడ్డు నిర్మాణానికి డిజైన్ చేశామని మంత్రి తెలిపారు. దీని నిర్మాణం రెండు ఫేజ్‌లలో జరుగుతుందని, అది పీపీపీ విధానంలో చేపట్టినట్లు తెలిపారు. రాజధానిలోని ట్రంక్ రోడ్ల మౌలిక సదుపాయాలు ఏడీబీ, ప్రపంచ బ్యాంకు, హడ్కో, నాబార్డ్, వివిధ సంస్థల ద్వారా రూ. 40,847 కోట్లు సమకూర్చామని మంత్రి వివరించారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం భూ సమీకరణ అయ్యాక అభివృద్ధి కోసం కనీసం 24 నుంచి 30 నెలల సమయం పడుతుందన్నారు. మొదటి ఫేజ్‌లో కేతనకొండ నున్న వరకు, రెండో ఫేజ్‌లో నున్నకేతనకొండ వరకు నిర్మాణం జరుగుతుందని మంత్రి నారాయణ వివరించారు.

### వ్యవసాయానికి 200-500 యూనిట్లు ఉచితం

రాష్ట్రంలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమాధానం ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 22,30,703 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మూడు డిస్కంల పరిధిలో 1,02,538 కనెక్షన్లు ఇచ్చామన్నారు. వ్యవసాయ సీజన్ నాటికి పెండింగ్‌లో ఉన్న 46 వేల వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేస్తామని తెలిపారు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో డిస్కంలు ఉచిత వ్యవసాయ కనెక్షన్ల కోసం రూ. 839.44 కోట్లు ఖర్చు చేశామన్నారు. పీఎం కుసుమ్ పథకం కింద రాష్ట్రంలో 2,61,481 వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేశామని వివరించారు. ఫీడర్ లెవల్ సోలార్ ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వానికి రూ. 1,059 కోట్లు ఆదా అవుతుందన్నారు. ఏప్రిల్ నుంచి వీవర్స్‌కు 200 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో లైన్‌మెన్ కొరతపై బండారు సత్యనారాయణ అడిగిన ప్రశ్నకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమాధానం ఇస్తూ ఆ పోస్టుల ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఎనర్జీ అసిస్టెంట్లు 581, జూనియర్ లైన్‌మెన్ పోస్టులు 260, అసిస్టెంట్ లైన్‌మెన్లు 1084, లైన్‌మెన్ పోస్టుల్లో 22 ఖాళీలు ఉన్నాయన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవల కోసం త్వరలోనే ఖాళీలను భర్తీ చేస్తామని ఆయన వెల్లడించారు. వినియోగదారుల సౌలభ్యం కోసం ఆటో సోర్టింగ్ విధానంలో 8770 మంది పని చేస్తున్నారన్నారు. లోడ్ ఆధారంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

### బడ్జెట్‌పై చర్చలో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు

ఈ బడ్జెట్ ప్రతిపాదనలు చంద్రబాబు విజన్, పవన్‌కళ్యాణ్ స్ఫూర్తిని రంగరించుకుని చేసినట్లు ఉందని బడ్జెట్‌పై చర్చలో భాగంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. వైద్యారోగ్య రంగంలో గతంలో ఎన్నడూలేనంత అభివృద్ధి చేశారన్నారు. విద్యారంగంలో మంత్రి లోకేష్ చేస్తున్న కృషి మరువలేనిదని, ఇదొక సువర్ణ అధ్యాయం అని తెలిపారు. సామాన్యుడికి విద్యా విధానం, ప్రతి మండలంలోనూ ఒక డిగ్రీ కళాశాల ఉండేలా చూడాలని కోరారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ.. వెనుకబడి తరగతుల వారికి, గిరిజనులకు బడ్జెట్ కేటాయింపులు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని తెలిపారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి మాట్లాడుతూ.. జలవనరుల అభివృద్ధి ద్వారా రాష్ట్రం ముందుకెళుతుందని, అయితే అదే సందర్భంలో జలవనరులశాఖలో పూర్తికాని ప్రాజెక్టులు చాలా ఉన్నాయని తెలిపారు. వాటిని పూర్తి చేయడం ద్వారా ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వాడుకోవడం ద్వారా విద్యా వ్యవస్థను మరింత మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. పెట్టుబడి ఖర్చును రూ.48 వేల కోట్లని చెప్పి రూ.33 వేల కోట్లకు సవరించారని అన్నారు. కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇష్టారాజ్యాంగా అప్పులు చేసి రాష్ట్రాన్ని దెబ్బతీసిందని తెలిపారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పాలనలో రాష్ట్రం ముందుకెళ్తోందని అన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు మాట్లాడుతూ గత పాలన మొత్తం అప్పులతో సాగిందని, దివాళా తీసిందని అన్నారు. బంగారు బాతులాంటి అమరావతిని సర్వనాశనం చేశారని తెలిపారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పాలే లేకుండా నెయ్యి తయారు చేశారని, దేవుడికే విసిన తప్పుకు అధికారం కోల్పోయారని అన్నారు. ధాన్యంకూడా సరైన రీతిలో కొనుగోలు చేయకుండా రైతులను వైసిపి పాలకులు మోసం చేశారని అన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం ద్వారా విద్యార్థులకు కడుపునిండా అన్నం పెడుతున్నామని అన్నారు. ఇటువంటి పాలన గతంలో ఎన్నడూ జరగలేదని తెలిపారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆరోగ్యం కూడా సమాజానికి అవసరమని తెలిపారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజన విద్యార్థులకు ఆరోగ్యం, విద్య అత్యంత అవసరమని అన్నారు. సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి మాట్లాడుతూ బడ్జెట్ ప్రతిపాదనలు ప్రతి మహిళా అభివృద్ధి చెందేందుకు వీలుగా ఉందని అన్నారు.

## స్వార్థ రాజకీయాల కోసమే హెరిటేజ్‌పై వైకాపా తప్పుడు ఆరోపణలు

### - మంత్రి కొల్లు రవీంద్ర

విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: వైకాపా నేతలు హెరిటేజ్ సంస్థపై బురద చల్లుతున్నారని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. శాసన మండలిలో ప్రజా సమస్యలు గురించి చర్చించాల్సిన సమయాన్ని స్వార్థ రాజకీయాల కోసం వాడుకుం టున్నారని ధ్వజమెత్తారు. శ్రీవారి లడ్డూ కల్తీ పాపాన్ని కప్పిపుచ్చుకు నేందుకు హెరిటేజ్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. తప్పుడు ఆరోపణలు చేసేవారు చట్టపరమైన చర్యలు ఎదుర్కోక తప్పదని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# చీజ్ ప్యాకెట్ చూపించి నెయ్యి అంటారా?: మంత్రి అచ్చెన్నాయుడు



విజయవాడ, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: చీజ్ ప్యాకెట్ చూపించి నెయ్యి అంటారా? అంటూ శాసన మండలిలో వైసీపీ సభ్యుల వ్యవహారంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హెరిటేజ్ సంస్థపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తూ, ప్రతిష్ఠను దెబ్బతీయాలనే దురుద్దేశంతో వైసీపీ సభ్యులు ఆందోళనలు చేపడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఇందాపూర్ డెయిరీకి హెరిటేజ్‌కు ఎక్కడా ఎలాంటి సంబంధం లేదని గత రెండు రోజులుగా స్పష్టంగా సమాధానం ఇచ్చినప్పటికీ, అదే అంశాన్ని మళ్లీ మళ్లీ తీసుకొచ్చి సభా సమయాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు.

**ఆధారాలుంటే చూపండి:** ఇందాపూర్‌కు హెరిటేజ్‌కు సంబంధం ఉందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు, ఒక్క చిన్న ఆధారం అయినా చూపించాలని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. కానీ ఆధారాలు చూపకపోగా, బయట ప్రెస్‌మీట్లు పెట్టి చీజ్ ప్యాకెట్లు చూపిస్తూ నెయ్యి ప్యాకెట్లు అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చీజ్,నెయ్యి మధ్య తేడా కూడా తెలియకుండా వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యన్నారాయణ మాట్లాడటం బాధ్యతారాహిత్యమని అన్నారు. ఈ తప్పుడు ప్రచారంపై హెరిటేజ్ సంస్థ బొత్సకు లీగల్ నోటీసులు ఇచ్చిందని, వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనకు ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఆధారాలుంటే చర్చిద్దాం, లేకపోతే అసత్య ప్రచారాన్ని ఆపాలని హెచ్చరించారు. హెరిటేజ్ సంస్థ ప్రభుత్వాలను అడ్డం పెట్టుకుని వ్యాపార లావాదేవీలు జరపకూడదని చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి గుర్తుచేశారు.

ప్రభుత్వాల పేరుతో డబ్బులు దోచుకునే సంస్కృతి హెరిటేజ్‌ది కాదని, గతంలో ప్రభుత్వ ధనాన్ని భారతి సిమెంట్ పేరుతో దోచుకున్న చరిత్ర వైసీపీకి మాత్రమే ఉందని తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ నేతల చర్యలు ఫ్యాక్షన్ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని, గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్‌ను ఎలా అరికట్టామో అలాగే ఇప్పుడు కూడా ప్రజల ఆర్థిక మూలాలను దెబ్బతీయాలనే ప్రయత్నాలను సహించబోమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. చీని తోటలు కట్ చేయడం, ఆస్తులు ధ్వంసం చేయడం వంటి పాత పద్ధతులే ఇప్పుడు సంస్థలపై బదనాం చేయడంగా మారాయని మండిపడ్డారు. శాసనమండలిలో ప్రతిరోజూ ఒకే అంశాన్ని తీసుకొచ్చి వాయిదా తీర్మానాలతో సభను ఇబ్బందికి గురిచేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మంత్రి హెచ్చరించారు. ఆధారాలుంటే టేబుల్‌పై పెట్టండి, లేదంటే అసత్య ప్రచారం మానేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఎస్ఎల్‌బిసి టన్నెల్ నిర్మాణ పనుల పునఃప్రారంభానికి సర్వం సిద్ధం

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బిసి(శ్రీశైలం ఎడమ గట్టు కాలువ) సొరంగ నిర్మాణ పనుల పునః ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ఇప్పటికే నీటిపారుదలశాఖ పర్యవేక్షణలో డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో ట్రయల్‌రన్ కూడా విజయవంతంగా పూర్తయింది. మన్నెవారిపల్లి ఔట్‌లెట్ నుంచి సొరంగంలోపల 20 కిలోమీటర్లు దాటిన తర్వాత బ్లాస్టింగ్ చేపట్టారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 5 మీటర్ల మేర విజయవంతంగా బ్లాస్టింగ్‌ను అధికారులు పూర్తి చేశారు. టన్నెల్‌లోపల బ్లాస్టింగ్ ద్వారా వచ్చే మట్టి, రాళ్లను బయటకు తీసుకురావడంపై అధ్యయనం కొనసాగుతోంది. ఏడాది క్రితం ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో జరిగిన ఘోర ప్రమాదం మిగిల్చిన చేదు ఘటనను అధిగమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటిపారుదలశాఖ కొత్త వ్యూహంతో సొరంగ నిర్మాణ పనులను పునఃప్రారంభించేందుకు సిద్ధమైంది.

## నాలుగు కార్మిక కోడ్‌ల అమలుపై అభిప్రాయాలను ఆహ్వానించిన కార్మిక శాఖ


విజయవాడ, ఫిబ్రవరి 19ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కొత్త కార్మిక కోడ్‌ల అమలు ప్రక్రియలో భాగంగా ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ అభ్యంతరాలు, సూచనలు, అభిప్రాయాలను ఆహ్వానించింది. ఈ సంస్కరణలు కార్మిక చట్టాలను సరళీకరించి ఆధునీకీకరించడం లక్ష్యంగా చేపట్టినవని శాఖ తెలిపింది. కార్మికుల హక్కులను రక్షిస్తూ, పరిశ్రమలకు సులభతరమైన వాతావరణం కల్పించడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం 29 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా సమీకరించింది. అవి- కోడ్ ఆన్ వేజెస్, 2019: ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్, 2020: కోడ్‌ఆన్ సోషల్ సెక్యూరిటీ, 2020: ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్, 2020: ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, సాంకేతిక మార్పులు, మారుతున్న ఉపాధి విధానాలకు అనుగుణంగా ఈ కోడ్‌లు రూపొందించబడ్డాయి. అనేక చట్టాలను నాలుగు సమగ్ర కోడ్‌లుగా మార్చడం, సింగిల్ రిజిస్ట్రేషన్, సింగిల్ లైసెన్స్, సింగిల్ రిటర్న్ విధానం ద్వారా అనుసరణ భారాన్ని తగ్గించడం ముఖ్య లక్ష్యాలు. కనీస వేతనాలను అందరికీ వర్తింపజేయడం, వేతన రక్షణను బలోపేతం చేయడం, అసంఘటిత, గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు సామాజిక భద్రత విస్తరించడం కూడా ఈ సంస్కరణల భాగం. డిజిటల్ వ్యవస్థలు, వెబ్ ఆధారిత తనిఖీలు ద్వారా పారదర్శకత పెంపు, కొన్ని నేరాలకు శిక్షణ సరళీకరణ, వివాదాల పరిష్కారానికి వ్యవస్థీకృత విధానాలు, కార్మికుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమానికి మెరుగైన నిబంధనలు ఈ కోడ్‌లలో ఉన్నాయి. 2025 డిసెంబర్ 30న కేంద్ర ప్రభుత్వం డ్రాఫ్ట్ రూల్స్‌ను విడుదల చేసింది. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్, 2020, కోడ్ ఆన్ వేజెస్, 2019 కింద ప్రాథమికి నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ నోటిఫికేషన్లు కార్మిక శాఖఅధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఉద్యోగులు, కార్మికులు, యజమానులు, ట్రేడ్ యూనియన్లు, పరిశ్రమ సంఘాలు, వృత్తి సంఘాలు, పౌర సమాజ సంస్థలు, సాధారణ ప్రజలు డ్రాఫ్ట్ నిబంధనలను పరిశీలించి, సూచించిన గడువులోగా తమ అభిప్రాయాలను తెలియజేయాలని కార్మిక శాఖ కోరింది. అభ్యంతరాలు, సూచనలు లిఖితపూర్వకంగా కమిషనర్ ఆఫ్ లేబర్‌కు లేదా నోటిఫికేషన్ పేర్కొన్న అధికార ఇమెయిల్/ పోర్టల్ ద్వారా పంపవచ్చు. గడువులోగా వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి తుది నియమాలు రూపొందిస్తామని అధికారులు తెలిపారు. కార్మికులు, పరిశ్రమలు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమతుల్యంగా అమలు చేయడమే ఈ సంప్రదింపుల లక్ష్యమని శాఖ స్పష్టం చేసింది. సూచనలు సమర్పించేందుకు చివరి తేదీ 15 మార్చి 2026 కాగా, కోడ్ ఆన్ వేజెస్, 2019కు సంబంధించిన సూచనలు సమర్పించేందుకు 30 మార్చి 2026ను గడువుగా నిర్ణయించారు.




## 28న టిటిడి బోర్డు సమావేశం

**ఖరారైన ముహూర్తం!**

తిరుమల, ఫిబ్రవరి 19 ప్రభాత వార్త ప్రతినిధి: ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో కీలకమైన అభివృద్ధిపనులు చేపట్టేందుకు, అవసరమైన ముడిసరుకులు కొనుగోళ్ళకు అనుసరించాల్సిన విధానం, టెండర్ల ఆమోదం వంటి అంశాలు చర్చించేందుకు ఈనెల 28న శనివారం టిటిడి బోర్డు సమావేశం కానుంది. ఈ సమావేశంలో వేదాశీర్వచనం భక్తులకు అందించే మేల్‌ఛాట్ వస్త్రాలు కొనుగోలు, మార్కెటింగ్ విభాగంలో ముడిసరుకుల కొనుగోలుకు టెండర్లుతోబాటు రానున్న విద్యాసంవత్సరంలో టిటిడి విద్యాసంస్థల్లో విద్యాబోధన, హాస్టల్స్ భవనాల నిర్మాణం, మరింత మెరుగ్గా మధ్యాహ్న భోజనం అమలు వంటి కీలక అజెండా చర్చించే అవకాశం ఉంది. టిటిడి బోర్డు సమావేశంలో ఇప్పటికే రెండు దఫాలు వాయిదాపడింది. సాధారణంగా పిబ్రవరి/ మార్చిలో జరిగే టిటిడి బోర్డు సమావేశం వార్షిక బడ్జెట్‌కు సంబంధించి ప్రతిపాదనలు, ఆమోదం తోబాటు పలు కీలక నిర్ణయాలు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరుపై చర్చించడం జరుగుతుంది. ఈనెల 3వ తేదీ టిటిడి బోర్డు సమావేశం జరగాల్సి ఉండగా టిటిడి ఇఓ అనిల్‌కుమార్ సింఘాల్ బదలీతో వాయిదా పడింది. మళ్ళీ 23న జరిగేలా అజెండా రూపొందించారు. అయితే కొన్ని అనివార్య కారణాలతో చివరకు 28వ తేదీకి మార్పుచేశారు. మరీ 2026-27 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు ఉంటాయా, ఉద్యోగాల భర్తీ, టెండరు ప్రక్రియ వంటి అంశాలపై చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. మేల్‌ఛాట్ వస్త్రాల కొనుగోళ్ళకు టెండర్లు అమోదం తెలపనున్నారు.



## త్వరలో ఔటర్ రింగ్ రోడ్డు

### స్థానిక నాయకులతో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం టౌన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: హిందూపురంలో రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోతున్నందున ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని బాలకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఉదయం క్యాంపు కార్యాలయంలో స్థానిక టిడిపి నాయకులు కలిసి మాట్లాడారు. మున్సిపల్ మాజీ చైర్మన్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డు అంశాన్ని ప్రస్తావించగా పై విధంగా బాలయ్య వివరాలు వెల్లడించారు. ఇప్పటికే తాను కేంద్ర మంత్రి గడ్కరీ తో మాట్లాడానని డిపిఆర్ రూపొందించి పంపాలని అక్కడి నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు వచ్చాయన్నారు. అభివృద్ధిలో ఏపీలో హిందూపురానికి ఐదవ స్థానం రావడా నికి నాయకులు కార్యకర్తలు అధికారుల కృషి ఎంతో ఉందని ఎమ్మెల్యే అభినందించారు. నియోజకవర్గంలో దాదాపు అన్నిచోట్ల రహదారులు డ్రైనేజీలు నీటి వసతి మొదలగు అన్ని సదుపాయాలను కల్పిస్తూ శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని పేర్కొ న్నారు. సమావేశంలో నాయకులు మంగేష్, జిల్లా మాజీ అధ్యక్షులు అంజనప్ప, పట్టణ అధ్యక్షులు వెంకటేష్, నాగరాజు, ఆనంద్ కుమార్, అమర్నాథ్, చంద్రమోహన్ యాదవ్, అబూ బకర్, రాఘవేంద్ర, సుమో శీన, సతీష్, దుర్గా నాని, ఎర్రగడ్ల పవన్ కుమార్, యుగంధర్ ఉన్నారు.

# వేదాశీర్వచనానికి మేల్‌ఛాట్ వస్త్రాల కొరత!

## - వేదపండితుల ఆశీర్వచనం కోసం ప్రముఖుల తాకిడి



తిరుమల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకుంటున్న ప్రముఖులు, విఐపి బ్రేక్ ప్రోటోకాల్ ముఖ్యులు అందుకునే వేదపండితుల ఆశీర్వచనాలకు మేల్‌ఛాట్ వస్త్రాల కొరత కనిపిస్తోంది. ప్రతిరోజూ ప్రోటోకాల్ విఐపి బ్రేక్‌లో పదిమంది వరకు ప్రముఖులు శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితుల వేదాశీర్వచనం అందుకోవడం జరుగుతుంది. ఇందుకు రూ 3వేలు వేదాశీర్వచనం సేవా టిక్కెట్ ముందుగానే కొనుగోలుచేస్తారు. ఈ టిక్కెట్లను తిరుమలలో బ్రేక్ టిక్కెట్లతోబాటు అదనపు ఇఓ కార్యాలయంలో జారీచేస్తారు. రోజువారీగా ఇరవైవరకు వేదాశీర్వచనం టిక్కెట్లు జారా అవుతున్నా రెండురోజులు మేల్‌ఛాట్‌వస్త్రాలు కొరతతో ఈ సంఖ్య కుదించినట్లు ఆలయ వర్గాల సమాచారం. బుధవారం కేవలం ఐదు టిక్కెట్లు మాత్రమే వేదాశీర్వచనం మంజూరైందనేది తెలుస్తోంది. ఇందుకు ఈ సేవా భక్తులకు అందజేసే పట్టువస్త్రాలు అవసరమైన మేరకు నిల్వలేకపోవడమే కారణమనేది చెబుతున్నారు. గతంలో ఈ వస్త్రాల కొనుగోళ్ళలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని, తక్కువ ధరకే కొనుగోలుచేయాల్సిన మేల్‌ఛాట్‌వస్త్రాలను అధిక ధరకు టెండర్‌లు ఇచ్చినా నాసిరకం వస్త్రాలు అనేది భక్తుల్లో ఆరోపణలు. దీంతో గత టెండర్లను ఇప్పుడు టిటిడి బోర్డు రద్దుచేసిన విషయం తెలిసిందే.

ప్రతిరోజూ తిరుమలకు పెద్దసంఖ్యలోనే ప్రోటోకాల్ ప్రముఖులు, ప్రముఖులు వస్తుంటారు. తిరుమలకు వచ్చిన సందర్భంలో వారికి మర్యాదపూర్వక స్వాగతం పలకడంతోబాటు వేదాశీర్వచనం చేసుకుంటే మేల్‌ఛాట్ వస్త్రాలను బహుమానంగా అందిస్తారు. మార్కెట్లో నాణ్యమైనవి కూడా 300-350రూపాయలు ఉండగా ఈ శాలువలను గత టిటిడి బోర్డులోని పెద్దలు, ప్రొక్యూర్‌మెంట్‌సెల్ కమిటీలోని అధికారులు ఏకంగా నాలుగురెట్లు పెంచి 1,300రూపాయలు వెచ్చించి కొనుగోలుచేశారనేది ఇటీవల ప్రస్తుత బోర్డు తేల్చిన లెక్కలు. ఈ నేపథ్యంలో టెండర్లను రద్దుచేయడంలో శాలువాల కొరత ఏర్పడింది. ఇప్పటికే ఈ టెండర్లు ఆమోదించాల్సి ఉండగా బోర్డు సమావేశం జాప్యం కారణంగా మేల్‌ఛాట్‌వస్త్రాల కొనుగోళ్ళ టెండర్లకు కాలయాపన జరిగింది. ఈనెల 28వతేదీ జరగనున్న టిటిడి బోర్డు సమావేశంలో ఈ అంశంచర్చకు రానుంది.

# తిరుమల సమాచారం



## మార్చి 3వరకు పుష్కరిణిలో స్నానాలు రద్దు

### - భక్తులు టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి

తిరుమల, ఫిబ్రవరి 19ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలేశుని తెప్పోత్సవాలు ఆరంభానికి ముందే నేటి నుండి మార్చి 3వతేదీ వరకు స్వామిపుష్కరిణిలో భక్తులకు స్నానాలు టిటిడి రద్దుచేసింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. ఈనెల 26నుండి జరిగే తిరుమలేశుని తెప్పోత్సవాలకు సంబంధించి కొన్ని కార్యక్రమాలు చేపడుతున్నందున, పుష్కరిణిలో తెప్ప సిద్ధమవడంతో పవిత్రంగా భావించేందుకు పుష్కరిణిలో స్నానాలు రద్దుచేశారు. తెప్పోత్సవాలకు పుష్కరిణీ, తెప్పలకు ఆకర్షణీయంగా విద్యుత్ అలంకరణ, వరహా స్వామి ఆలయం, నాలుగు మాడ వీధుల్లో పందిళ్లు ఏర్పాటు. భక్తులకు సూచనలు అందించేందుకు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు.



## అంతా మంచి జరగాలనివేడుకున్నాం

తిరుమల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం శుభకరమని, అంతా మంచిజరగాలని, భక్తులకు సకల సౌకర్యాలు టిటిడి అధికారులు కల్పించారని పలువురు ప్రముఖులు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో సిఎం చంద్రబాబు నాయుడు పాలనలో తిరుమలలో సౌకర్యాలు మెరుగుపడ్డాయని సినీనటుడు చరణ్‌రాజ్ తెలిపారు. గురువారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయంలో తెలంగాణ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, సినీనటుడు చరణ్‌రాజ్, సంగీత దర్శకుడు డ్రమ్స్ శివమణి, సినీనటి రమ్యశ్రీ,సినీనటి త్రిషవేర్వేరుగా ఆలయం లోనికి చేరుకున్నారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం లోపల వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అదికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా వేకువజామున తోమాలసేవలో సినీనటి శ్రియాశరణ్ శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల వీరిని చూడటానికి, ఫోటోలు దిగేందుకు భక్తులు ఉత్సాహం చూపారు.



## 200 మందికి ఉచితంగా మూడేళ్లపాటు సివిల్స్‌లో శిక్షణ

### బ్రోచర్‌ను విడుదల చేసిన మంత్రులు సత్యకుమార్, పార్థసారథి

విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: ఉచిత సివిల్స్ శిక్షణ దరఖాస్తుల స్వీకరణ బ్రోచరు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సమాచార శాఖ మంత్రి పార్థసారథి సచివాలయంలో గురువారం విడుదల చేశారు. మంత్రి సత్యకుమార్ చాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. చలసాని బలరామప్రసాద్ అకాడమీ ద్వారా ఎంపిక కాబోయే 200 మంది అభ్యర్థులకు మూడేళ్లపాటు ఉచిత వసతి, శిక్షణ ఇవ్వడాన్ని మంత్రులు స్వాగతించారు. యుపిపిఎస్‌సి, ఎపిపిఎస్‌సి ఇతర ఉద్యోగ నియామకాలకు అభ్యర్థులను సన్నద్ధం చేస్తామని డాక్టర్ లక్ష్మయ్య వెల్లడించారు. 200మందిలో వంద మంది అమ్మాయిలు ఉంటారని పేర్కొన్నారు. వచ్చే నెల 15న అమ్మాయిలు, ఏప్రిల్ 5న యువకులకు రాత పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. విజయవాడలోని కేంద్రంలో అమ్మాయిలకు, వినుకొండలోని కేంద్రంలో అబ్బాయిలకు శిక్షణ ఇస్తారు. ప్రముఖ సామాజిక సేవకుడు చలసాని బలరామ ప్రసాద్ అభ్యర్థులకు ఉచిత భోజన, సదుపాయాన్ని కల్పిస్తుండగా డాక్టర్ లక్ష్మయ్య ఐ.ఎ.ఎస్ స్టడీ సర్కిల్ వారు ఉచితంగా శిక్షణ ఇస్తారు. ఒక్కో అభ్యర్థికి మూడేళ్లపాటు ఉచిత వసతి, బస సదుపాయాలతో శిక్షణ ఇచ్చినందుకు సుమారు రూ.10 లక్షల వరకు వ్యయమవుతుంది. మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవ, ఔదార్యంతో ధర్మవరం నియోజకవర్గం నుంచి ఎంపికచేసిన 28 మంది అమ్మాయిలు ప్రస్తుత సివిల్స్‌కు ఉచితంగా గత 9 నెలల నుంచి హైదరాబాదులో డాక్టర్ లక్ష్మయ్య సంస్థ ద్వారా శిక్షణ పొందుతున్నారు. మరో రెండేళ్లపాటు వీరికి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు.

## అత్యాధునిక సాంకేతితతో లడ్డూపోటు, అన్నదాన భవనం

### - ఇంద్రకీలాద్రిపై ఇఓ శీనా నాయక్ ఆకస్మిక తనిఖీ

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: దుర్గమ్మ వారి ఆలయంఒ నూతనంగా నిర్మిస్తున్న అన్నప్రసాద తయారీ భవనం, లడ్డూ పోటు భవనాలు అత్యాధునిక సాంకేతికతతో నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. తిరుపతి తిరుమల దేవస్థానంలో జరుగుతున్న అన్నదాన కిచెన్, లడ్డూపోటును శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ప్రత్యేక బృందం పరిశీలించి 3 రోజుల్లో నివేదికను ఇస్తామని వెల్లడించారు. ఈ మేరకు తిరుపతి తిరుమల దేవస్థానంకు పరికరాలు అందించిన టెక్నాలజిక్ ఇంజనీర్స్ సంస్థ అదికారులు రఘునాథన్, పార్థసారది, ఎం కోటేశ్వరరావు, హరిప్రసాద్ లు ఇఓ వికె శీనా నాయక్‌తో సమావేశమై గురువారం పలు అంశాలను వివరించారు. అనంతరం ఇఓ మాట్లాడుతూ అత్యాధునికతతో లడ్డూపోటు, అన్నప్రసాద తయారీ భవనాలు నిర్మిస్తున్నామన్నారు.

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఓ వికె సీన నాయక్ గురువారం ఆలయ పరిసరాల్లోని వివిధ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భక్తులకు అందుతున్న సేవలను స్వయంగా పర్యవేక్షించి అధికారులకు పలు కీలక ఆదేశాలిచ్చారు. కొబ్బరికాయల కౌంటర్‌లో కాంట్రాక్టర్ సరఫరా చేస్తున్న కొబ్బరికాయల పరిమాణాన్ని పరిశీలించారు. పాడైపోయిన స్టాక్‌ను వెంటనే కాంట్రాక్టర్‌కు వెనక్కి పంపాలని సంబంధిత క్లర్కును ఆదేశించారు. దేవస్థాన చీరల విక్రయ కౌంటర్‌లో విక్రయాలను, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్లోక్ రూమ్ చెప్పుల స్టాండ్ పరిశీలించి భక్తుల నుంచి నిర్ణీత ధరల కంటే అదనంగా వసూలు చేయకూడదని సిబ్బందిని హెచ్చరించారు. సెల్ ఫోన్ కౌంటర్ వద్ద ఫ్లోరింగ్ దెబ్బతినడంతో తక్షణమే అక్కడ కొత్త ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లలో భక్తులకు తాగునీటి సౌకర్యం నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కియోస్క్ మెషీన్ పరిశీలించారు. ఆలయ ప్రాంగణంతో పాటు స్కానింగ్ పాయింట్ల వద్ద టికెట్ల తనిఖీ విధానాన్ని పరిశీలించి, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

**భక్తుల విరాళాలు:** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన నారాయణమ్ రాజేష్, నాగలక్ష్మి కుటుంబసభ్యులు రు.1,01,116ల విరాళం గురువారం అందించారు.

# చర్మ సంరక్షణ జాగ్రత్తలు !



చర్మ సంరక్షణ విషయం లో మనం ఓ రకంగా అదృష్టవంతులమే అని చెప్పు కోవాలి. ఎందుకంటే ఫుడ్ అలర్జీకి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలు ఇక్కడి వారిలో ఉండవు. అయితే కొద్దిమందికి మాత్రమే ఈ సమస్యలు ఎదురవుతుంటాయి. ఈ సమయంలో చర్మంలో కూడా చాలా మార్పులు కనిపిస్తుంటాయి. ఈ క్రమంలో చర్మం రఫ్‌గా తయారవుతున్నా.. డల్‌గా కనిపిస్తున్నా ఓ సారి వైద్య నిపుణులను సంప్రదించి అలర్జీ టెస్ట్ చేయించుకోవడం అవసరం. దీంతో పాటు చర్మం సంరక్షణకు సంబంధించి కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ✪. మన శరీరానికి సరిపడే ఆహారం మాత్రమే తీసుకోవాలి. అదే మన ఆరోగ్య నికి మంచిది. ప్రత్యేకించి జంక్ ఫుడ్స్ డెయిరీ ప్రొడక్ట్స్ తినే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. రోజుకు కనీసం 2 లీటర్ల నీళ్లు తాగడం తప్పనిసరి. ✪ ఏ కాలమైనా సరే - బయటికి వెళ్లేటప్పుడు చర్మానికి సన్‌స్క్రీన్ రాసుకోవాలి. ✪ అదే విధంగా అవసరాన్ని బట్టి డెర్మటాలజిస్ట్ సలహా మేరకు సి-విటమిన్ అధికంగా లభించే సీరంను రోజూ చర్మానికి రాసుకోవాలి. ఇది చర్మ సంరక్షణకు ఎంతగానో ఉపకరిస్తుంది. ✪. చర్మంలో తేమ స్థాయులు తగ్గకుండా ఉండేందుకు మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ప్రత్యేకించి మెడ భాగంలో, కళ్ల కింద మాయిశ్చరైజర్‌తో మృదువుగా మర్దన చేసుకోవాలి. ✪ రోజుకు రెండుసార్లు శుభ్రమైన నీటితో ఫేస్ వాష్ చేసుకోవాలి. ముఖం కడుక్కునేటప్పుడు చేతులతో మరీ గట్టిగా రుద్దకూడదు. ఎందుకంటే ఇలా చేస్తే చర్మం పొడిబారిపోయే ప్రమాదముంది. ✪. మచ్చలు, మొటిమలు ఏర్పడితే వాటిని గిల్లకూడదు. అలా చేస్తే ఆ ప్రాంతం మరింత అందవిహీనంగా తయారవుతుంది. □

## తొలి మహిళ ..



సురేఖా యాదవ్‌ది మహారాష్ట్ర లోని సాతారా జిల్లా. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా పూర్తిచేసి, తొలి మహిళా లోకో పైలట్‌గా నియమితుల య్యారు. మొదటి సారి రైలుని నడిపి జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులని అందు కున్నారు. వందే భారత్ ఎక్స్ ప్రెస్‌ని నడిపి మరో రికార్డునీ సొంతం చేసుకున్నారేమె. □

# పవిత్ర మాసం రంజాన్





**నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానుంది. నెలవంక దర్శనంతో బుధవారం తరావీహ్ నమాజ్‌ను ప్రారంభిస్తారు. గురువారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి.ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లింలు రంజాన్ ఉపవాసదీక్షల్ని అకుంఠిత దీక్షతో అమలు చేస్తారు. మొదటి పండగ రంజాన్:** ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఆచరించే పండుగల్లో మొదటిది రంజాన్. రంజ్ అంటే దహించటమని అరబ్బీలో అర్థం. జాన్ అంటే ప్రాణమంటారు. అంటే మానవునిలోని చెడును దహింపజేయటమని అర్థం. మానవుడు నిత్యం పాపాల్ని చేస్తూ జీవితాన్ని గడుపుతుంటాడు. అయితే తాను చేసే తప్పుల్ని మన్నించి ఇక మీదట తాను దైవ మార్గాన నడుచు కుంటానని అల్లాహ్ వద్ద దీనవదనంతో, అశ్రునయనాలతో మోకరిల్లి క్షమాభిక్ష అడిగే పవిత్ర మాసం రంజాన్ అంటారు. ఈ నెలలో తాను ఆచరించే ఆధ్యాత్మిక చింతనకు ఒక్కొక్క మంచిపనికి 70రెట్లు ప్రతి ఫలం లభిస్తుంది. అన్ని మాసాల కన్నా రంజాన్‌కు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. మానవుడు ఆచరించాల్సిన ఐదుసూత్రాల్లో నాలుగు ఆచరించే అవకాశం లభించిందని చెప్పవచ్చు. ఈమాన్ (కలిమా,) నమాజ్, రోజా, జకాత్‌ల ఆచరణకు రంజాన్ మాసంలో ఎంతో ప్రాధాన్యత ఉంది. అయితే హజ్ అనేది ఐదో సూత్రం ఇది ధనవంతులు నిర్వహించే అవకాశం ఉంది. కాబట్టి దీనిని బక్రీద్ మాసంలో అవకాశం కల్పించ బడింది. దీనివల్ల మానవుడు సంపూర్ణ మానవతా వాదిగా, మానవరూపంలోని దైవదూత గుణసంపన్ను డుగా పరివర్తన చెందాలన్నది లక్ష్యం.అందుకే అల్లాహ్ సృష్టిలో ఏ జీవరాశికి ఇవ్వనటువంటి బుద్ది కుశలత, విచక్షణ మానవునికి ప్రసాదించాడు.

**దివ్య ఖుర్‌ఆన్ అందిన దివ్యమాసం!** ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే 'దివ్యఖుర్‌ఆన్' మానవాళికి అ ందిన దివ్యమాసం రంజాన్. ఈ మాసం ప్రాధాన్యతకు సంబంధించి దివ్యఖుర్ ఆన్‌లో 'సూరాయే ఖదర్'లో పేర్కొన్నారు. ముస్లింలు పవిత్రంగా భావించే మరో మూడు గ్రంధాలు, ఇంజిల్, తవారత్, జబుర్‌లలో కొన్ని అంశాలను సవరణలు చేసారు. కానీ దివ్యఖుర్‌ఆన్ సరాసరి అల్లాహ్ నుంచి అందిన నజరానాగా చెప్పబడుతుంది. కాబట్టి ఈ గ్రంధానికి ఎనలేని ప్రాధాన్యత సంతరించుకుంది. దివ్యఖుర్ ఆన్‌లో పేర్కొన్న 'ఇన్నాఅన్సల్‌నా' అనే సూరాను 'సూరా ఖదర్'- అంటారు. దివ్యఖుర్ ఆన్‌లో మొత్తం 114 సూరాలు(మంత్రాలు), ఆయాత్‌లు ఉన్నాయి. ఈ సూరాలో ఇలా పేర్కొన బడి ఉంది. ఓ మానవులారా. విధి విధానాలకు సంబంధించి ఓ పవిత్ర గ్రంధం దివ్యఖుర్‌ఆన్‌ను మీకు అందించాను. దివ్య మాసం రంజాన్ అని గుర్తించండి చిట్టచివరి ప్రవక్త మహ్మద్‌సొల్లెల్లలాఅలైహోసొల్లాం సూచించిన విధానాలు, సూచనలు తూ.చ.తప్పక అనుసరించాల్సిన మాసంగా రంజాన్‌గా భావిస్తారు. పవిత్రదివ్యఖురాన్ దివి నుంచి భువికి వచ్చిన పవిత్ర మాసం కాబట్టి ఈ మాసం మిగిలిన 11 మాసాల కన్నా మిన్న అని చెబుతారు. ప్రతి మసీదులో ఇస్లాం మత వ్యాప్తికి కృషి చేసిన ప్రవక్తల గురించి చిట్ట చివరి ప్రవక్త సేవల్ని సోదాహరణంగా వివరిస్తారు. అలాగే రంజాన్ మాసంలో ఆచరించాల్సిన ఉపవాస దీక్షలను(రోజా)గురించి దీక్షలు పాటించే వారు ఆచరించాల్సిన నియమనింబధనలను గురించి వివరిస్తూ అలాగే ధనవంతులు ఆచరించాల్సిన నియమాలను తెలిపారు. రాత్రి నుంచి సూర్యోదయం వరకు ఈ విధంగా నా దూతలు నా గురించి తపించే నా భక్తుల మనోరధాల్ని తీర్చుటకు వస్తారని ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకొని స్వర్గప్రాప్తి కోసం కృషి చేయమని పేర్కొన్నారు. ఇలాంటి రాత్రి మరొకటి లేదని స్పష్టం చేసారు.

**తరావీహ్ ప్రాధాన్యత:** రంజాన్ మాసానికి ముందు షాబాన్ మాసం వస్తుంది. ఈ మాసం దైవ ప్రవక్తమహమ్మద్ సొల్లాలాసొల్లం సూచించే మార్గదర్శకాలకు అవకాశం అయితే రంజాన్ మాసం వస్తుందనే ముందు పిలుపుగా చెప్పవచ్చు. రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం ఆచరించే నమాజుల్లో రాత్రి వేళల్లో నిర్వహించే తరావీహ్ నమాజ్ ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ప్రతి ఒక్కరు రాత్రి వేళల్లో దివ్యఖుర్ ఆన్‌లోని 30 కాండాల్లో ఒక్కొక్క కాండాన్ని పఠిస్తారు. ఈ నమాజ్‌లను ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క విధంగా ఆచరిస్తారు. ఉత్తర భారత దేశంలో ముస్లింలు ఒక నెలలో పది సార్లు దివ్యఖుర్ ఆన్‌ను పఠించి తరావీహ్ నమాజు ఆచరిస్తారు. ఆంధ్రరాష్ట్రంలోని మసీదుల్లో రోజుకొక కాండం చొప్పున పఠిస్తారు. 27 రోజుల్లో 30 కాండాల్ని పూర్తి చేస్తారు. 27వ రాత్రి "షబ్బెఖదర్"అంటారు.

**ఉపవాస దీక్షల ప్రాధాన్యత:** దివ్యఖురాఆన్‌లోని సూరా 2-183లో ఇలా పేర్కొనబడింది. విశ్వాసం కల్గిన మానవులారా! పూర్వ ప్రవక్తల అనుయాయులకు ఏ విధంగా ఉపవాస దీక్షలు విధిగా విధించబడ్డాయో అలాగే ప్రస్తుతం ఉపవాసాలు విధిగా పాటించాలని నిర్ణయించినట్లు దీని వల్ల భయభక్తులు కల్గుతాయి. ఇంతటి చారిత్రక ప్రాధాన్యత సామాజిక భావం కల్గినటువంటి ఉపవాసాల ముఖ్యోద్దేశ్యాల్ని, లక్ష్యాల్ని అల్లాహ్ స్పష్టంగా విశదీకరించారు. నైతిక మానవీయ విలువల్ని బాధ్యతా భావాన్ని పెంపొందించుటకే వీటిని ఫరజ్ (తప్పని సరి)గా ఆదేశించారు. ఉపవాస దీక్షల్ని పాటించే వారు కొన్ని నియమనిబంధల్ని ఆచరించాల్సి ఉంటుంది. దినమంతా ఉపవాస దీక్ష ఆచరించే వారు అబద్ద మాడరాదు. ఇతరుల్ని దూషించరాదు. ఇతరుల గురించి చెడుగా మాట్లాడరాదు. పరదూషణ చేయరాదు. దేవుని ధ్యానంలో సత్యసంధతతో నడుచుకోవాలి. మానవుడు కామ, క్రోధ, మద, మాశ్చార్యాల్ని అణచుకొని దీక్షను పాటించటం వల్ల ఆరోగ్యపరంగా కూడా ఎంతో మేలు చేకూరుతుందని దివ్యగ్రంథాల్లో పేర్కొన్నారు.

- షేక్ రహంతుల్లా

## పచ్చని మొక్కకు చల్లని నీడ

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఇంటి తోటను సిద్ధం చేసుకోవాలి. అసలే రానున్నదంతా వేసవి కాలం. వేడి గాలుల నుంచి మొక్కల్ని ఎలా కాపాడుకోవాలంటే..

★ నేల తేమను కోల్పోకుండా మొక్కల చుట్టూ గడ్డి, కొబ్బరిపొట్టు వంటి మల్చ్‌ను మందపాటి పొరలా ఏర్పాటు చేయాలి. ఇది మట్టిలో తేమను నిలిపి ఉంచి వాడిపోనివ్వకుండా చేస్తుంది. కలుపు మొక్కలనూ పెరగనివ్వదు. మల్చింగ్ గట్టిపడిన ప్రతిసారీ గుల్లచేసి కొద్ది కొత్తది వేస్తూ ఉండాలి. ★ మొక్క ఆరోగ్యంగా పెరగడానికి ఎండ ఎంత అవసరమో, అవసరానికి మించి ఎండ కూడా అంతే హానికరం. అందువల్ల ఎండ తీవ్రత నుంచి మొక్కలను రక్షించాలి. వీలైతే ఇంటి తోట చుట్టూ గ్రీన్ షేడ్ నెట్ వేస్తే సరి. లేదంటే గాలీ వెలుతురూ అందేలా కాస్త ఎత్తులో ఆకుల పందిరి వేసినా మేలే. ★ గాలి ప్రసరణను మెరుగుపర్చ డానికి, శిలీంధ్ర వ్యాధులను నివారించడానికీ ఫ్రైనింగ్ చాలా అవసరం. ఎండిన, చనిపోయిన కొమ్మలను తొలగించడం వల్ల కొత్తచిగుళ్లు వస్తాయి. వేడిగాలులకు మట్టి త్వరగా పొడిబారుతుంది. నీరు వేళ్ల చివరి వరకు తడిచేలా రోజూ రెండుసార్లు అందించాలి. ★ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా. అప్పుడప్పుడు చీడపీడలు వేధిస్తుంటాయి. ఇలాంటప్పుడు వేపనూనె, వెల్లుల్లి రెబ్బలను దంచి నీటిలో కలపాలి. ఈ మిశ్రమాన్ని రాత్రంతా ఉంచి మరుసటి రోజు ఉదయం వడకట్టి మొక్కలపైస్ప్రే చేయాలి. వెల్లుల్లికి నరకిమికీటకాలతో పోరాడే గుణాలు ఉన్నందున త్వరగా తెగుళ్లను అరికడుతుంది. □

## కాబోయే అమ్మకు జాగ్రత్తలు



కడుపులో పెరుగుతోన్న బిడ్డ ఎదుగుదల గురించే అనుక్షణం ఆలోచిస్తుంటుంది. కాబోయే అమ్మ మనసు. ఈ క్రమంలో దగ్గర్నుంచి వ్యాయామాల వరకు.. ప్రతి అంశంలోనూ జాగ్రత్తగా ఉండాల్సిందే అంటున్నారు నిపుణులు. గర్భస్థ సమయంలో బిడ్డ ఎదుగుదలకు ప్రొటీన్లు, విటమిన్లతో కూడిన మాంసాహారం తినడం మంచిదే! అయితే వీటిని బాగా ఉడికించుకొని తీసుకోవాలి. అప్పుడే అవి త్వరగా, సులభంగా జీర్ణమవు తాయి. ✦ఆహారం ఏ పూటకు ఆ పూటే వేడి వేడిగా వండుకొని తీసు కోవాలి. ఉదయం వండినవి. సాయంత్రం, రాత్రి వండినవి మరుసటి రోజు వేడి చేసుకొని తిన్నకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. ✦గర్భస్థ సమయంలో మహిళలు పెరిగే బరువు ఆరోగ్యకరంగా ఉండాలి. నిపుణుల సలహా మేరకు పోషకాహారం తీసుకోవడం మంచిది. అలాగే ఆహారపు కోరికల్ని అదుపులో ఉంచుకుంటూ ఈ సమయంలో జంక్‌ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్, చిప్స్, బిస్కట్స్.. వంటి వాటికి దూరంగా ఉండాలి. అలాగే స్వీట్స్ కూడా పూర్తిగానే తీసుకోవాలి. ✦ రోజూ తాగే నీళ్లు కూడా కాచి చల్లార్చినవైతే మరీ మంచిదంటున్నారు నిపుణులు. అలాగే శరీరంలో తేమ స్థాయులు తగ్గకుండా కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలి. ఫలితంగా ఉమ్మనీరు తగ్గకుండా జాగ్రత్తపడచ్చు. గర్భిణిగా ఉన్న సమయంలో మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి నిపుణుల సలహాలు తీసుకుంటే.. యోగా, నడక వంటి చిన్న చిన్న వ్యాయామాలు చేస్తే శరీరం యాక్టివ్‌గా ఉంటుంది. □

## మెంతి ఆకు ఉసిరి తొక్కు



**కావలసిన పదార్థాలు:** మెంతికూర: రెండు కట్టలుఆవాలు: టీ స్పూను, ఇంగువ: కొద్దిగా మినప్పప్పు: టీ స్పూనుశనగపప్పు: టీ స్పూనుఎండు మిరపకాయలు: పది నూనె: టేబుల్ స్పూనుఉప్పు వేసి పెట్టిన ఉసిరి తొక్కు: నాలుగు స్పూన్లు లేదా ఉసిరికాయలు: పదిఉప్పు: తగినంత

**తయారు చేసే విధానం:** ముందుగా మెంతి కూరను తెంచి కడిగి ఆరబెట్టుకోవాలి. పొయ్యి మీద బాణలి పెట్టి నూనె వేసి అందులో మినప్పప్పు, శనగ పప్పు, ఆవాలు, ఎండు మిరపకాయలు, ఇంగువ వేసి వేయించి ఒక ప్లేట్‌లోకి తీసి పెట్టుకోవాలి. అదే నూనెలో ఇందాక ఆరబెట్టుకున్న మెంతి ఆకుల్ని వేసి వేయించు కోవాలి. ఇప్పుడు మిక్సీ తీసుకొని వేయించి పక్కకు పెట్టుకున్న పప్పుల మిశ్రమాన్ని పొడిపట్టుకోవాలి. దాన్ని తీసి వేయించుకున్న ఆకుల్ని మిక్సీ పట్టుకోవాలి. అందులో ఈ పొడితో పాటు ఉసిరితొక్కు, సరిపడినంత ఉప్పు వేసి మళ్లీ నాలుగు తిప్పులు తిప్పాలి. ఒకవేళ ముందు చేసిన ఉసిరి తొక్కు లేకపోతే ఉసిరి కాయల్ని తరిగి మిక్సీ పట్టుకొని వాడుకోవచ్చు. పుల్లపుల్లగా ఉండే మెంతి ఆకు పచ్చడి తినాలంటే దీన్ని ట్రై చేయాల్సిందే!

# 'క్రేజీ కల్యాణం' అనుపమ పరమేశ్వరన్
## బర్త్ డే పోస్టర్ రిలీజ్



మంచాల నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. ఈ రోజు బ్యూటిఫుల్, టాలెంటెడ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ బర్త్ డే సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ 'క్రేజీ కల్యాణం' మేకర్స్ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో పెళ్లి కూతురిగా సంతోషంగా డ్యాన్స్ చేస్తున్న అనుపమ స్టిల్ ఆకట్టుకుంటోంది. ఆమె ఈ చిత్రంలో కీర్తి అనే క్యారెక్టర్ లో ప్రేక్షకులను అలరించనుంది. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో కంప్లీట్ ఎంటర్ టైన్ మెంట్ తో సాగే చిత్రమిది. తెలంగాణలోని పలుగ్రామీణ ప్రాంతాల్లో 'క్రేజీ కల్యాణం' సినిమా చిత్రీకరణ జరిపారు. సురేష్ బొబ్బిలి 'క్రేజీ కల్యాణం' సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు.

తెర

## శ్రీ విజయ వారాహి మూవీస్ ప్రొడక్షన్ 1 లాంచ్




ఆర్యా హీరోగా పోలూరు కృష్ణ దర్శకత్వంలో ఓ యాక్షన్ థ్రిల్లర్ రూపొందుతోంది. శ్రీ విజయ వారాహి మూవీస్ బ్యానర్ పై మురుకుంట్ల అరవింద్ విజయ భారతి నిర్మిస్తున్న ఈ కొత్త చిత్రం ఈ రోజు పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైయింది. ముహూర్తపు సన్నివేశానికి దశరథ్ క్లాప్ కొట్టారు. నిర్మాత విజయ భారతి కెమరా స్విచాన్ చేయగా, నిర్మాతలు టీంకు స్క్రిప్ట్ అందజేశారు. మూవీ యూనిట్ అందరూ వేడుకలో పాల్గొన్నారు. ఈ చిత్రంలో దశరథ్, వాసుకి, ఆడుకలం నరేన్, సమ్మిట గాంధీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మార్చి మొదటి వారం నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మూవీ లాంచ్ ఈవెంట్ లో నిర్మాత మురుకుంట్ల అరవింద్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. నాకు సినిమాలంటే చాలా ఆసక్తి, నా కల మా అబ్బాయి ద్వారా తీరడం చాలా సంతోషంగా ఉంది. మా అబ్బాయికి నటన అంటే చాలా పాషన్. ముంబైలో శిక్షణ తీసుకున్నాడు. నిర్మాత విజయ భారతి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మీడియా వారి అందరి బ్లెస్సింగ్స్ ఆర్యాకి ఇవ్వాలని కోరుకుంటు న్నాను. దర్శకుడు కృష్ణ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. నేను ఇంతకుముందు రెక్కి అనే వెబ్ సిరీస్ చేశాను. అలాగే మరికొన్ని ఓటిటి చానల్స్ కి వెబ్ సిరీస్ లు చేశాను. ఇది పెద్ద కథనే అనుకున్నాం. దశరథ్ మాట్లాడుతూ.. ఈ సినిమా డైరెక్టర్ కృష్ణ గారు నాకు చాలా ఏళ్లగా మంచి మిత్రుడు. టీవీ, ఓటీటీ కంటెంట్ విషయంలో తన మంచి దిట్ట. తన రెక్కి వెబ్ సిరీస్ బ్లాక్ బస్టర్ హిట్. దర్శకుడుగా తను ఎక్కడ రాజీ పడకుండా డైరెక్షన్ చేస్తారు. హీరో ఆర్యా మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ వేడుకకి వచ్చి నన్ను బ్లెస్ చేసిన అందరికీ పేరుపేరునా ధన్య వాదాలు. నాకు ఇది అద్భుతమైన మూమెంట్. ఇదే స్టేజ్ మీద రెండేళ్ళ క్రితం నాటకం ప్రదర్శించాను.

# ఎప్పటికీ ప్రేమతో.. ఎల్లప్పుడూ నీతోనే.



భార్య సురేఖకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మెగాస్టార్ చిరంజీవి - ప్రేమతో నిండిన అద్భుత బంధానికి అందమైన వేడుక మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన స్టార్‌డమ్‌కు మించి, తనలోని భావోద్వేగాన్ని, కృతజ్ఞతను చూపించారు. తన భార్య సురేఖకు పుట్టినరోజు సందర్భంగా ఆయన రాసిన హృద్యమైన సందేశం నిజాయితీతో, ఆప్యాయతతో అభిమానుల హృదయాలను గెలుచుకుంటోంది. నా ప్రతి అడుగులో నా వెంట నడిచిన సురేఖ కు జన్మదిన శుభాకాంక్షలు 1980 ఫిబ్రవరి 20న మనం వివాహం చేసుకున్న నాటినుంచి నువ్వే నా బలంగా మారావు. ఈరోజు నీ పుట్టినరోజును, ముందుగానే మన వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ వేళ నా మనసు కృతజ్ఞతతో నిండిపోయింది. నువ్వే మన కుటుంబానికి కేంద్రబిందువు. అందరినీ ప్రేమతో కట్టిపడేసే శక్తి. నా కుటుంబ సభ్యులను నీ వారిలా చూసుకుని, ప్రతి సందర్భంలో వారికి అండగా నిలబడి, నా తల్లిదండ్రులకు నిజమైన కూతురిలా మారావు. వారు కూడా నిన్ను అంతే ప్రేమతో దగ్గర చేసుకున్నారు. నా విజయానికి రహస్యం ఏమిటి అని ఎవరైనా అడిగితే.. అది నా ప్రతిభ, కృషి కాదు 'అది నువ్వే". ఎందుకంటే నువ్వు ప్రతి బాధ్యతను తీసుకున్నావు కాబట్టి నేను నా వృత్తిపై పూర్తిగా దృష్టి పెట్టగలిగాను. ప్రతి కష్టంలోనూ, ప్రతి ఆనంద వేడుకలోనూ మనందరినీ ఒకటిగా నిలబెట్టేది నువ్వే. నువ్వు కేవలం నా భార్య మాత్రమే కాదు.. నా బలం, నా అండ, నా ప్రశాంతత.

## 'ఏ బ్యూటిఫుల్ బ్రేకప్' సక్సెస్ మీట్‌లో హీరో తక్ష్

తక్ష్, మటిల్డా హీరోహీరోయిన్లుగా నటించిన ఇంగ్లీష్ ఫీచర్ ఫిల్మ్ 'ఏ బ్యూటీఫుల్ బ్రేకప్'. అజిత్ వాసన్ ఉగ్గిన రచన, దర్శకత్వంలో ఒక ట్రెండ్ సెట్టింగ్ రొమాంటిక్ హారర్ థ్రిల్లర్‌గా రూపొంది, ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రాన్ని 5 నేచర్స్ మూవీస్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించింది. మాస్ట్రో ఇళయరాజా సంగీతంలో ముద్రగడ రంగారావు, ఉగ్గిన సత్యనారాయణరావు సమర్పించిన ఈ చిత్రం, విడుదలైన అన్ని చోట్ల ట్రెమండస్ రెస్పాన్స్‌ను సొంతం చేసుకుని, సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర దర్శకుడు అజిత్ వాసన్ ఉగ్గిన మాట్లాడుతూ.. మా చిత్రాన్ని ఇంత బాగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. చిత్ర హీరో తక్ష్ మాట్లాడుతూ.. ముందుగా మీడియాకు థ్యాంక్స్ చెప్పుకుంటున్నాను. మొదటి నుంచి ఎంతో సపోర్ట్ చేస్తూ వస్తున్నారు. ఈ వేడుకకు మా హీరోయిన్ రావాల్సి ఉంది. ఇంపార్టెంట్ ప్రాజెక్ట్ నిమిత్తం ఆమె విదేశాల్లో ఉంది. రాలేకపోయినందుకు ఆమె సారీ చెప్పారు. త్వరలోనే అందరితో మరో ప్రెస్ మీట్ చాలా పెద్దగా నిర్వహిస్తాం. గెస్ట్‌గా వచ్చిన బలగం సంజయ్ మాట్లాడుతూ.. "సినిమా టైటిల్, క్యాప్షన్ నాకు బాగా నచ్చాయి. ఈ టీమ్ వాళ్లంతా నాకు బాగా కావాల్సిన వాళ్లు. ఈ సినిమా రిపోర్ట్స్ విన్నాను. చాలా మంచి స్పందన వస్తున్నందుకు టీమ్ అందరికీ నా అభినందనలు



## 'హే బల్‌వంత్'తో హిట్టు కొట్టబోతోన్నాం..
### నిర్మాత వంశీ నందిపాటి..



సీనియర్ నటుడు నరేష్.. 'లిటిల్‌హార్ట్స్', రాజు వెడ్స్ రాంబాయ్, 'ఈషా' వంటి బ్లాక్‌బస్టర్స్ చిత్రాలను అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై హే బల్‌వంత్ అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతోన్నారు. ఈ మూవీలో సుహాస్, శివానీ నగరం, సీనియర్ నటుడు నరేష్, యాంకర్ స్రవంతి ప్రముఖ పాత్రల్ని పోషించారు. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్రరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీని ఫిబ్రవరి 20న రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో చిత్రయూనిట్ రిలీజ్ ప్రెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ..వంశీ నందిపాటి మాట్లాడుతూ.. .ఇప్పటి వరకు మా 'హే బల్‌వంత్' మూవీ గురించి చాలా సార్లు చాలా వేదికలపై చెప్పాం. 650 పైగా స్క్రీన్లలో మాసినిమాను రిలీజ్ చేయబోతోన్నాం. సీనియర్ నటుడు నరేష్ మాట్లాడుతూ.. హే బల్‌వంత్' మరింత బలవంతంగా మారి హే బల్‌వంత్‌గా రాబోతోంది. హీరో సుహాస్ మాట్లాడుతూ..'హే బల్‌వంత్' ప్రీమియర్లు ఫిబ్రవరి 19న స్టార్ట్ అయ్యాయి. ఇది నా కెరీర్‌లో బిగ్గెస్ట్ రిలీజ్, బిగ్గెస్ట్ సక్సెస్ అని అనుకోవచ్చు. మా మూవీని ఈ రేంజ్‌కు తీసుకు వచ్చిన వంశీ గారికి థ్యాంక్స్. తెలుగు సినిమాల్లో 'హే బల్‌వంత్' మెమరబుల్ ఫిల్మ్ అవుతుంది.. రిలీజ్ ప్రెస్ మీట్‌లో

# 'విష్ణు విన్యాసం' టీజర్ లాంచ్



శ్రీ విష్ణు కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు 'విష్ణు విన్యాసం' హైలీ ఎంటర్‌టైనింగ్ టీజర్ లాంచ్ కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీవిష్ణు హిలేరియస్ ఎంటర్‌టైనర్ 'విష్ణు విన్యాసం'తో థియేటర్లలో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు యదునాథ్ మారుతీ రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నయన సారిక కథానాయికగా నటించింది, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 28న థియేటర్లలోకి రానుంది. మేకర్స్ ఇప్పుడు హైలీ ఎంటర్‌టైనింగ్ టీజర్ లాంచ్ చేశారు. టీజర్ ప్రారంభం Use Headphones అనే వార్నింగ్‌తో, ఒక సరదా ఎమోజీతో మొదలవుతూ వినోదభరితమైన ప్రయాణానికి ఆహ్వానిస్తుంది. ప్రపోజల్, కిస్ సీన్లు యూత్‌ఫుల్ హ్యూమర్‌తో ఆకట్టుకుంటాయి. కామెడీలో తన ప్రత్యేకతను మరోసారి నిరూపించారు శ్రీ విష్ణు. ఆయన టైమింగ్, రియాక్షన్స్ ప్రేక్షకులకు నవ్వులు పంచాయి. సపోర్టింగ్ కాస్ట్ లో సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, సత్యం రాజేష్, శ్రీనివాస్ వడ్లమాని, గోపరాజు రమణ వంటి నటులు ఉండటంతో నవ్వుల వర్షం ఖాయం.

# అంతా భారత్‌మయం


కెనడా యువీ

- ✻న్యూజిలాండ్‌పై యువరాజ్ సింగ్ సెంచరీ
- ✻కెనడాపై ఆర్యాన్ష్ శర్మ సూపర్ హాఫ్ సెంచరీ
- ✻నమీబియాపై కదం తొక్కిన కృష్ణమూర్తి
- ✻సౌతాఫ్రికాను చీల్చి చెండాడిన నవనీత్ సింగ్
- ✻కెనడాపై గెలుపందించిన రచిన్ రవీంద్ర
- ✻నెదర్లాండ్స్‌పై 4 వికెట్లు తీసిన హార్మిత్ సింగ్

**న్యూఢిల్లీ:** భారత్–శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న పొట్టి ప్రపంచకప్‌లో టాప్‌గా వినిపించిన పేర్లు. వీరందరూ టీమిండియాలో లేకున్నా చక్కని ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వీరే కాదు చాలా మంది భారత సంతతి ఆటగాళ్లు పొట్టి ప్రపంచకప్‌లో మెరిశారు.

**యువరాజ్ సెంచరీ**

కెనడా యువీ పేరు ఈ ప్రపంచకప్‌లో మారుమోగింది. సెంచరీతో ఇరగదీశాడు. అదీ న్యూజిలాండ్‌పై. కివీస్ బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 65 బంతుల్లోనే 110రన్స్ సాధించాడు. ఇప్పటివరకు పొట్టి ప్రపంచకప్‌లో మూడు శతకాలు నమోదయితే అందులో యువరాజ్ సింగ్‌ది ఒకటి. ఇతనిదే ఇప్పటివరకు హైఎస్ట్ స్కోరు.

**అంతా మనవాళ్లే**

అమెరికా జట్టులోని శుభం సుభాష్ ఓ అర్ధసెంచరీతో పాటు 4 మ్యాచ్‌ల్లో 70.50 సగటుతో ఏకంగా 142 రన్స్ సాధించాడు. అలాగే కృష్ణమూర్తి కూడా చక్కగా రాణించాడు. ఓ మ్యాచ్‌లో అజే




యంగా 68 పరుగులతో రాణించి సత్తా చాటాడు. ముక్కామల ఏకంగా 79 పరుగులు చేసి అమెరికా జట్టులో హైఎస్ట్ స్కోరర్‌గా నిలిచాడు. కెనడా జట్టులోని ధలీవాల్ కూడా అర్ధసెంచరీతో మెరుపులు మెరిపించాడు. యూఏఈకి ఆడిన ఆర్యాంష్ శర్మ.. కెనడాపై 74 పరుగులతో కదం తొక్కాడు.

**భారత పేర్ల జపం**

పొట్టి ప్రపంచకప్‌లో ఈసారి మొత్తం 16 జట్లు 4గ్రూప్‌లుగా తలపడ్డాయి. సంచనాలు లేకున్నా క్రికెట్ కూనలు పెద్ద జట్లకు గట్టి పోటీ ఇచ్చాయి.చెమటలు పట్టించాయి.ఏ కొద్ది అదృష్టం కలిసొచ్చినా విజయాలు దక్కేవి. టీ20 ప్రపంచకప్ లో కొత్త స్టాండర్డ్ నెలకొల్పాయి.ఈ జట్ల రాణింపులో భారత సంతతి క్రికెటర్లదే కీలకపాత్ర.

**ఏకంగా 40 మంది**

గ్రూప్‌స్టేజ్‌లో ఏ జట్టు ఆడుతున్నా భారత జట్టే ఆడుతోందా అన్న అభిప్రాయం కలిగింది. కారణం చాలా జట్లలో భారత సంతతికి ఆటగాళ్లు ఉండడమే. టీమిండియాతో పాటు ఇతర దేశాల తరపున ఆడిన భారత మూలాలున్న క్రికెటర్లు పెద్దసంఖ్యలోనే ఉన్నారు. మొత్తం 40కు పైగా భారత ఆటగాళ్లు వివిధ జట్లకు ప్రాతినిధ్యం వహించారు.ఈ ఎన్నారై క్రికెటర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

**పేరుకే కెనడా**

కెనడా తరపున అత్యధికంగా భారత మూలాలున్న ఆటగాళ్లు ఆడాడు. ఈ జట్టులో ఏకంగా 11 మందిఆడడమే గాక, చక్కగా రాణించి కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా యువరాజ్ సెంచరీతో ఇరగదీశాడు. అమెరికా జట్టులో 9 మంది, ఓమన్ జట్టులో 7 మంది, యూఏఈ జట్టులో 7మంది భారత సంతతి ఆటగాళ్లు ఆడారు. అమెరికా, ఓమన్ జట్ల స్కోర్లలో భారత సంతతి ఆటగాళ్లదే లీడ్ రోల్. న్యూజిలాండ్‌కు రచిన్ రవీంద్ర, సోదీ ఆడుతున్నారు. దక్షిణాఫ్రికా, వెసిండీస్, ఇటలీ, నెదర్లాండ్ జట్లలోనూ మన ఆటగాళ్లు కనిపించారు. మొత్తంగా ప్రపంచ క్రికెట్‌లో భారత సంతతి ప్రభావం గణనీయంగా కనబడింది.

**కెప్టెన్సీ కూడా మనవాళ్ల చేతుల్లోనే**

కెనడా, అమెరికా, ఓమన్ జట్లకు సారథులుగా కూడా మనవాళ్లే వ్యవహరించారు. మొత్తంగా చూస్తే... టీ20 ప్రపంచకప్‌లో మనవాళ్లు కీలకశక్తిగా ఎదిగారు. పొట్టి ప్రపంచకప్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



హర్మీత్ సింగ్

## జింబాబ్వే సంచలనం: శ్రీలంకకు షాక్




**కొలంబో:** టీ20ప్రపంచకప్‌లో జింబాబ్వే సంచలనంకొనసాగుతోంది. ఆస్ట్రేలియాను ఇంటిదారి పట్టించిన జింబాబ్వే... శ్రీలంకను దాని సొంతగడ్డపై చిత్తుచేసింది. గ్రూప్ స్టేజ్‌ను అజేయంగా ముగించింది.

కొలంబోలో జరిగిన గ్రూప్–బి చివరి మ్యాచ్‌లో శ్రీలంక నిర్దేశించిన 179 పరుగుల లక్ష్యాన్ని నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 19.3 ఓవర్లలో అందుకుంది. తొలి వికెట్‌కు ఓపెనర్లు బ్రియాన్(48 బంతుల్లో 63 రన్స్), మరుమణి(34 రన్స్) తొలి వికెట్‌కు 69పరుగుల ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. ర్యాన్ బూరీ కూడా 23 పరుగులతో రాణించాడు. సికిందర్ రజా వస్తూనే బ్యాట్ ఝుళిపించి 26 బంతుల్లోనే 45 రన్స్‌తో జింబాబ్వే విక్టరీ ఖాయం చేశాడు. జింబాబ్వేకు టీ20 క్రికెట్‌లో ఇది రెండో అత్యధిక రన్స్ చేధన. అంతకుముందు బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 178 రన్స్‌చేసింది. ఓపెనర్ పథుమ్ నిస్సాంక మరోసారి బ్యాట్ ఝుళిపిస్తూ 62 పరుగులు సాధించాడు. మిగతా వారిలో పవన్ రత్నాయకే 25 బంతుల్లో వేగంగా 44 రన్స్ చేశాడు. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఇవాన్స్, క్రీమర్ రెండేసి వికెట్లు పడగొట్టారు.ఈ మ్యాచ్ గెలుపుతో ఆస్ట్రేలియాపై విజయం గాలివాటం కాదని జింబాబ్వే నిరూపించింది.బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణిస్తూ మునపటి జింబాబ్వేను తలపిస్తోంది. సూపర్–8లో మరిన్ని సంచలనాలకు సిద్ధమవుతోంది.

**సంక్షిప్త స్కోర్లు: శ్రీలంక–178/7(20 ఓవర్లలో)** (పథుమ్ నిసాంక 62, పవన్ రత్నాయకే 44, కుషాల్ పెరేరా 22, బ్రాడ్ ఇవాన్స్ 2/35, క్రీమర్ 2/27); **జింబాబ్వే–182/4(19.3 ఓవర్లలో)** (బెన్నెట్ 63, సికిందర్ రజా 45, మరుమణి 34, ర్యాన్ 23, దుషాన్ హేమంత 2/36)

## వింటర్ ఒలింపిక్స్‌లో దూసుకుపోతున్న నార్వే



**మిలాన్ :** ఇటలీ జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్ లో నార్వే దూసుకుపోతోంది. 34 మెడల్స్‌తో టాప్ ప్లేస్‌లో కొనసాగుతోంది. అందులో 16 స్వర్ణాలు, 8 సిల్వర్, 10 బ్రాంజ్‌మెడల్స్ ఉన్నాయి. అతిథ్య ఇటలీ సొంతగడ్డపై గతంలో కంటే ఎక్కు వ మెడల్స్ సొంతం చేసుకుంది. ఇప్పటివరకు 26 మెడల్స్‌తో రెండో స్థానంలో ఉంది. ఇటలీ ఖాతాలో 9 స్వర్ణాలు, 5 రజతాలు, 12 కాంస్య పతకాలు ఉన్నాయి. ఈసారి అమెరికా మెడల్స్‌లో వెనకబడింది. మూడో స్థానంతో సరిపెడుతోంది.ఏడు స్వర్ణాలు, 11 సిల్వర్, 6 బ్రాంజ్ మెడల్స్‌తో సహా మొత్తం 24 పతకాలతో ఉంది. ఫ్రాన్స్, నెదర్లాండ్స్ కూడా టాప్–5లో కొనసాగుతున్నాయి. ఫ్రాన్స్ ఇప్పటివరకు 6 స్వర్ణాలు సహా 19 మెడల్స్, నెదర్లాండ్స్ 6 స్వర్ణాలు సహా 15 మెడల్స్‌తో ఉన్నాయి. గత వింటర్ ఒలింపిక్స్ కంటే ఈసారి పెద్ద సంఖ్యలో రికార్డులు బద్దలయ్యాయి. ఈ క్రీడలు ఆది వారంతో ముగుస్తాయి.

## చరిత్ర సృష్టించిన హర్మన్ ప్రీత్ కౌర్



**సిడ్నీ:** భారత మహిళా క్రికెట్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఒకే ఒక్క ప్లేయర్‌గా నిలిచాడు. ఆస్ట్రేలియా జరిగిన రెండో టీ20 మ్యాచ్‌తో కలిపి అన్ని ఫార్మాట్లలో 365 మ్యాచ్‌లు ఆడింది. గతంలో ఈ రికార్డు న్యూజిలాండ్ ప్లేయర్ సూజీ బేట్స్ పేరిట ఉండేది.ఆ రికార్డును తాజాగా హర్మన్ ప్రీత్ కౌర్ అధిగమించారు. ఇప్పటివరకు 6 టెస్టులు, 161 వన్డేలు, 189 టీ20లు ఆడారు. మూడు ఫార్మాట్లలో 8 వేలకు పైగా పరుగులు సాధించారు.

కాగా ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో భారత్ 19పరుగులతో ఓడింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 5 వికెట్లకు 163 రన్స్ చేసింది. ఈ లక్ష్య చేధనలో తడబడ్డ భారత్ విమెన్ టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 144 పరుగులకే పరిమితమైంది. హర్మర్ కౌర్(36) టాప్ స్కోరర్‌గా నిలిచింది.

## అజేయంగా సూపర్–8లో విండీస్

### షాయ్ హోప్ అర్ధసెంచరీ -ఇటలీపై ఘనవిజయం




**కోల్‌కతా:** రెండుసార్లు ఛాంపియన్ వెస్టిండీస్ జోరు కొనసాగుతోంది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఇటలీని చిత్తుచేసి గ్రూప్–సి టాపర్‌గా నిలిచింది.

షాయ్ హోప్ విజృంభణతో మొదట బ్యాటింగ్ చేసిన వెసిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 165 పరుగులు చేసింది. బ్రాండన్ కింగ్, షిమ్రాన్ హెట్మైర్ సింగిల్ డిజిట్‌కే అవుటై నిరాశపరిచాడు. ఈ దశలో షాయ్ హోప్ విండీస్‌ను ఆదుకున్నాడు.ఇటలీ బౌలర్లపై విరుచుకుపడుతూ 4 సిక్స్‌లు, మరో 6 బౌండరీలతో 75రన్స్ చేశాడు. అతనికి తోడుగా ఛేజ్(24), రూథర్ ఫోర్డ్(24) కూడా రాణించడంతో విండీస్ 150 మార్కు దాటింది. 166 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇటలీ జోసెఫ్, మాథ్యూ ఫోర్డ్ దెబ్బతీశారు. వీరి ధాటికి ఇటలీ ఇన్నింగ్స్ పేకమేడలా కూలింది. 18 ఓవర్లలోనే 123 పరుగులకు ఆలౌటైంది. ఇటలీ ఇన్నింగ్స్‌లో స్ముట్(24), బెన్ మనెంటి(26) మాత్రమే రాణించారు. ఏకంగా ఆరుగురు బ్యాట్స్‌మెన్ సింగిల్ డిజిట్‌కు అవుటయ్యారు. జెపెఫ్ 4 వికెట్లు, మాథ్యూ 3 వికెట్లు పడగొట్టారు. వెస్టిండీస్ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది గ్రూప్‌సిలో అగ్రస్థానంలో నిలిచింది.

**సంక్షిప్త స్కోర్లు: వెస్టిండీస్–165/6**(20 ఓవర్లలో) (షాయ్ హోప్ 75, రోస్టన్ ఛేజ్ 24, రూథర్‌ఫోర్డ్ 24, బెన్ మనెంటి 2/37); **ఇటలీ–123 ఆలౌట్** (18 ఓవర్లలో)(బెన్ మనెంటి 26, స్ముట్స్ 24, షామర్ జోసెఫ్ 4/30, మాథ్యూ ఫోర్డె 3/19)

## డేటా సెంటర్ల విభాగంలో వచ్చే ఐదేళ్లలో 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** ప్రపంచ టెక్ దేశాలకు ధీటుగా భారత్ 2030 నాటికి 200 బిలియన్ డాలర్ల మేర డేటా సెంటర్ సామర్థ్యం పెంపువిభాగంలో పెట్టుబడులు రాబట్టుకోగలదని డెల్లాయిట్ అంచనావేసింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో మొత్తం 800 బిలియన్ డాలర్లమేర పెట్టుబడులురావచ్చని ఈ మొత్తంలోనే భారత్‌కు 200 బిలియన్ డాలర్లవరకూ పెట్టుబడులు వస్తాయని డెల్లాయిట్ టచ్ తోమట్సు ప్రకటించింది. వచ్చే నాలుగేళ్లలోనే 8 నుంచి 10 గిగావాట్ల డేటాసెంటర్ సామర్థ్యం ఏర్పాటుచేస్తామని సంస్థ డైరెక్టర్ విల్ సైమన్స్ తెలిపారు. డేటాసెంటర్ల బూమ్‌పై సంస్థ గురువారం ఒక తాజా నివేదికను విడుదలచేసింది. పునరుత్పత్తి విద్యుత్‌బేస్ పెరుగుతోందని, స్వచ్ఛ విద్యుత్ ఇపుడు భారత్‌లో కీలకం కానున్నదని అంచనావేసారు. తదుపరి దశ డేటా కేంద్రం వృద్ధికి స్వచ్ఛవిద్యుత్ మరింత దోహదం చేస్తుందన్నారు. డేటా సెంటర్లకు అవరమైన విద్యుత్ గ్యాప్‌లు లేకుండా ఇపుడు ఈ గ్రీన్‌ఎనర్జీ కీలకభూమిక పోషిస్తుందన్నారు. వచ్చే నాలుగేళ్లలోనే మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగలవని డెల్లాయిట్ భాగస్వామి అనిష్ మండల్ పేర్కొన్నారు. ఈ డేటా సెంటర్లు పీక్‌పవర్ డిమాండ్‌లో 10శాతం అదనపు సేవలు అందిస్తాయన్నారు. ప్రపంచంలోని డేటా వినియోగంలో 20శాతం భారత్‌లోనే వినియోగం అవుతోందని, అయితే డేటా సెంటర్లపరంగా గ్లోబల్‌గా 5శాతం తక్కువే ఉంటుందన్నారు. విదేశీ కంపెనీలు క్లౌడ్‌సేవలు అందించినపక్షంలో 2047 వరకూ వారికి పన్నువిరామం ప్రకటించాయి. క్లౌడ్‌కంపెనీలు భారత్‌లో డేటా సెంటర్లు ఏర్పాటుచేస్తే మరింతగా ప్రోత్సాహకాలు కల్పించడమే ఇందుకు కీలకమని ఆయన అన్నారు. భారత్ డేటా సెంటర్ సామర్థ్యం 1.5 గిగావాట్లుగా ఉందని, 8నుంచి 10 గిగావాట్లకు రానున్న ఐదేళ్లలోనే పెరుగుతుందని, అదనంగా 40 నుంచి 45 టెరా వాట్ల వినియోగం జరుగుతుందన్నారు.

## కృత్రిమమేధలో రూ.10 లక్షలకోట్ల పెట్టుబడులు

### -ముకేష్ అంబానీ వెల్లడి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో రిలయన్స్ ఇండస్ట్రీస్, జియోకలిసిభారీ పెట్టుబడులకు ముందకొచ్చాయి. రాబోయే ఏడేళ్లలో ఈ రంగంలో రూ.10 లక్షలకోట్ల వరకుపెట్టుబడి పెట్టనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ గురువారం ప్రకటించారు. ఏఐ ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్‌లో ప్రసంగించిన ఆయన, ఈ పెట్టుబడి కేవలం లాభాల కోసం కాదని, దేశ నిర్మాణం కోసం దశాబ్దాల పాటు ఆర్థిక విలువను సృష్టించే మూలధనమని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏఐ రంగంలో అతిపెద్ద సమస్య కంప్యూటింగ్ వనరుల కొరత, అధికఖర్చు అని అంబానీఅన్నారు. ఈసవాలును అధిగమించేందుకు జియో ఇంటెలిజెన్స్ ద్వారా 3కీలక కార్యక్రమా



లను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జామ్‌నగర్‌లో గిగావాట్‌స్థాయి ఏఐరెడీ డేటా సెంటర్ల నిర్మాణం ప్రారంభించామని, 2026 ద్వితీయార్థంలో 120 మెగావాట్ల సామర్థం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. రెండోది, తమకున్న గ్రీన్ ఎనర్జీ సామర్థ్యమని, ఆంధ్రప్రదేశ్, కచ్‌లలోని సౌర విద్యుత్ ప్లాంట్ల నుంచి 10 గిగావాట్ల గ్రీన్ పవర్ సిద్ధంగా ఉందని వివరించారు. మూడోది, దేశవ్యాప్తంగా ఎడ్జ్ కంప్యూటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం. దీని ద్వారా సామాన్యులకు సైతం తక్కువ ఖర్చుతో, వేగవంతమైన ఏఐ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అన్ని భారతీయ భాషల్లో ప్రపంచస్థాయి ఏఐ సామర్థ్యాన్ని సాధించడం తమ లక్ష్యమని, ఇది సమ్మిళిత వృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఏఐ ఉద్యోగాలను తీసివేయదని, కొత్తగా నైపుణ్యం గల ఉద్యోగాలను సృష్టిస్తుందని అంబానీ భరోసా ఇచ్చారు. దేశంలోని స్టార్టప్‌లు, ఐఐటీలు, పరిశోధన సంస్థలతో పాటు ప్రపంచంలోని అగ్రశ్రేణి టెక్ కంపెనీలతో కలిసి పనిచేస్తామని, ఏఐ శతాబ్దానికి భారత్‌ను సహ నిర్మాతగా నిలుపుతామని ఆయన వెల్లడించారు.




## రూ.7 లక్షలకోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

### భారీ నష్టాలు చవిచూసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఫిబ్రవరి 19:** అంతర్జాతీయంగా పెరుగుతున్న ఉద్రిక్తతలు, అధిక ముడిచమురు ధరల కారణంగా భారత స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాలను చవిచూశాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపడంతో సూచీలు రెండు వారాల్లో ఎన్నడూ లేనంతగా పతనమయ్యాయి. ఒక్కరోజులోనే రూ.7.5 లక్షల కోట్ల మేర ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,236.11 పాయింట్లు నష్టపోయి 82,498.14 వద్ద ముగిసింది. నిఫ్టీ 365 పాయింట్లు పడిపోయి 25,454.35 వద్ద స్థిరపడింది. ఈ ఏడాది ఫిబ్రవరి 1 తర్వాత సూచీలకు ఇదే అతిపెద్ద ఒక్కరోజు భారీ పతనం కావడం గమనార్హం. అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలకుతోడు ఒక్కసారిగా పెరిగిన ముడిచమురుధరలు ఫెడ్‌రిజర్వు ఫండ్‌రేట్లపై అనిశ్చితి వంటివి తోడు కావడంతో మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ వంటి కీలక రంగాల షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడం అమ్మకాల ఒత్తిడిని మరింత పెంచింది. టెక్నికల్‌గా, నిఫ్టీ కీలకమైన 25,645–25,660 సపోర్ట్ స్థాయిని కోల్పోవడంతో అమ్మకాలు వేగవంతమయ్యాయనిట్రేడర్లు అంచనావేసారు. ఈ అమ్మకాల హోరులో సెన్సెక్స్‌లోని మొత్తం 30 షేర్లు నష్టాల్లోనే ముగిశాయి. ఇండిగో, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్ వంటి షేర్లు 3.2 శాతం వరకు నష్టపోయాయి. మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.59 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.27 శాతం చొప్పున పడిపోయాయి. రంగాలవారీగా నిఫ్టీ రియల్టీ, మీడియా, ఆటో రంగాలు అత్యధికంగా 2 శాతం మేర నష్టపోయాయి. మరోవైపు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు భారత ఈక్విటీల నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. ఫిబ్రవరి మొదటి అర్ధభాగంలో వారు రూ.10,956 కోట్ల విలువైన ఐటీ స్టాక్స్‌ను విక్రయించారు. అంతర్జాతీయ అనిశ్చితి, ముడిచమురు ధరల అస్థిరత కారణంగా సమీప భవిష్యత్తులో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 1.54శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.16శాతం క్షీణించాయి. 1209 కంపెనీలషేర్లు మాత్రమే పెరిగితే 3011 షేర్లు కుదేలయ్యాయి. 159 కంపెనీలషేర్లు మాత్రం యధాతథంగా కొనసాగాయి. ఇక ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ఏప్రిల్‌రెండునాటి సెటిల్‌మెంట్లు రూ.1,55,879గా కొనసాగాయి. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 90.68 వద్దనే ఊగిసలాడింది.

## కృత్రిమమేధలో లక్షలకోట్ల పెట్టుబడులు

### గూగుల్, ఎన్విడియా, క్వాల్‌కామ్, మైక్రోసాఫ్ట్ సహా మరిన్ని సంస్థలు సిద్ధం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** కృత్రిమమేథ రంగంలో భారత్‌లో పెట్టుబడులపై పలు బహుళజాతి సంస్థలుసైతం ముందుకు వచ్చాయి. కృత్రిమ మేధ సాంకేతికత కొందరికే పరిమితం కాకుండా సామాన్యుల వరకు చేరవేసి వారి జీవితాల్లో మార్పులు తీసుకురావాలన్నదే ప్రధాన లక్ష్యంగా భారత్ తెలిపింది. సుమారు 50 మందికిపైగా ఎంఎన్‌సీల సిఇఒలు హాజరై ఒకే వేదికపై నిలిచారు. భారత్‌లోపెట్టుబడులకు అత్యంత ఆసక్తిని చూపించారు. ఇదే వేదికపై ప్రధాని మోడీ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశం భారత్. ఏఐ పరివర్తనలో భారత్ ముందంజలో ఉంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయనిఖీ అని తెలిపారు. ఏఐ రంగంలో భారత్ పురోగమిస్తోందని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రశంసించారు. ప్రపంచ స్థాయి ఏఐ కంపెనీని అందించే సామర్థం భారత్ వద్ద ఉంది. భారత్‌లోని స్టార్టప్ వ్యవస్థ అద్భుతంగా రూపాంతరం చెందుతోంది. ఇప్పటికే భారత్‌లో గూగుల్ 15 బిలియన్ డాలర్ల ఏఐ మౌలిక వసతుల పెట్టుబడులు పెట్టింది. ఇందులో భాగంగా సబ్‌సీ కేబుల్స్ నిర్మిస్తోంది. విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు. వచ్చే 10 ఏళ్లలో భారత్ మరో 2 లక్షల కోట్ల డాలర్ల టెక్ మార్కెట్‌ను అందించేందుకు సిద్ధంగా ఉందని వీసీ సంస్థ యాక్సెల్ అంచనా వేసింది. కేవలం రూ.వందతోనే ఏఐతో వైద్య,




విద్యా సలహాలు అందే రోజులు అతి త్వరలోనే వస్తాయన్నారు. ఈ దశాబ్దం చివరి నాటికి గ్లోబల్ సౌత్ దేశాల్లో ఏఐ విస్తరణ కోసం ఏకంగా రూ.4.5 లక్షల కోట్లు పెట్టుబడి పెడతామని మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. ఇందులో భాగంగా వచ్చే 2030 నాటికి భారత్‌లో 2 కోట్ల మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి తమ సంస్థల్లోనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. భారత్‌కు చెందిన ఏఐ స్టార్టప్‌ల కోసం క్వాల్‌కామ్ దాదాపు రూ.1,360 కోట్లు కేటాయించినట్లు తెలిపింది. ఆటోమోటివ్, రోబోటిక్స్ రంగాల్లోని స్టార్టప్ కంపెనీలకు ఈ నిధులు అందిస్తామని పేర్కొంది. దేశీయ తయారీ రంగం ఎఐతో మరింతగా బలోపేతమవుతుందని పేర్కొంది. భారత్ అత్యంత కీలకమైన ఏఐ హబ్‌గా మారుతోందని, దేశీయ క్లౌడ్ కంపెనీలతో కలిసి డేటా సెంటర్ల ఏర్పాటు కోసం అధునాతన ప్రాసెసర్లను సరఫరా చేయనున్నట్లు ఎన్వీడియా వెల్లడించింది. ఎల్‌అండ్‌టీతో కలిసి గిగావాట్ స్కేల్ ఏఐ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని తెలిపింది.

## లాభాలు లేవని 'స్విగ్గీస్నాక్స్' మూసివేత




**ముంబయి, ఫిబ్రవరి 19:** స్విగ్గీ కేవలం పదినిమిషాల్లోనే డెలివరీచేస్తామని ప్రకటించిన సేవల విభాగం 'స్నాక్'ను లాభదాయకత కొరవడటంతో మూసివేసింది. ఈ విభాగంలో తొలగించిన ఉద్యోగులు అందరినీ అంతర్గతంగా ఇతర విభాగాలకు బదలాయిస్తామని ప్రకటించిన స్విగ్గీ స్నాక్ యాప్‌ను గత ఏడాది జనవరిలో ప్రారంభించింది. రెండు నగరాల్లో మాత్రమే ఈ సర్వీసు కొనసాగించింది. క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్ పదినిమిషాల డెడ్‌లైన్ డెలివరీలను నిలిపివేయాలని గిగ్‌వర్కర్ల భద్రత దృష్ట్యా ఈ సర్వీసులు నిలిపివేయాలని ఆదేశించిన క్రమంలో స్విగ్గీ స్నాక్ ఈనిర్ణయం తీసుకుంది. పదినిమిషాల డెలివరీ అనేది పాపులర్ అయినప్పటికీ గిగ్ వర్కర్ల భద్రత సమస్యాత్మకం అవుతున్నదని డెలివరీ భాగస్వాములపై అనుకోని ఒత్తిడి పెరుగుతున్నదని కేంద్రం భావించి పదినిమిషాల డెలివరీ ఆప్షన్ నిలిపివేయాలని క్విక్‌కామర్స్ సంస్థలను కోరింది. రెడీ టు ఈట్ ఐటమ్స్‌గా పిలిచే స్నాక్ అనే పదాన్ని ఈ పదినిమిషాల డెలివరీకి వినియోగించిన స్విగ్గీ లాభదాయకం కాదని మూసివేతనిర్ణయానికి వచ్చింది. దీనికితోడు సంస్థ నష్టాలు కూడా పెరుగుతున్నాయి. డిసెంబరుత్రైమాసికంలో స్విగ్గీ నికరనష్టం 1065 కోట్లకు చేరింది. రాబడుల్లో మాత్రం కొంతమేర పెరిగింది. 39993 కోట్లనుంచి 6148 కోట్లవరకూ వచ్చినట్లు కంపెనీయే ఎక్స్ఛేంజిలకు ఫైలింగ్ ఇచ్చింది. ఇదేవిధంగా జెప్టో కేఫ్, బ్లింకిట్ బిస్ట్రోను ప్రారంభించాయి. మేనెలలో జొమాటో కూడా ఇలాగే హోంస్టైల్‌మీల్‌సేవలు నిలిపివేసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.